
అహల్యాసంక్రందనము



సముఖము వేంకట కృష్ణప్పనాయకుఁడు

అహల్యా సంక్రందనము

సముఖము వేంకట కృష్ణప్పనాయకుఁడు

✶

శ్రీకామేశ్వరకవి సత్యభామాసాంత్వనమును బ్రకటించునప్పుడే మాకు, మధురనాయకుల యాదరణమున వర్ధిలిన సారస్వతమును తెలుఁగునాట వ్యాప్తిగావించవలయుననెడి తలంపుగల్గినది. తంజావూరు మహారాజుల రాసిక్యము చలువను వెలసిన కావ్యగ్రంథములు, చాలకాలముక్రిందనే ముద్రితములై జనాదరణమును బడసినవి. మధురవాఙ్మయమునకు, మాయోపిన సేవలనొనరించి, యుద్ధరించుటకు సారస్వతాభిమానుల ప్రోత్సాహ, ఆదరణముల నర్థించెదము.

విజయరంగచొక్కనాథుని దళవాయిగా నుండిన వీరరాహూతుఁడు సముఖ వేంకటకృష్ణప్ప నాయకుఁడు, స్వయముగా కవియై, కవులను పోషించుచు, తెన యేలిక జాడలను, వదాన్యత్వవైఖరుల ననుగమించి, చిరప్రతిష్ఠనందినవాఁడు. అతనికృతులలతో మిగుల నుత్తమమగు నహల్యాసంక్రందనము పాఠకులకు, శృంగారకావ్యగ్రంథమండలి తృతీయప్రచురణముగా నందించుచున్నారము. మఱియు, ననుబంధములుగా నాకవియే రచియించెనన్న రాధికాసాంత్వనమను నేకాశ్వాస శృంగారప్రబంధమును, వచన సారంగధర నుండి, యాతని రచనానైపుణిని జదువరు లెఱుంగుటకు రసవద్ఘట్టము నొకదానిని, వచన జైమినిభారతము నుండి, ఆంధ్రసాహిత్యపరిషదధిపతులు, శృంగారమయమని, తమప్రచురణమున విడిచిన భాగమును—నీమూఁటినిఁ గూడ చేర్చినారము.

గ్రంథపాఠపరిశోధనావసరముల మా కత్యంతము నుపకారకులైన మిత్రుల కియ్యెడఁ గృతజ్ఞతఁ దెలుపవలసియున్నది. శిరోమణి తిరుమల వేంకట రంగాచార్యులవారు (ఆంధ్రపత్రికాకార్యాలయము, మదరాసు.) ప్రాచ్యలిఖితభాండాగారమునందున్న రెండుప్రతులను బట్టి మా 'అహల్యాసంక్రందనము' ను బరిష్కరించుట యే గాక, రాధికాసాంత్వనమును వాసి పంపినారు. శతాధికగ్రంథక ర్తలగు మద్దూరి శ్రీరామమూర్తి కవిగారు, తీరిక జేసికొని, మాకోరికను మన్నించి, ఆంధ్రసాహిత్య పరిషత్భాండాగారమునుండి, రాధికాసాంత్వనము, సారంగధర, జైమినీభారత భాగములను, శ్రమపడి, వ్రాసి యొసఁగినారు. సాహిత్యపరిషత్ గౌరవ కార్యదర్శి యగు శ్రీకొత్తపల్లి సూర్యారావుగారు, మాకు వలసిన గ్రంథములు వ్రాయించుకొనుటకు, తగిన సదుపాయములు చేసినారు. ఈసారస్వతజీవను లందరకు మావినతులు మఱి యొకమా రెఱుకపఱచుచున్నాము.

ఆంధ్రసాహిత్యపరిషత్తు భాండాగారమునందలి,
సారంగధర చరిత్ర వచనము (శిథిలమైన ప్రతి) నెం. 62
అహల్యాసంక్రందనము (అసమగ్రము) నెం. 2
వచన జై మిని భారతము నెం. 142, 308
రాధికాసాంత్వనము నెం. 177

ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునందలి,
రాధికాసాంత్వనము కాగిత ప్రతి నెం. R 199
అహల్యాసంక్రందనము కాగిత ప్రతి నెం. D 386
డిటో తాళపత్ర ప్రతి నెం. D 887

—పై వాని ఆధారమున, ముఖ్య ప్రబంధమును, అనుబంధములును బరిష్కృతములై ముద్రణము నందినవి. సారస్వతాభిమానులయొద్ద నింక పాఠభేదములుగల ప్రతులున్న మాకు దెలియఁజేసిన ద్వితీయముద్రణమున వానిఁ జేర్చెదము మఱియు నిటువలె

నుత్తమశ్రేణికి జెందిన యముద్రిత ప్రబంధములను సాహితీపరులు మాకు దయతో నొసఁగిన వానిఁ బ్రకటించుట కెల్లప్పుడును సంసిద్ధులము.

చదువరులు, మాకృషికిఁ దగిన దోహదమును సర్వదా యొసఁగుచు నితోధికముగా మాచే నాంధ్రవాణి నర్చనల నోలలాడించి చరితార్థతం బ్రసాదింతురుగాక, యని మనవి.

వ్యవస్థాపకుఁడు.

ఒక కొమ్మనే రెండుపూవులు పూసినప్పుడు, ఆకారవిశేషాల్లో, అందచందాల్లో గోరువాసి ఒకదానికొకటి తీసిపోయినా, పరిమళం హాయి చిమ్మేస్వారస్యం రెంటికీ సమానంగానే అలవడి ఉండటం సాధారణంగా సహజం. చుక్కల మినుకు మినుకుల్లో అంతదూరాన్న ఎక్కువతక్కువ లెవరెంచుతారు, వెలుగుకు ముచ్చటపడటమే కాని!

—అటు తంజావూరులో, సర్వజ్ఞుడు, సకలకలారసికుడు, రఘునాథరాయలు: ఇటు మధురలో వరాంగనా అనంగసర్వస్వమూర్తి రసికరాజు తిరుమలేందుడు. రెండురాజ్యాలూ ఒకదానికొకటి క్షాత్రమర్యాదలలో, వైరాలలో, పంతాలు సాధించుకుంటూన్నా, సారస్వతంలో జోడుపంచకల్యాణుల బారుగా హెచ్చుతగ్గుకాని కదను చూపించినవి. కన్నడసామ్రాజ్యవైభవాలలో వారసత్వంగా చిక్కించుకున్న కావ్యవినోదపారవశ్యం, దక్షిణదేశాన, హోయసల సామంతులకు జన్మహక్కు అయిపోయి, తరతరాలుగా, తామరతంపరగా ఫలించినది.

ఇద్దరు రాజులూ, తమపేరు నిలువబెట్టి తమ అంతవారయే సంతతి కలుగుతూండవలెనని, కోరుకోవడం ఉచితమేకదా: రఘునాథరాయలవైభవం విజయరాఘవునిలో కోటికి తీరి కొండయెక్కింది. తిరుమలేంద్రుని మనుమడు[1] రాజ్యమునకు వచ్చిన తరువాతగాని, మళ్లీ తొలికాలవువెలుగు జ్యోతిగా మెరయలేదు.

పితామహి మంగమ్మదేవి గారాబాలు చెల్లే పెంపకంలో, తిరుమలేంద్రుని మించగలవు అనే పెద్దల ఆశీర్వాదబలంతో చొక్కానాథుడు యుక్తవయసున రాజ్యానికి వచ్చి, ఆహోదా నిలువబెట్టగలిగాడు. సమ రాల్లో, సారస్వతవిహారాల్లో తనను మీరేవారు, ఆకాలంలో మరొకరు లేరనిపించాడు. సామ్రాజ్యపోషణలో అప్రమత్తుడుగా కళాసామ్రాజ్యాన్ని కూడా తోడునీడల్లో వర్ధిల్లచేశాడు. దేశంలో ప్రజల కన్నులూ మనసులూ ఆనందంతో విప్పారించాడు.

సముఖ మేకటకృష్ణప్పనాయకుడు[2] చొక్కనాథుని దళవాయి. కావ్యగీతావినోదాల్లో అతనితో సరిసమానుడుగా అరమరికెలు లేకుండా పాలుగొంటూండే నెచ్చెలి. స్వయముగా కవి, కవుల కాశ్రయము.[3] నిరంతరం రాజసముఖాననే ఉండటంవల్ల తిరుమలేంద్రుని కొలువులో, మీనాక్షినాయకుని[4] యింటిపేరు సముఖమని మారి అప్పటినుంచీ ఆకోవకు అదే నిలిచిపోయిందని వాడుక. నిశ్చయించే ఆధారాలు స్పష్టంగా లభించడం లేదుకాని, వేంకట కృష్ణప్పనాయకుని వంశక్రమం చెపుతూ, వెంకటపతి, పూర్వీకుల, నామములు మాత్రమే తెలుపుతూ, మీనాక్షినాయని దగ్గరకు రాగానే యింటిపేరు కలపడం, పైఆలోచనకు కొంత ఊత యిస్తూన్నది.

విజయరంగచొక్కనాథుడు విలాసచతురుడైన దక్షిణనాయకుడు అని ప్రసిద్ధిలో ఉన్న చాటువులు ఋజువు చేస్తున్నవి.

'రమ్మనెరా తనదే నే
రమ్మనెరా వంచశరుని రాపోర్చుట భా
రమ్మనెరా నీవేతన

సొమ్మనెరా విజయరంగ చొక్కవజీరా!
'మాటికి మాబోటిని నొక
చోటికి రమ్మనుచు నెనయ జూచితి...'

ఇత్యాదులు చాలా లభిస్తూన్నవి. రసికుడైన కవి. ప్రభువు సముఖాన మెలగే సదస్యులకు రాజప్రీతికని కాని, స్వయముగానే కాని, ఆధోరణులు, ఆపోకడలు అలవాటు అయిపోవడంలో వింత ఏమీలేదు. వేంకటకృష్ణప్పనాయకుడు ఒకవంక ప్రభువుతో సమానంగా అన్నివిధాలభోగాలూ అనుభవించాడు, శేషము వేంకటపతి మొదలైన కవులను పోషించాడు, తాను కావ్యాలు రచించాడు. మరోవంక, యుద్ధాలలో గడిదేరి సంగరసవ్యసాచి అనే బిరుదందుకున్నాడు.[5] విజయ రాఘవరాయలను ససైన్యంగా రూపుమాపి, తంజావూరు రాజ్యాన్ని కూలద్రో శాడు.[6] వీటన్నింటినీ మించే మరోగౌరవం పొందాడు. వాగ్గేయకారుడు క్షేత్రయ వేంకటకృష్ణప్పనాయకునిమీద పదములు రచించాడు.[7] ఈవిషయంలో మహారాజుకన్న కూడా ధన్యుడు.

ఈతడు విజయరంగచొక్కనాథునివల్ల సమస్తమర్యాదలూ పొందుతూ, మహావైభవంగా రాజు సెబాసనే ఠీవితో అతనికి కుడిభుజమై ఉండేవాడు.

వచన జైమినీభారతము వేంకటకృష్ణుని రచనలలో మొదటిది. తరువాత సంకల్పించిన అహల్యాసంక్రందనంలో దీనిప్రశంస ఉంది. నరాంకితము చేసిందల్లా దీనిని ఒకదానినే: కృతిపతి, విజయరంగచొక్కనాథుడు.

అహల్యాసంక్రందనమును కోరి కృతిపుచ్చుకున్నది, కులదైవము ప్రభువుతో నామసారూప్యమున్న, ప్రభువుల ప్రభువు - శ్రీరంగనాథుడు సారంగధర, ఆదేవునకే.

అహల్యా సంక్రందనము

వేంకటకృష్ణప్పనాయకుని రచనల్లో ఉత్తమమైనది. ఆశ్రయమిచ్చి, ఆంధ్రవాణీవిలాసములను అంత అలజడిరోజులలోనూ వన్నె తరగకుండా కాపాడుకుంటూ వచ్చిన ప్రభువుల మనసు వచనకావ్యముల మీదికి మరలినప్పటికిన్నీ, రాచబాటనే, కావ్యనిర్మాణం విషయాల్లో, అనుచరులు అనుసరించవలసిఉన్నప్పటికిన్నీ, నిరంకుశత్వం పరిపాలనలోనేకాని, కావ్యాలాపాలమీదికి మహారాజులు దుమికించనందువల్ల, కవులకు, తామేర్చి కూర్చిన కుసుమాలతో, తమ మనసుకు నచ్చేరీతుల్లో మాలలల్లి కావ్యకన్యకు నేపథ్యశృంగారపు అందాలు దిద్దడానికి వీలైంది. ఆశ్రయుడైన రసికమూర్తి వచనకావ్యములు కృతులందుతూ, కృతులుగా నిర్మించుతూ ఉంటే ఆశ్రితుడై ఆతనిచేత బహువిధముల సన్మానింపబడుతూ ఉన్న కవి-సేనాని, పద్యప్రబంధాలు భగవదర్పణ చేసి ప్రశంసలందుతూండటం కలిగింది. రాజు తలచుకొంటే, రక్తిరహదారులనే ముక్తిమార్గాలుగా మార్చగలుగుతాడుకదా!

ఇతివృత్తము, ప్రఖ్యాతంగా ఉన్నదానినే, ప్రఖ్యాతిలో, ప్రామాణికములుగా ఉన్నగ్రంథాలలోంచి సంగ్రహించుకొని, కల్పనలలో, కథాగమనచాతుర్యంలో, మాత్రం తమపనితనం చూపించడం ప్రబంధకవులలో చాలవరకు పరిపాటిగా వస్తూఉన్నది. వేంకటకృష్ణుడు తెనుగునాటను తెనుగుమీరిపోయి అన్నిమూలలా అల్లుకుపోయిన పురాణగాథను తీసుకుని, ఏదృశ్యానికి ఆదృశ్యం చదువరులకు కళ్ల యెదుట మెరసేలాగా, అన్నిదృశ్యాలూ కలసి ఏకచిత్రంగా చమకితమయే జాణతనపు ఔచిత్యం ఈప్రబంధము రచనలో ప్రదర్శించాడు. అందువల్లనే రసప్రవాహంలో, శాస్త్రరీత్యా గమనానికి ఎప్పటికప్పుడు

అడ్డుతగులుతూండవలసిన విస్తరవర్ణనలు, విప్రలంభోపాలంభఉపన్యాసాలు, గాలించినా ఇక్కడ కానరావు. మామూలు మహాప్రబంధాలు, మోడులు కిక్కిరిసి దొర్లుకు వచ్చేనదులవరదలు అయితే, అహల్యాసంక్రందనం, గాలికి చెదరి రాలే కొండపూవులను అలలమీద తేలికగా తేల్చిమోసుకుంటూ, అలసగమనంతో పరవళ్లుపోయే సెలయేరు. తిక్కనను మించిపోయింది ఈతని 'దర్శకత్వం.'

వస్తువును విశేషంమార్చకుండా, ఇతరపురాణాలలోనుంచి విచిత్రసందర్భములేమి అతుకు పెట్టుకోకుండా, రామాయణంలో పద్మపురాణంలో, అగుపించే కథనే తీసుకున్నాడు. గౌతమునియిల్లాలిని, ఏలాగైనా పొందాలని, అంతకుపూర్వం వివాహసందర్భములో విఫలమనోరథుడై పరితపించుతూన్న దేవరాజు, రాయబారాలు నడిపి, అహల్య తనయందు అనురక్త అని తెలుసుకుని, మగనిని కోడికూతతో, అర్ధరాత్రివేళ స్నానానికి సాగనంపి, ఆఅవకాశంలో, మనసుతీర్చుకుంటాడు. చేసినపనికి, ఇరువురికీ శాపాలు తగులుతవి. ఇదీ ప్రబంధంలో ఉన్నకథ. ఈసందర్భములో అహల్యకథనుగురించి కావ్యరసికు లెరుంగవలసిన విశేషాలు చాలా ఉన్నవి.

వాల్మీకిరామాయణంలో ఉన్నకథే, ఉత్తరకాండలోనూ వస్తుంది. నిజానికి సందర్భము అంతగా లేకపోయినా, బ్రహ్మదేవుడు ఇంద్రజిత్తు కోరినవరాలు యిచ్చి ఇంద్రుడిప్రాణాలు దక్కించినప్పుడు గ్రహచారం దాటడం ఎవరితరమూ కాదని ఊరడించుతూ, వెనుకటిగౌతమశాపకథను మళ్లీ ఒకమారు ఏకరువు పెట్టి ఉరిసిన పుండుమీద ఉప్పు కారము చల్లినట్టు, శచీంద్రుని అమాయకంగా ఆయాసపరచుతాడు.

అహల్య — అంటే సర్వాంగసుందరి: అవయవములలో ఆకారంలో ఏవిధమైన ఒచ్చెములున్నూ లేనిది అని అర్థమట, బ్రహ్మ అభిప్రాయంలో: ఒకేఅచ్చులో అసంఖ్యాకమైన ప్రజను సృష్టి చేసి విసిగి, వాణీపతి, లోపాలులేని క్రొత్తదనపురామణీయకం సంకల్పించి కరువునబోసి, అహల్యను నిర్మించడం కలిగింది: కుమారిలభట్టు, ఈకథ సాంకేతికమని, అహల్య - రాత్రి, ఇంద్రుడు - సూర్యుడు ఇలా తీసుకోవలసిందంటాడు. అహల్య అంటే ఊషరక్షేత్రం - ఇంద్రసమాగమంవల్ల, అంటే వర్షం కురిసి, తడిసి, ఫలించడం: ఇదో నిర్వచనం వైదికవివరణంగా ఉన్నది. బ్రాహ్మణంలో అహల్యాజారుడన్న మాటనుపట్టి, తరువాత పురాణాల్లోకి కథలు కల్పించబడినవని, మీమాంసకుల అభిప్రాయం.

ఆంజనేయుని కథలన్నీ ఒకచోట కూర్చిన పుష్పగిరి తిమ్మన్న సమీరకుమారవిజయంలో అహల్యవృత్తాంతం చిత్రంగా చెపుతాడు. ఏలాగంటే.

బ్రహ్మ, అహల్యను నిర్మించి, గౌతమమునికి భార్యగా యిచ్చిన కొంతకాలానికి ఇంద్రుడు చీకటితప్పు చేసి, భంగపడుతాడు. గౌతముడు భార్యమీద నిప్పులు చెరగడం మొదలు పెట్టడం ప్రజాపతికి తెలిసి ఆశ్రమానికి పరుగెత్తుకుంటూ వచ్చి, కొంతచమత్కారప్రసంగం చేసి [8]అల్లుడి అలుక తగ్గించి, ఆతప్పు కాయించడమే కాకుండా, ఉత్తరత్ర ఒకటి రెండలాటి తప్పటడుగులు పడినా, సహించేటట్టు మాటపుచ్చుకుని, తిరిగి వెళ్లిపోతాడు. కొంతకాలానికి, గౌతమునికి అహల్య అంజన అనే ఒకకూతురిని కంటుంది. ఆపిల్లను, ఇంద్రుడికి మొదట కన్న, వాలి అనేపిల్లవాణ్ణీ పెంచుకుంటూ, ఆదంపతులు ఖులాసాగా సంసారం చేస్తూండగా, ఒకనాడు ఋతుస్నాత అయి, కొలనుఒడ్డున తల తడి ఆరబెట్టుకుంటూ నిలుచున్న అహల్యమీద, అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడికన్ను పడుతుంది. అతడికీ మనసు చెదిరి, రథం ఆకాశంలో విడిచి, చల్లగా క్రిందకు వచ్చి, ఇంద్రుని తాత ననిపించి పోతాడు. ఆప్రణయం పండి సుగ్రీవుడు పుడతాడు. మౌనికి ఈసంగతి తెలుస్తుంది, కాని అన్నమాట తప్పేందుకు వీలు లేదుకనుక, సూర్యుడికి శాపం శాపమోక్షం మర్యాదలు జరిగించినా

అహల్యవిషయంలో చూసీచూడనట్లు ఊరుకుంటాడు. తర్వాత కొంతకాలానికి, ఇంద్రుడికి అహల్యమీద మళ్లీ మనసు మళ్లి, కోడికూత కూసి ఆమెతో కోరిక తీర్చుకుంటాడు. ఈ విషయం పసిది అంజన కనిపెట్టి తండ్రి స్నానము చేసి రాగానే ఆయనకు చెపుతుంది. అహల్య, తాను మనఃపూర్వకంగా వ్యభిచరించలేదనీ, గౌతమవేషంలో వచ్చి యింద్రుడు మోసగించటంవల్ల, ఒగ్గడంలో, పాతివత్యం నెరపుతూన్నాననన్న సదభిప్రాయమేకాని, వేరు యోజన లేదనీ, చెప్పి కోపగించవలదని మగనిని వేడుకుంటుంది. కాని లాభము ఉండదు. భార్యను శిల అయిపొమ్మని శపించి, ఆధూకుడులో ఔచిత్యము మరచిపోయి, వాలిసుగ్రీవులను, వానరులుగా పుట్టవలసిందని అనేస్తాడు. దీనివల్లనే ఇంతకు మూడిందికదా అని, వాలీ అహల్యా కలసి అంజనను కోతిరూపై పోతావని శపించి వాళ్లకసి యిలా తీర్చుకుంటారు. సుగ్రీవుడు, చెల్లెలిని ఆదరించి, భయం తీరేమాటలు చెపుతాడు.

ఇంద్రునివల్ల అహల్యకు రెండోసారి కలిగిన కొడుకు శతానందుడు. ఆకుర్రవాణ్ని గౌతముడు వెంటబెట్టుకుని వెళ్లి జనకుడియింటి పౌరోహిత్యం కుదిర్చి, అక్కడనుంచి తపస్సు చేసుకునేందుకు హిమాలయాల్లోకి వెళ్లిపోతాడు. — ఈ కథ నిజంగా కవులు అవలంబనముగా తీసుకో వలసినది. చక్కనికావ్యము, అంతకన్న చక్కనినాటకము తయారుచేయడానికి ఎన్నోవీళ్లు ఉన్నవి. అహల్య మనోగతిని, ప్రవృత్తులను వ్యాఖ్యానించి, పాప. కళంక మంటని రసమూర్తినిగా చిత్రించవలనవుతుంది.

జైనభిక్షువు ఎవడో రచించినటుల ప్రచారంలో ఉన్న ధూర్తాఖ్యాన మనే నిబంధనంలో, ఇంద్రుడు గౌతమశాపంవల్ల శరీరమంతా స్త్రీ చిహ్నాలు కలిగి, తిరిగి దేవలోకానికి పోవడానికి సిగ్గుపడి ఆశ్రమప్రాంతాన తచ్చాడుతూండగా, బ్రహ్మచారులు అవి చూసి చెడిపోతూండటం మూలాన, బలవంతాన అక్కడనుంచి అతన్ని తరిమివేశారని ఒకవిచిత్ర కల్పన ఉన్నది.

ఇలా చమత్కారాలు, ఉంటూంటవి వాని కేమి గాని, అహల్య రాయిగా మారిపోయిందా, లేక రాయి అయిపోయిందా, అనేవిషయం విచారించతగినది. రామాయణంలో, మారిపోయినట్లుగా లేదు. గిరీశబాబు తననాటకంలోనూ, ఆలాగే తీసుకొన్నాడు. నవనవోల్లాసాలతో, ఎప్పుడూ విరిపూతలతో మాతృప్రేమ మరందధార లవుతూండవలసిన మనసు, మోడై పోయింది, గుండె రాయై పోయింది, అని పద్మపురాణంలో — 'సా తతస్తస్య రామస్యపాదస్పర్శాన్మహాత్మనః, అభూత్స్వరూపా వనితా సమాకాంతా మహాశిలా' అని రాయి అయిపోయినట్టుగా ఉన్నప్పటికిన్నీ, లక్షణార్థాన్నే తీసుకోవడం ఉచితం,

వాల్మీకి, ఇంద్రు డహల్యను అంటుపరచినది ఒకమారేనని ముక్తసరిగా వదలిపెట్టేశాడు: శతానందుడు గౌతముని ఔరసుడని రామాయణోక్తం.

అహల్య యిన్ని చీకటితప్పులూ బుద్ధిపూర్వకంగా చేసిందా? అలా అని ఘట్టిగా అనడానికి వీలున్నదా? ఒకటి రెండుసార్లు ఓపికపట్టి ఊరుకుని, చివరకు, అంతకుముందల్లా లేనిది అప్పుడే ఏదో మహాముంచుకువచ్చినట్టు శాపాయుధం ఝళిపించిన గౌతముని చేతకు నసి అయిన అర్థం ఉన్నదా?

తత్వార్థాధిగమనము ఇక విరమించి, ప్రస్తుతముగా వేంకటకృష్ణప్పనాయకుని శిల్పాన్ని పరిశీలించనౌను. అతడు కవిమాత్రము కాకుండా దర్శకచాతుర్యములు కూడా అలవరుచుకొన్న విన్నాణి. అహల్యను ప్రజాపతి సృష్టి చేయవలసిన అవసరం కల్పించేందుకు ఇంద్రసభలో,ఋషులందరిచేత ఒకనాటకం ఆడించుతాడు. తగవులతో మొదలు పెట్టినకథ చివరవరకూ అలాగే నడవడం, మునుల శృంగారకళాభిప్రాయాలను

పురస్కరించుకొని వచ్చిన అహల్యారూపకల్పన, తుదకు, మునిమండలిలో ఒక అమాయకునకు విషప్రాయం కావడం, తపసుకు ఫలంగా అనుభవించుతూన్న స్వర్గవిలాసినుల ప్రోడతనాల హెచ్చుతగ్గులమీద వాదాలు తెగని మౌనుల ప్రచ్ఛన్నశృంగారప్రకటనలకు ఫలితం గౌతమునికి గార్హస్థంలో శృంగారసాహచర్యం కొన్నియుగాలవరకూ లోపించడం. విధి నిర్ణయక్రమంలో ఒడిదుడుకులు- భర్తమీద భక్తి, పరాయివానిమీద అంతరక్షోభ;వలపూ, రెండూ సరితూగినప్పుడు హృదయం ఉన్న కామిని అనుభవించే ఇవన్నీ - కావ్యం చదువుతూన్నప్పుడు భావనను గిలిగింతలు చేస్తూ తోచే సన్నివేశాలు. ఇలా అనుకునేందుకు ఆస్కారం కలిగించే రచనాప్రాగల్భ్యం వేంకటకృష్ణప్పనాయకుని సొమ్మైనది. స్థూలంగా, ఆలోచించినప్పుడు, ఇంత తోచదు. నాలుగువందలపద్యాలతో మూడాశ్వాసములుగా, చక్కనికవిత్వముతో ప్రబంధము నిర్మించినాడు అనే అనిపించినా, మానసికంగా, కావ్యరసాన్ని అనుభవంలోనికి రా జేసుకున్నప్పుడు, కవి కల్పనలో వుండేసత్తా, ప్రయోగాలు చిగిరించే అర్థశక్తి ద్యోతకమౌతుంది. అర్థవైభవం కలిమిగా ఉన్న మహాకవి, శబ్దాడంబరమును లక్ష్యము చేయడు అనడానికి 'అహల్యాసంక్రందనము' ప్రమాణము.

ఈ కథనే తీసుకుని సంగమేశ్వరుడు 'అహల్యాసంక్రందనవిలాసం' అనే ప్రబంధాన్ని రచించినాడు. అతడు ఇంద్ర అహల్యా సంగమముతో కథను, తా ననుకొనినటుల మంగళాంతముగా, గౌతముడు స్నానానంతరము సూర్యోదయమగుదాకా ఎక్కడో గడిపి యింటికి తిరిగివచ్చి, గొడవలేమీ తెలియకుండా, తెలుసుకోకుండా, సుఖంగా ఉంటూన్నాడు, అని ముగించాడు. ఇలా చేయడం ఉచితమౌనా? అహల్య అనుభవించిన తీయందనము, చివరకు అనుభవించిన బాధ మీదుగా చూస్తేనేకాని, సంపూర్ణముగా అవగతముకాదే! హృదయం వెన్నెలలో పండించుకునేందుకు, కామభోగిని, చేయగల త్యాగం, లజ్జావతి అయిన కులపాలిక చూపించగల నిర్లక్ష్యం, సహించగల యాతన, అప్పుడు కాని ఆనందానికి విలువ కట్టేందుకు వీలుపడదే! హర్షపండితుడు నలుని కథ త్రుంచివేశాడంటే, అక్కడ సబబున్నది. ఆపోలిక యిక్కడ పనికిరాదు.

వేంకటకృష్ణప్పనాయకుని ప్రబంధము ఏవిధమైన అనౌచిత్యానికిన్నీ యెడమీయదు. పాఠమా, ముదిరి కటువు పడదు. శృంగారమా, సభ్యతను ముంచివేసి ఉచ్ఛృంఖలముగా అతివేలముకాదు: కల్పనలా, బింకము తప్పవు సర్వమధురమైన సద్గ్రంథము.

రాధికాసాంత్వనము

ముద్దుపళని, 650 పద్యాలతో, రాధామాధవవిలాసాన్ని కథగా తీసుకుని ప్రబంధముగా రచించినది. ప్రతాపసింహుని ఉంపుడుకత్తె అయిన ఈమె రచన, తంజావూరు సారస్వతములో చివరగ్రంథము - అని బ్రౌను పండితుడి అభిప్రాయం. ప్రస్తుతం దొరుకుతూన్న ఏపతిలోగాని 605 కు మించి పద్యము లుండకపోవడం వల్ల అంకెలు తారుమారుగా పడినవేమో అని సమాధానము చెప్పుకోవచ్చును. తంజావూరు నాయకరాజుల చల్లని యేలుబడిలో వెలసిన కావ్యగ్రంథాలలో నిదే చివరదౌనో కాదో, రూఢిగా నిశ్చయించడానికి ఆధారములు లేవు.

ముద్దుపళని, స్వతంత్రముగానే గ్రంథము రచియించినది, అని యింతవరకున్నూ ప్రసిద్ధిఉన్నది. ఆమెవలలో చిక్కిన రాజగురువు వీర రాఘవాచార్యుడు, గ్రంథరచనలో, అంతో యింతో సాహాయ్యము చేయకుండా ఉండడని, అసలు ఆతడే రచియించి, ఆ వలపుగత్తెపేర వెలయించి ఉండటానికి కూడా వీలున్నదనీ, ఇలా, నిందెలు తప్పకుండా వస్తూన్నవి. వానికి తోడు, ఇప్పుడు వేంకటకృష్ణప్పనాయకుడు ఈ రాధికాసాంత్వనము

రచించాడని అంగీకరించేటట్లయితే, ముద్దుపళనికి ఇంత వరకూ సారస్వతంలో, ఎవరి నిర్వాహకత్వం వలనైతేనేమి, సంక్రమించి ఉంటూన్న ప్రతిష్టయావత్తూ మాసిపోయి, గ్రంథచౌర్యం చేసిన నీచురాలు అని అనవలసి వస్తుంది. ఎందుచేతనంటే, పద్యాలన్నీ ఒకటే. ఉన్నంతవరకూ సంభోగవర్ణన, అహల్యాసంక్రందనంలో ఉన్నవచనమే! కథలో, ఉపనాయిక, ఇక్కడ సత్యభామ - ఈ రవంత భేదమే తప్ప.

కాని, ముద్దుపళనికి, ఈ అపవాదు తొలగించేందుకు, సదుపాయములు, కనబడుతూన్నవి. ఏమనంటే,

సముఖ వేంకటకృష్ణప్పనాయకుడు, రాధికాసాంత్వనము ఏకాశ్వాసప్రబంధముగా నిర్మించాడు అనేందుకు, ఇతరగ్రంథాలలో కాని, అతడు రచించిన గ్రంథాలలోనైనాకాని, ఎక్కడా ఆప్రశంస కనబడదు.

ముద్దుపళనికావ్యం ద్వితీయాశ్వాసంలోనుంచి మొదలుకొని కొన్నిపద్యాలు ఏరి, చివర అహల్యాసంక్రందనము వచనమూ, ఆశ్వాసాంతగద్యమూ, కలిపి, ఇళ అన్నచోట సత్యభామ అనిమార్చి, కలగాపులగంగా, ఎవరో చిలిపితనానికి, వేంకటకృష్ణప్పనాయకుడికి ఈ అనవసరఖ్యాతీ, ముద్దుపళనికి అపఖ్యాతి కలిగించడానికి చేసినపని అనిపిస్తుందే కాని, రెండుకావ్యాలూ పరిశీలనగా చదివితే, ఒకరు సంగ్రహంగా కూర్చినదానికే మరొకరు వెనుకాముందూ అదుకులు వేసి, గ్రంథమంతా కేవల స్వకపోలకల్పితమనే ప్రతిష్ఠ కలిగించుకునేందుకు ప్రయత్నించారు అని సూచనగా అయినా కనబడకపోవడమే కాకుండా, స్పష్టంగా, ఈవిషయంలో ముద్దుపళనికి అన్యాయం జరిగిందని తెలుస్తుంది. జయంతి రామయ్యపంతులుగారు ప్రకటించిన జైమినిభారతభూమికలో రాధికాసాంత్వనము వేంకటకృష్ణప్పనాయకుని కృతి అని వ్రాయబడినది. నిడదవోలు వెంకటరావుగారు, సత్యభామాసాంత్వనం భూమికలో, ఆలాగే అన్నారు. కాని ఎవరున్నూ అలా అనడానికి కారణములు ఏమి ఉన్నవో చెప్పారు కారు.

ఇలా సందేహాస్పదంగా ఉన్నా, రాధికాసాంత్వనమును ప్రస్తుతం ఈసంపుటంలో ప్రకాశకులు చేర్చడం, ముద్దుపళని కవిత్వం తీయదనంతో మరోమారు చదువరుల నోరూరించే సాధుప్రయత్నమేకాని, ఆ రసమోహిని ప్రతిభను కళంకితము చేయాలని కాదు, అని సమాధానపడవలసి ఉంటుంది.

సారంగధర చరిత్రము

పడుచుతనంలో ఉండే కుమారుడికి సంసారసౌఖ్యం కలిగించడానికి పూనుకుని, ఆ ఉత్సాహం ఆత్మీయంగా విషమంగా అనువదించుకుని, భంగపాటు వచ్చినప్పుడు, చెదరినమనసులతో, యౌవనులైన వృద్ధులు ఇహపరదూరు లయేటట్టుగా చేసే హంగామాలో కవుల కల్పనకు తులతూగకలిగిన ఇతివృత్తలక్షణం తరతరాలుగా, మనదేశంలో, విలాయతీ సారస్వతాల్లో అనేకరూపాలలో గోచరమౌతూనే ఉన్నది. ప్రకృతికి విరుద్ధగమనం తీర్చడానికి యత్నించిఇందువల్ల రేగే ప్రళయజ్వాలలు సారంగధరకథలో ప్రత్యక్షమౌతూన్నవి.

ఈకథంతా మనదేశంలోనే జరిగిందా. ఇంతపరిహాసపాత్రమైన పని, తెలుగువారికి భారతం ప్రసాదించడానికి పూనుకున్న రాజనరేంద్రుడు చేసి ఉంటాడా? నమ్మేవీలులేదు - నమ్మవలసిన అవసరమున్నూ లేదు. చరిత్రలో రాజనరేంద్రుడి కుటుంబంలో, సారంగధరలో వచ్చే పేరు లున్నవారే లేరు. పోనీ, ఇదేమంత చరిత్రలోకి ఎక్కతగిన ఉత్తమసందర్భం అని, సారస్వతంలో నిలిచిపోలేదేమో అనుకుందామన్నా, భారతం ఉపక్రమణికలో కాకపోయినా,

వచనగ్రంథముగా అన్నా వెలయకుండా మానేదా? అప్పకవికి పూర్వం ఎవరూ ఈఘటనను తలపెట్టనేలేదు. అతని మాటల్లో నిజాయితీ ఉండేదీ లేనిదీ, తనకు నన్నయభట్టీయం సిద్ధప్రసాదమని తేల్చడంకోసం అసందర్భంగా ఆతడు ఆడిన అబద్ధాలే ఋజువు చేస్తూన్నవికదా? తెలుగులో, ఈకథను పద్యకావ్యంగా రచించి, తంజావూరు రఘునాథరాయలకు అంకితంచేసిన చేమకూర వెంకన్న కథ మాళవదేశానికి సంబంధించింది కాని, తెలుగునాట జరిగింది కాదనీ, చిత్రాంగి రాజనరేంద్రుని భోగస్త్రీకాని, మహిషి కాదనీ చెపుతూండటంలేదా? వంగదేశంలో ప్రచారంలో ఉన్న, కథలో, సారంగధరుడు, పూర్ణుడనేభక్తుడు: చిత్రాంగి, లూనా అనే ఛమర వనిత. మహాకవి గిరీశచంద్రుడు, పూర్ణచంద్ర అనే నాటకం వ్రాశాడు. ఈ ఇతివృత్తం తీసుకుని — శ్యాలకోటను, శాలివాను డనే రాజు పరిపాలించుతున్నాడు. ఇచ్ఛా అనే ఆమె అతని మహిషి. పూర్ణుడు, కుమారుడు: కొంతకాలానికి రాజు, లూనా అనే మోసగత్తెను రాణిగా చేసుకుని, అసలుభార్యను విడిచిపెడతాడు. లూనా, ఆమెతండ్రి, జాంగలికుడైన జంబూ, వీళ్లు ఇద్దరూ చేరి, రాజ్యం అపహరించాలి ఏలాగైనా అని కుట్రలు చేస్తూంటారు. లూనా, పూర్ణుడు తనను బలాత్కరించాడని రాజుతో అబద్ధము చెప్పి, - కళ్లు పొడిపించి పాడునూతిలో కూలదోయిస్తుంది. ఇక రాజును కడతేర్చడానికి, విషం పానీయంలో కలిపి త్రాగించపోయే సమయానికి, గోరక్షనాథుడనే పరమశివరూపుడైన సిద్ధుడిఅనుగ్రహంవల్ల కళ్లు వచ్చి, సన్యాసి అయిపోయిన పూర్ణుడు అక్కడకు వచ్చి తండ్రిని కాపాడుతాడు. రాజు, లూనా చేసిన ద్రోహం అప్పటికి పూర్తిగా గుర్తించినా, ఆమె అదృష్టంవల్ల, పూర్ణుని బోధలలో రాజు మనసు కరిగి ఆమెను క్షమించుతాడు. వలచి, ఆతడే దైవమని నమ్ముకుని, సమాగమంకోసం వేచుకుని ఉన్న సుందరారాణి వలపును ధన్యం చేయకుండా, ఆమెకూ, తల్లికీ ఉపదేశం చేసి వారిఅనుజ్ఞ తీసుకుని పూర్ణుడు, జీవితం సన్యాసిగానే గడపుతాడు.

ఇది, గిరీశబాబు నాటకం కథాసంగ్రహం. సారంగధరుని కథ — కథలలో, నామములలో తేడాలతో హైందవసారస్వాతంలో విశేషంగా వ్యాపించి ఉన్నది.[9] వేంకటకృష్ణప్పనాయకుడు, చేమకూర వానిని అనుసరించి, మధురమైనశైలిలో వచనసారంగధరచరిత్రను రచించాడు. ముద్రింపబడవలసిన గ్రంథములలో ముఖ్యముగా ఇది ఒకటి.

జైమిని భారతము

...ఇందు బ్రమీల యర్జునుని రాక విని, యాతని మదిలో గామించుటయు యుద్ధము జేసి యాతనిని వశపఱుచుకొని యింటికి దీసికొనివచ్చి, యాతనితో గ్రీడించుటయు మిక్కిలి పెంచి వ్రాయబడినది. ఆ భాగము ఇప్పటి లోకమునకు రుచింపదని యిందు ముద్రించుట మానివేసినారము. ఇదిగాక పరిషత్తుకు వచ్చిన రెండుప్రతులలో నొక్కప్రతియందుమాత్రమే, యట్టి విశేషవర్ణనము కనబడుచున్నది.'— ఇలా ముద్రితజైమినిభారతపీఠికలో ఉంది. లోకం అంతటిదీ ఒకేరుచి కాదని, మనకు సిద్ధాంతంగా అంగీకారం అవుతున్నప్పుడు, ఒకేఒకరు, అభిరుచి విషయంలో ఆధారం లేకుండా యావత్తు లోకానికీ ప్రాతినిధ్యం వహించడం అంతసజావు కాదేమో; ఏమైనప్పటికీ, ఉన్న ఆ ఒక్కప్రతినే ఆధారంగా చేసుకొని, వీలైనంతవరకు స్ఖాలిత్యములు రానీకుండా, పరిషత్తువారు విడిచివేసిన భాగం ఈ సంపుటంలో ముద్రించినందువల్ల, స్వల్పగ్రంథపాతములు మినహాగా, జై మినిభారతము[10] ఇంచుమించు సమగ్రంగా, లభించే అవకాశం కలిగింది. వెంకటకృష్ణప్పనాయకుని రచనను - అనౌచిత్యము, అశ్లీలత - వీని కెడమీయని భాగాన్ని అకారణంగా, త్రోసివేసే రసనీరసత్వం లోకులకు అంటగట్టడం భావ్యము కాదుగదా!

——

అనురాగవిలాసభావనలు నురుగులతరగలై యావనపూర్ణవికాసంలో మానసాంబుధిని అల్లకల్లోలం చేయడానికి తలపడిన పారవశ్యవేళల్లో, కలాచైతన్యంతో అందాలమెరుపులు స్పందించే నీ తరుణజీవనం, శాపంతో, జడమైపోయి, లాస్యము పేరుకుపోయిన చాపరాయిగా అయిపోయిందే! ఆనందజ్వాలామాలికలు, పాషాణశీతలత్వానికి దిగిపోయినవే.

గౌతమముని కోపతాపం విసురుతో, ఆదిమూర్తి అయిన క్షమాదేవి, ఓదార్పు కౌగిలింతలోకి నీవు చేరుకొని, కళంకలేశాన్ని, సర్వమూ పునీతంచేసే మృత్తికాస్నానంతో, గోటమీటేశావు. నీకు సంక్రమించిన దోషము, శాంతమూర్తి అయిన ముని హృదయకమలంలో, నీవు నేరక చేసిన తప్పిదంతో, ఔర్వాంగారాలని రగుల్పడమే. కాని, ఆతని అనుగ్రహంలో, ఆగ్రహానికి కూడా సవ్యమైన వినియోగం కలిగించేనేర్పు, తనశాంతిలో, నీకు శాంత - స్థిరావాసం - మోక్షఫలంగా ప్రసాదించడంలోనే కనిపించడం లేదా?

పతి ఈర్షాతపంలో, యౌవనవైభవ-జీవితకుసుమాలు వాడి రాలిపోయినవి, కాని, అంకురఫలితంకోసం బీజరూపములుగా, వృంతాలు వీడిపడి, నవనవోదయప్రాభవం దక్కించుకున్న పరువం వానికి ఉన్నందువల్ల, నీవు రత్నగర్భలో మరుగుపడి ఉన్నంతకాలమైనా, విశ్వలోచనులైన కవుల మానససీమలను విడనాడలేక పోయినావు.

నీవు జాణవుకావా? ప్రియులను గికురించే ప్రౌఢతనపు జాడలు ఎరుగని ముద్దరాలవా? శిలవై, బాహ్యసంచారప్రవృత్తులు అరికట్టుకున్నా, అంతర్వాహినిగా గమకించే జీవనకల్లోలినీసీకరరహస్సేచనములతో దోహదాలు దిద్ది, ఆచలువలతో, లతాళీ – ఆళీజనాన్ని వెలయించుకుని, వాని వికసనహాసాలతో, పురాతనప్రియుడైన సూర్యుడికి, వెనుకటి శృంగారగాథలు పుల్కరింతలు జేసి, నీవు ఆ చోద్యానికి మురిసిపోవడం నేర్చుకోలేదా?

పాతివ్రత్యపు వలలో, లోకమోహిని వైన నీ అలవికి మించిన అందాలని ఒడిసివేసి, ఇతరులు తేరిచూడకుండా, చీకటిపాతరలలో నిక్షేపంలాగా పదిలపరచుకున్న గౌతముని స్వార్థతపస్సమాధికి బుజుధిక్కారమేనమ్మా - నీ నవపల్లవహృదయం ఇనగరామోదాన తహతహతో కోరకించడం: యామినికి వశంగతుడై, నీకు ఆలోకనభాగ్యం అస్తమింపజేసుకునే దినరాజు త్రపాఅరుణమైన ముఖబింబం శోణ-పాండిమాభాసంతో, విప్రలంభ-దైన్యం నిట్టూర్పుగా, లయ కలిపించుకుంటుందమ్మా. ఫలరూపానికి తెచ్చుకోలేని, ప్రణయకాంక్షలు, తారకాసంతానాన్ని నీకు ప్రదర్శించి, నీమాతృహృదయాన్ని ఒరుసుకుపోయి చీకటితెరలమీద వెలుగులజాలరులు అల్లి, అరుణోదయందాకా, నిన్ను ఎంత అలయించుతా యమ్మా.

మానవలోకానికి హితోపదేశంగా అల్లుకుని పోయినా, నీప్రణయం దేవరహస్యమన్నమాట నీమనసు ఒకటే ఎరుగునేమో? చీకటిలోనే కాదూ, మునిపాదపరిచర్యలతో నవసిపోయిన నీకోమలాంగుళులు, సౌందర్యమూర్తి సంస్పర్శనకు నోచుకున్నవి. తిమిరావకుంఠనం మరుగుననేకాదూ, నీమనసునిండిన ప్రణయం నీవు కోరినతీరుల్లో పండింది! నీవు చేసింది చీకటితప్పుకాదు: అంతవరకూ, నీకన్నెతనాన్ని ఆశ్రమప్రాంతాలలో వెన్నెలగా కాయించిన, ఆతప్పు- చీకటిది.

నీది తప్పిదమని ఎవరు ఆగ్రహించారు? మాధవునికే స్వీయలైన వనదేవతలు, ప్రణయానికి ఆహుతి అయిపోయిన, నీధీరతనానికి కుసుమాంజలులుగా, వర్ణమయములైన వనసీమలను విడిచి, నీవు ఉనికి కాజేసుకున్నందువల్ల ప్రణయపుణ్యభూమి అయిపోయిన

ధూసరక్షేత్రానికి, ఫలకేదారాలను విడిచిరాని వసంతుని తర్లించుకునివచ్చి, అడవితీవెల పెనయల్లికలుగా, నిన్ను కౌగిలింతలతో సమాశ్వసించలేదా? ధరిత్రీదేవి, రంగురంగుల కీటకాల అలలు రేపి, భ్రమరగానాలు సన్నివేశరోదసిని మూర్ఛనల తేల్చేవిధానం కలిపించి, ఆశ్రమప్రశాంతికి, ప్రణయాస్థానవిలాసములు అలవరచి నీవంటరితనంలో, మధురభావనలు తీయతేనియల ధారలుగా ఊరించలేదా? అంధకారము, జడశాంతి — నీరాగహృదయంలో ప్రణయంనాటిన వెలుగుతీవలు నవలుసాగడానికి, విరులై కోరికలు సుప్రసన్నంగా విరియడానికి, కామపాలికలు, అర్థవంతంగా, నిలిపిన రక్షలు.

కాని, ఆవెలుగులు మళ్లా వెలుగులో కాని విప్పారవా? అందుకోసమేనా, ప్రణయపరిపూతమై చంద్రకాంతస్వచ్ఛమైన, నీమూర్తిలో, జీవనవిద్యుత్ప్రభలు నింపుకోవాలని, ఆమహామహుడి స్పర్శకు కాచుకుని, అలికిడికి తలఒగ్గి, యుగాలుగా, రవంత అయినా చలించని ఉత్సాహంతో, ఉండటం? పాపము అని అనరాదు, ఎందుకనీ, అదే నీ కలుషాన్ని అంతా కడిగివేసింది. శాపము. నీకు నూతనశుభ్రజీవనానికి అవకాశం కలిగించింది.

నవనవోదయవిలాసవిభ్రమాలు, నీపునరుజ్జీవితమూర్తిలో, వెలుగులుగా మెరసినా, వాటి తారళ్యాన్ని, చమకితం చేయడానికి అని అయినా, ఆ అంతులేదనుకున్న చీకటి కనుకొలకులనుండి జారిన మంచుబిందువుల బరువులు, నీ కనురెప్పలు నీలోత్పలదళాలుగా మ్రోయక తప్పదు. నీ కైశ్యము, దీర్ఘవర్షాశైవాలపుంజాలకు మెరుగులు పెడుతూండక తీరదు.

నీవు చీకటులు తెమల్చుకుని వెలుగులో తలఎ త్తడంలో- నీప్రబుద్ధ మూర్తిలో, అతిప్రాక్తనత, నవనవీనత, చిత్రరీతిలో మిళితమైపోయినవి. విరిసీ విరియని, విరికన్నెలాగా తరుణివి అవుతావు: నగరాణి లాగా, అనాదివై ఉంటావు.

✶ ✶ ✶

మహాకవి రవీంద్రుడు, అహల్యా శాపకథాకథనంలో, సుప్తభారత దేవీమూర్తికి, ప్రబోధగీతం ఆలాపించాడు. ఆయనరచనను, వివరణగా విస్తరించుకుని, ఇలా భావమును వ్యాఖ్యానించుకున్న సమాలోచనలలో, శాపాహతికి ప్రణయారంభాన్ని ఆహుతి యిచ్చుకున్న పాపరాశికి, స్మరణమాత్రాన పాపపరిహారం చేసే దివ్యప్రభావం, పాతివ్రత్యబలంచేత దక్కించుకున్న పుణ్యమూర్తులతో జతకలిపి, పంచకన్యలలో ఒకదాన్నిగా గౌరవించిన, పురాణమునుల భావ ఔదార్యం, భావనా-ఔచిత్యం, విస్పష్ట మౌతుంది.

వంకలు మిగిలిపోని అందాలకు నూతనములైన చందములలో అవయవసారూప్యసహయోగానికి అయి, సాఫల్యం ప్రసాదించి వైదికవిజ్ఞానాన్ని అన్వర్థమయిపోయేటట్టు నిలుపుకున్న పుత్రికాపతి, మనసార కన్న సంతానం, కానక కానక, కనిన మోహనమూర్తికి వశం అయిపోయిన నిరంతరప్రణయయోగరూఢిని కాని, కామ-సామగానం, ఉదాత్తధోరణీముఖరితముగా ఉద్గీథ - ప్రణయప్రణవోపాంశువు కాలేకుండా ఉండేది.

అహల్యా మధురప్రణయమధుమోహిని. ఆమెకు మనసైన పొలయలుకల కలిమినంతా, కావ్యకన్యకు సింగారపు మురిపెములు అందగించడానికి, రాసిక్యపణంతో విలుచుకున్న మధురనాయకుడి కృతి, మధురకృతులకు నాయకమే అని కావ్యానందులు అంగీకరించి తీరవలసింది.

[1] కురుగంటి సీతారామయ్యగారు తమగ్రంథాన, మధురరాజులవంశావళి యిస్తూ, తిరుమలుని కొమారుడు, ముద్దువీరప్ప, అతని కుమారుడు చొక్కనాథుడు అన్నారు. సత్యనాథ అయ్యర్ గారి ఆంగ్ల మధురనాయకచరిత్రములోనూ ఇలాగే ఉన్నది. మఱి రామయ్యపంతులుగారు మనుమడి మనుమడని రెట్టించారు. ఎందువల్ల?

[2]......జైమిని భారతమునందుగూడ నీతనివంశావతార మభివర్ణింపఁబడియుండును గాని, పరిషత్తునకు దొరికిన ప్రతులయందు నవతారికాభాగము పోయినది. శేషము వేంకటపతికవి తనవంశావతారమును వర్ణించినట్లుగా నొక్కరీతిగా సారంగధరచరిత్రయందు, నహల్యాసంక్రందనమునందును, వర్ణించుకొనిన యాతని వంశక్రమ మిట్లని తెలియుచున్నది.

కేశవప్పనాయడు (మూలపురుషుడు)
|
వేంకటనాయడు
|
పెదగురవప్పనాయడు
|
ఎల్లి సెట్టినాయడు
|
వేంకటనాయుడు = వేంకటాంబ
|
మీనాక్షినాయడు = అలమేలమ్మ
|
వేంకటకృష్ణప్పనాయడు.

—జైమిని భారతభూమితే, ఆం. సా. పరిషత్.

[3] ఇక్కవి యైదాశ్వాసముల జైమినిభారత వచనకావ్యమునే గాక సారంగధరచరిత్రమను మూఁడాశ్వాసముల వచనగ్రంథమును, అహల్యాసంక్రందనమను మూఁడాశ్వాసముల శృంగారప్రబంధమును, రాధికాసాంత్వనమనియెడి యేకాశ్వాసశృంగారప్రబంధమును రచియించెను. ఇందు మొదటిది, పాండ్యమండలాధీశ్వరుఁడగు విజయరంగచొక్కనాథున కంకితమొనర్చి మిగిలినవానిని శ్రీరంగస్వామికిఁ గృతి యొసంగెను. ఇందు జైమినిభారతము నైదాశ్వాసముల యాద్యంతములందును,

శ్రీరాధావరచరణాం
భోరుహభృంగాయమానభుజకరవీరా
ధారాఖండితశాత్రవ
శూరా శ్రీవిజయరంగచొక్కవజీరా!

ఇత్యాదిగాఁ గృతినాయకవర్ణనపద్యంబులును, బ్రత్యాశ్వాసాంతమునను, 'ఇది శ్రీపాండ్యమండలాధీశ్వర శ్రీవిజయరంగచొక్కనాథ మహీనాథ కరుణా కటాక్షసంపాదిత గజతురంగ మాందోళికాప్రముఖనిఖిల సంపత్పారంపరీ సమేధమాన సముఖమీనాక్షీనాయక తనూభవ....' ఇత్యాదిగా గద్యములు నుండుటంబట్టి యితడు

విజయరంగచొక్కభూపాలునకు సమకాలికుఁడై యాతనికిఁ గృతినిచ్చిన కేవలకవి యనియే కాక, యహల్యాసంక్రందనములో శేషము వేంకటపతికవి చెప్పినట్లుగాఁ దన్ను వర్ణించుకొనిన, 'ధైర్యమా శౌర్యమా ... శౌర్యసాంద్ర!' (1-40) అనుపద్యముంబట్టి యితఁడు పాండ్యభూనాథుని యాస్థానమందలి ముఖ్యసామాజికులలో నొకఁడైనట్లును దెలియుచున్నది. —మఱియు

తే. ...'రంగధరపతి నేను సారంగధరచ
రిత్ర వచనము చేసి తత్కృతిని నాకు
నంకితము సేయుము శుభంబు లగును నీకు
(సారంగధర ప్రస్తావన)

శా. 'వాసిన్ రంగవిభుండ నేను .. ... నీకు మేలౌనిఁకన్.
(అహల్య 1–15)

—'అని యానతిచ్చుటయు నేనును దోడన మేల్కాంచి పురోహితభృత్యామాత్యసామాజికవర్గంబులు గొలువం గూర్చుండి యుభయభాషాకవితావిశేషులైన శేషము వేంకటపతి, బుణిగె శ్రీకృష్ణకవీంద్రులు మాకాప్తసఖులు గావునం బిలిపించి, యాశుభస్వప్నంబు వినిపించుటయు ' అని సారంగధరచరిత్రమునందు, నహల్యాసంక్రందనమునందును దనకుఁ గూడ భృత్యామాత్యసామాజికవర్గము గలదని వ్రాసికొనుటంబట్టి పూర్వగద్యములో వ్రాయబడినట్లుగా నీతఁడు విజయరంగచొక్కనాథుని దయచే సామంతరాజై కొన్నిగ్రామముల కధిపతియైనట్లు కూడఁ దెలియుచున్నది.

శ్రీవిజయరంగచొక్కనాథుఁడు 1704-31 నడుమఁ బాండ్యమండల మేలినవాఁడగుటచే (ఆం. సా. ప. ప, సంపు: 2- 220) మన కవికూడ నక్కాలముననే యుండెననుట స్పష్టము. [—జైమినిభారతం పీఠికలో మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు.]

[4] మీనాక్షీ నాయకుడు ... తిరుమలనాయకుని మంత్రిగా నుండెననియొకప్రతీతి కలదు. వేంకటకృష్ణప్పనాయకుడు తిరుమలనాయకుని మనుమని మనుమడగు విజయరంగచొక్కనాథుని యాస్థానమున నుండెను. దీనినిబట్టి తండ్రికిని గుమారునికిని నడుమ నంతర మధికముగా గనుపట్టుచున్నది. వెంకటకృష్ణప్పనాయకుడు మీనాక్షినాయకుని వృద్ధదశలో బుట్టినవాడనియు, విజయరంగచొక్కనాథుని రాజ్యకాలమునందు వేంకటకృష్ణప్పనాయకుడు కూడ వృద్ధుడుగా నుండెననియు నూహించినచో నీయంతర మత్యధికముగా దోపకపోవచ్చును, గాని, వేంకటకృష్ణప్పనాయకుని తల్లియగు అలమేలక్క 'మంగమ్మసాకుడుకూతు' రను ప్రతీతి యుండుటచే, నామెభర్తయగు మీనాక్షినాయకుడు విజయరంగచొక్కనాథుని పితామహి యగు మంగమ్మదేవిక్రింద మంత్రిగా నుండెనని యూహించుటయే సమంజసముగా గన్పట్టుచున్నది. ఈ మంగమ్మదేవి, 1689–1704 వరకు విజయరంగచొక్కనాథుని సంరక్షణకర్త్రిగా రాజ్యము చేసెను. మీనాక్షినాయకుడు మధురమీనాక్షి యాలయమున కెదుట నొకమండపమును గట్టించి, యఖండదీపముగూడ నిల్పెనట, విజయరంగచొక్కనాథు డనేకధర్మకార్యములు చేసెను. శొంఠిగున్నయ్య యను నాంధ్రబ్రాహ్మణున కొకయగ్రహార మిచ్చెనట. ఈబ్రాహ్మణునిసంతతివా రిప్పటికిని నాయగ్రహార మనుభవించుచు పెరియకొళ గ్రామమందున్నారు. విజయరంగచొక్కనాథుడు గతించినపిదప నాతనిభార్య మీనాక్షమ్మ 5, 6 సంవత్సరములు మాత్రమె రాజ్యము చేసెను.

అనంతరము దేశము తురుష్కాక్రాంతమాయెను. అప్పుడు వేంకటకృష్ణప్పనాయకుని కుటుంబమువారు తమ బంధువగు వడగరై జమీందారు నాశ్రయించి, యచ్చటనే నివసించిరి ...'
—జైమినిభారత భూమికలో జయంతి రామయ్యాపంతులుగారు.

[5] వేంకటకృష్ణప్పనాయకునికి 'సంగరసవ్యసాచి' 'సంగరకిరీటి' అనేబిరుదము లుండేవని, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించిన 'తంజావూరు ఆంధ్రరాజులచరిత్రము' అనే ప్రాచీనవచనగ్రంథాన్నిబట్టి తెలుస్తున్నది. కానీ, శేషము వేంకటపతి వర్ణించినట్లుగా ఉన్న అహల్యాసంక్రందనం అవతారిక పద్యాలలో ఎంతవరకు చూసినా, వేంకటకృష్ణప్పనాయకునికి, 'లీలామనోజాకృతీ!', 'కంతుజయంతరూప' 'కవికల్పక' 'భాషాఫణిగ్రామణీ' ఇలా సందర్భానికి సరిపోయే విశేషణగౌరవములే కనపడుతూన్నవి కాని, సంగరసవ్యసాచి, సంగరకిరీటి — వీటిప్రశంసే లేదు. 'రిపుజయాధార' 'శౌర్యసాంద్ర' యిలాగని పరాక్రమాన్ని కూడా అభినందించడం మరువనివాడు, ముఖ్యవిషయములను ఎందుకు వదలివేశాడో తెలియకుండా ఉన్నది. బహుశః అప్పటికింకా ఆబిరుదులు లభించి ఉండవనుకోవలెనా? కురుగంటి సీతారామయ్యగారు, తమ ఉపన్యాససంగ్రహములో, ఈమాట ఎత్తనేలేదు.

[6] ఈ ప్రశంస కూడా, వేంకటకృష్ణప్పనాయకుని గ్రంథములలోకి ఎక్కకుండా, చరిత్రాంశంగానే నిలిచిపోవడం చూస్తే, విజయరాఘవుని జయించడంతో కాని, సంగరసవ్యసాచి సంగరకిరీటి బిరుదములు రాలేదేమో; అప్పటికే గ్రంథములు రచించడం ముగిసి చాలా కాలమైందేమో?

[7] 'రమ్మనవే. సముఖానరాయబారమేటికే' మొదలైన మూడు నాలుగు పదాలు 'వేంకటకృష్ణప్పనాయకునిమీద క్షేత్రయ చెప్పాడని వినికిడి. తిరుమలేంద్రుని ఆస్థానాన్ని ఆమహాకవి పావనంచేస్తూ మధురలో నివసించుతూండేనాటికి, వేంకటకృష్ణుడు అప్పుడే అంకురించిన యౌవనంలో విలాసవిహారాలకు కాలు దువ్వుతూండటం; ఆతనిచక్కని విగ్రహం అంతకన్న చక్కని రాసిక్యం, గమనిస్తూ క్షేత్రయ ముగ్ధుడై పోయి, ఆతనిమీద పదము లల్లడం విని, పండుముదుసలి అయిన తిరుమలేంద్రుడు ఎంతో మెచ్చుకుని, మీనాక్షీనాయడు ఏమీ కంటగించుకోకుండా సర్ది చెప్పాడనీ, దక్షిణదేశంలో భరతాభినయవిదుల సంప్రదాయంలో నిలిచిపోయినకథ.

[8]

మ. పవడంపున్ జిగివాతెఱన్ సుధయు, రంభామోహనస్ఫూర్తి యూ
రువులన్, మందగతిన్ సితేభవిభుతీరున్, దంతసంపత్తి వ
జ్రవిలాసంబు దగన్ స్వవస్తుచయవిశ్రాంతిన్ సురాధ్యక్షుఁ డీ
నవలా మేకోనె నేరికేల కినియన్ నాతప్పెగా కింతయున్.

సీ. వదనలోచన కైతవమున రాకాచంద్ర
కమలంబులకు బొండు కలుగఁజేయ
మందస్మితోష్ఠదంభంబున జంద్రికో
దయరాగములకు బాంధవ్య మునుప
గమనలీలావలగ్నచ్ఛలంబునను మ
త్తకరికేసరులకు సఖ్యంబు నెఱప

సరసభాషారదచ్ఛద్మంబునను శుకీ
దాడిమీబీజాళి దగులు పఱఫ

తే. నేఁ బ్రయత్నంబు చేసి యీ యిందువదన
సృజన చేయుట దెలియక జేసెదలుక
కుమ్మరికి నొక్కయేడును గుదియ కొక్క
పె ట్టనెడుమాట నిజము గాన్పించె నిపుడు.

తే. మందయానల డెందంబు మంద మలుకఁ
జెందనేటికి నాపల్కుఁ జిత్తగించి
యువిద కిదిగాక నేరంబు లొకటిరెండు
గావుము...
—సమీరకుమారవిజయం, ప్రథమాశ్వాసము 182-84

[9] నవనాథుల చర్యలకు ప్రధానరంగము మహారాష్ట్రదేశభాగముగా గనబడుచున్నది. శివపుత్రుడగు మీననాథుడు తండ్రివలన నధ్యాత్మవిద్యోపదేశమును బొంది, ధరణిపై జరియింపబొమ్మన, నాతనియాజ్ఞ వడసి, భూలోకమున సులలితయోగాబ్ధిచంద్రుడై, సకలదేశంబులును దిరిగి, మాళవదేశంబున, రాజమహేంద్ర నరేంద్రపరిపాలితంబగు మాంధాతపురంబున దొలుత విడిసిన వాడయ్యెను. ఈ సందర్భమున నీతడు తిరిగిన దేశములలో నాంధ్రదేశ మున్నట్లు చెప్పబడియుండలేదు. ఈతడు తొలుత వాస మేర్పఱచుకొన్నట్లుగా చెప్పబడినది, మాళవదేశమునందలి మాంధాతపురముగాని, యది యాంధ్రదేశమునం దేపట్టణమును గాదు.

ఈ మాంధాతపురాధీశుండగు రాజమహేంద్రుని కుమారుడు, సారంగధరుడు. ఈతనికథయంతయు, నీమాలవదేశగతమగు మాంధాతపురముననే జరిగెననియు, తత్ పురసమీపమునందలి కొండలలో వాస మేర్పఱచుకొనియున్న మీననాథుని యనుగ్రహమువలననే యాతనికి గాలుసేతులు మరల గలుగగా, 'చౌరంగి' యనునామమున సిద్ధుడై యాతని శిష్యులలో నొకడయ్యెననియు, నీరాజమహేంద్రుని యాలమందలను గాచు గోరక్షకుడుగూడ, నాతని ముఖ్యశిష్యులలో నొకడై, యోగసామ్రాజ్యపట్టభద్రు డయ్యెననియు జెప్పబడినది....

......మీననాథుడు కాని, యాతని 'వెంటనంటియున్న సారంగధరుడుకాని, యాంధ్రదేశమునకు వచ్చినట్టులైన గనబడదు. ఇట్లీ నవనాథుల కథలన్నియు హిందూదేశమున బశ్చిమతీరభాగమునకు సంబంధించిన ట్లగపడుచుండగా నిందు ప్రధానపురుషులలో నొక్కడును మీననాథుని తొలిశిష్యుడును నగు సారంగధరుని గూర్చినకథ యాంధ్రదేశమునకును, నందు నాయకరత్నమునుబోని రాజమహేంద్రవరమునకును సంబంధించినదిగా జిరకాలమునుండి యీదేశమున దలంపబడుచుండుట యాశ్చర్యకరము కాకమానదు ...

సారంగధరుని గూర్చిన కథలు:- మత్స్యేంద్రనాథుని యనుగ్రహమువలన సిద్ధుడై చౌరంగి యనుపేరు వహించిన యీసారంగధరునికథ భిన్నరీతుల గానవచ్చుచున్నది. మహారాష్ట్రభాషలోని నవనాథచరిత్రనుబట్టి రచింపబడిన తెలుగుగ్రంథములో, నీచౌరంగి పేరు కృష్ణాగరుడని కలదు. ఈతడు కౌండిన్యనగరాధిపుడగు శశాంగనృపాలుని పుత్రుడు. ఈతని పట్టమహిషి మందాకిని. వీరికి చిరకాలము సంతానము లేకుండుటచే వీరు మాధవుని ధ్యానించి, సంగమేశ్వరమున నాతని బూజింప, నాప్రదేశమున నొకనాడు రాజు

అర్ఘ్యంబిడుసమయంబున శివవీర్యబలంబుచే నాతని యంజలీభాగంబున నర్భకు డుద్భవించెను. అతని దెచ్చి రాజు భార్యకొసగి కృష్ణాగరుడని నామకరణంబొనర్చెను. పిదప నీతనికి వివాహము జేయ, రాజు ప్రయత్నము చేయుసమయంబున మందాకినీదేవి మరణించుటయు, రాజు, కొమరునికై యుద్దేశించిన చిత్రకూటనగరాధిపుని కుమార్తెయగు భుజావంతిని దానె వివాహమయ్యెను. ఈమె యొకప్పుడు నవయౌవనుడగు కృష్ణాగరుని జూచి మోహించి, రాజు మృగయావినోదంబున నరణ్యంబున కేగినతఱి, యొకచెలికత్తెను బంపి యాతనిం బిలిపించి, తనచిత్తంబునగల చిత్తజునితాపమును వెలిబెట్ట, నాత డతికృద్ధుడై యామెప్రార్థనమును దిరస్కరించి, తనయింటికిబోయెను. పిదప, నీవిషయము కృష్ణాగరుడు తండ్రి కెఱిగించునేమో యనుభయముచే, బరితపించుచుండు సమయంబున దనచెలికత్తెచేసిన దుర్బోధనలచే, నేరంబు కుమారునిపై వైచి, రాజునకు గోపము పుట్టించి, కరపాదఖండనము జేయించెను. అప్పుడా యూర ద్రిమ్మరుచున్న గోరక్షనాథు డీవిషయము మత్స్యనాథునికి తెలిపి, కృష్ణాగరుడు శివవీర్యోద్భవు డగుట యెఱింగి, చతురంగపీఠముపై కరచరణంబులు ఖండింపబడినకతంబున నాతనికి చౌరంగనాథ నామం బిడి తండ్రి కెఱిగించి వానిం దోడ్కొని, బదరికాశ్రమంబునకు జని, యచ్చట ఘోరతపోనియమంబున, గరచరణంబులతో గూడ, మహాసిద్ధుల నాతడు బడయునట్లు చేసి, యనుగ్రహించెను.

చేమకూర వేంకటకవి సారంగధరచరిత్రకు బీఠిక వ్రాయుచు నందాకథకు మూల మనదగిన చౌరంగికథ నవనాథచరిత్రములం దిట్లు కలదని, యాక్రింది కథను వేదము వేంకటరాయశాస్త్రులుగారు ఇచ్చియున్నారు.

రుద్రపురమున భులేశ్వరుడను రాజు కలడు, అతనికి, చంద్రావతి, శోభావతి యను నిద్దఱుభార్యలు. శోభావతి, సవతిని వేలార్చుటకై, యామెపై అంకులు మోపి, గర్భిణీయగు నామె నరణ్యమునకు వెడలగొట్టించెను. ఒకశివాలయముకడ నొకగంధర్వకన్య యామెకు మత్స్యేంద్రవ్రత ముపదేశించెను. చంద్రావతియు, మునుల యాశ్రమమున నొకసుతుని గని, చంద్రశేఖరుడని మునులచే నామకరణము చేయబడిన యాతనికి మత్స్యేంద్రోప్రాప్తి నుపదేశించెను. ఒకప్పుడు, భువలేశ్వరుడు, యజ్ఞము చేయుచుండగా, మునీశ్వరులతో గూడి యాకుమారు డచ్చుటకు బోవుటయు, యజ్ఞభూమికడ మునిశిష్యులతో బంతులాడుచున్న యాకుమారుని, శోభావతి చూసి మోహించి, యాతని బంతి తనచేటికచే చెప్పించుకొనెను. బంతియడుగబోయిన చంద్రశేఖరునికిని శోభావతికిని, పావురమడుగబోయిన సారంగధరునికి చిత్రాంగికి జరిగినవృత్తమే జరిగినది. శోభావతీప్రేరణంబున రాజు చంద్రశేఖరుని కాలుసేతులు తలారులచే దఱిగించెను. మత్స్యేంద్రనాథస్మరణముచే నాతడు కాలుసేతులు మరల బడసి తల్లియొద్దకు బోయెను. రాజు తథ్యమును దెలిసికొని శోకింప, మత్స్యేంద్రనాథు డాతనిచే బ్రాయశ్చిత్తముగా నొకశివాలయము నిర్మింపజేసెను. అదియే బదరికాశ్రమమున భులేశ్వర మనుపేరనున్న దేవాలయమట.

వీనిని బోలిన కథ యొకటి కొంతభేదముతో గన్నడభాషలో గూడ, 'కుమారరాముని కథ' యను పేరుతో బొడసూపుతున్నది.

— పదునాల్గవశతాబ్దిని కంపిలిరాయుడను రాజొకడు హంపీసమీపమున గల కంపిలినగరము పాలించుచుండెను. ఈతనికి గుమారరాముడను కుమారుడొకడు కలడు. ఈతడు మహాశూరుడు, బాహుబలపరాక్రమశాలి. దిగ్విజయార్థము బయలుదేరి, యనేకులగు రాజులనోడించి, తండ్రికి గప్పము గట్టునట్లు చేసెను...

ఒకనాడు కంపిలిరాయడు వేటకై యరణ్యమునకు బోయినసమయంబున

కుమారరాముడు స్నేహితులతో జెండాట నాడుచుండ బంతి, విధివశమున రాజు రెండవభార్యయగు రత్నాజి మేడపై బడెనట. దానిని తెచ్చుకొనుట కీత డచటికి పోయి యామె నడుగగా, నామె యీతనిని మోహించి, క్రీడాగృహమునకు రమ్మనుటయు, నాత డాపాపకార్యమున కంగీకరింపక, విదిలించుకొని పాఱిపోయేను. రా జరణ్యమునుండి యింటికి రాగానే, రత్నాజి, కుమారరాముకు తండ్రి యింటలేనిసమయయముజూచి, తనమేడకు వచ్చి తన్ను బలాత్కరించెనని కొండెములు చెప్పగా, రా జామె మాటలను నమ్మి కుమారునికి మరణదండనము విధించెను. మంత్రియగు బైచప్ప రత్నాజి చేసిన మోసమును దెలిసికొని, కుమారు నొకపాతాళగృహమున దాచి, యాతని వధించితినని రాజుతో జెప్పి, యాతనిని సమ్మతింపజేసెను. రా జన్యాయముగా గుమారుని చంపించెనన్న వార్త లోకమున వ్యాపించెను. ఈసందర్భమును, ఢిల్లీసుల్తాన్ దెలిసికొని, కంపిలిరాజ్యమును స్వాధీనము చేసికొనుటకై కొంతసైన్యముతో బహదూర్ ఖానుని బంపి, యాత డద్దానిని సాధింపలేకపోగా, తానె స్వయముగా వచ్చి కోటను ముట్టడించెను. అప్పుడు కుమారరాముడు జీవించియున్నచో, శత్రువును సులభముగా పాఱద్రోలి కోటను రక్షించియుండెడివాడని, జనులందరు రాజును నిందింపసాగిరి. ఆసమయమున బైచప్పమంత్రి భూగృహమునుండి కుమారరాముని దీసికొనివచ్చి, యాతని ముందిడుకొని, కోటవాకిలి దెఱచుటయు నాకుమారరాముడు శత్రుసేనలను జెండాడి, యావలికి బాఱద్రోలెను. కాని, ఢిల్లీసుల్తాన్ సేన లపారముగా నుండుటచే, వారితో బోరాడుచూ, కుమారరాముడు రణరంగమున బ్రాణముల విడువవలసినవాడయ్యెనట.

.. ఢిల్లీసుల్తాన్ గా నున్న తుగ్లక్ కంపిలిరాయనిపై దండెత్తి యానగరమును స్వాధీనపఱుచుకొనినట్లు, చారిత్రకనిదర్శనములు గలవు. రాజమహేంద్రవరమందు వలెనె అచ్చటను, గొన్నిస్థలములను 'చిత్రాంగిమేడ, రత్నాంగిమేడ యున్నస్థలము' అని చెప్పి చూపుచుండువాడుకయు గలదట...

మఱియు, బౌద్ధజాతకములలో గూడ, వీనిని బోలిన కథయే గలదట—
[- గౌరన ద్విపద నవనాథచరిత్ర పీఠికలో, కోరాడ రామకృష్ణయ్యగారు]

[10] ఇది అయిదాశ్వాసముల వచనకావ్యము... ఈకవి అధ్యాయక్రమమున గద్యము వ్రాయుటబట్టి సంస్కృతాశ్వమేధపర్వమును గూడ చూసినాడని చెప్పవలసి వచ్చినది. కాని, వచనరచనమంతయు, బదములు వాక్యములు సమాసములు ప్రయోగించుటలో, గూడ, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని పద్యకావ్యమునే వచనశైలిలో వ్రాసెనని చెప్పగలదు. కాని, కవి యందందు, విశేషముగా శృంగారవర్ణనాసందర్భములందును సామాన్యముగా యుద్ధవర్ణములయందు, నాసంస్కృతాంధ్రకావ్యములను రెంటిని గూడ మీఱి, యథేచ్ఛముగా గల్పనము గావించి, స్వకవిత్వమును గూడ గొంతవర కిందు జొనిపెను. మఱియు మూలమును, నాంధ్రపద్యకావ్యమును గూడ మీఱి వర్ణనాతీరేకంబునను, గథితకథనంబునను గ్రంథ మామూలాగ్రముగా బెంచి వ్రాసెను...
[— జైమిని భారత పీఠిక]

శ్రీరస్తు.



అహల్యాసంక్రందనము

ప్రథమాశ్వాసము.



శ్రీ సొబగొందు నిందుసర
          సీసరసీరుహకేసరద్యుతిన్
వీసరవోక మీసరపు
          నిగ్గుల జగ్గుల దుప్పటిన్ దటి

ద్భాసితనీలమేఘ మన
భాసిలు రంగనివాసుఁ గౌస్తుభో
ల్లాసు రమాధివాసు సవి
లాసమతిన్ నిరతిన్ నుతించెదన్. ||1||

ఉ. రంగమహీశుకొమ్మ జిగిరంగులబంగరుబొమ్మ సంపదల్
పొంగుచు నిచ్చు గుమ్మ పతిటొ మ్మొడబాయని ముద్దుగుమ్మ య
య్యంగజుఁ గన్నయమ్మ శరణార్థికి వేలుపు మ్రానికొమ్మ నె
మ్మిం గరుణించి యిచ్చు నెలమిన్ గలిమిన్ బలిమిన్ దిరంబుగన్. ||2||

ఉ. బంగరుగట్టు సింగిణియుఁ బంకజలోచన దివ్యబాణమున్
రంగుగఁ దాల్చి వ్రేల్మిడిఁ బురంబులు ద్రుంచి జగంబుఁ బ్రోచు ప్రాక్
జంగము క్షీరవారిధి నిషంగము భక్తజనావనక్రియా
చంగముఁ గీర్తిరంగ మల సౌందరలింగము నాశ్రయించెదన్. ||3||

చ. కరమునఁ జిల్కఁ బల్కఁ జిగికమ్మలు చెక్కులఁ గుల్కఁ గన్నులన్
వరకృప చిల్క మోవిఁ జిఱునవ్వుల వెన్నెల దొల్క ధాత్రికిన్
వర మొసఁగన్ గదంబవనవాటిఁ జెలంగెడిమేటి సుందరే
శ్వరుని వధూటిఁ గొల్తుఁ గృతబంధవిమోచనఁ బద్మలోచనన్. ||4||

ఉ. అంబ జగత్త్రయంబును దయం బరిపాలనచేయు సద్గుణా
లంబ సహాసకోమల కళాలలితాననచంద్రబింబ హే
రంబుని గన్నయంబ సురరత్నసమాధరబింబ మాకు ని
త్యం బఖిలాండనాయిక జయం బనయంబు నొసంగుఁ గావుతన్. ||5||

ఉ. ప్రాంచితవేదనాదము సమంచితమున్ నలుమోములన్ మరుత్
ప్రాంచిత కాంచనాచల గుహాంచలతన్ రహిమించ నీరుఁబాల్
పంచు గురాని వేడ్క మిగులన్ నడిపించు విరించి నెంచి భా
వించి నమస్కరించెద సమీహితసాహితి సేకరించఁగన్. ||6||

ఉ. సారతరంగిణీ కనకసారసరాజమరాళి కైవడిన్
హారి హిరణ్యగర్భ వదనాంతరసీమ వసించువాణి శృం
గార సరోజపాణి నవకంధర వేణి విలాసధోరణిన్
వారక నిచ్చ నిచ్చలు నివాసముచేయు మదీయజిహ్వకన్. ||7||

చ. కుడుములు చాల మెక్కి కలుగుంబలులాయపుఁదేజి నెక్కి ప్రా
నుడువుల వన్నె కెక్కి మహి నూల్కొను విఘ్నములెల్లఁ జెక్కి య
య్యుడుపతి మౌళిపాదముల కున్నతభక్తిని మ్రొక్కి భక్తులన్
విడువక ప్రోచు భవ్యమతి విఘ్నపతిన్ సుమతిన్ భజించెదన్. ||8||

సీ. రామకథా సుధారసములు వెదచల్లు
సర్వజ్ఞు వాల్మీకి సన్నుతించి
బహువేదశాఖలఁ బల్లవింపఁగఁ జేయు
భారతకవి వ్యాసుఁ బ్రస్తుతించి
నవరసవర్ణనానందహేతువులైన
కాళిదాసాదుల గణన చేసి

తెనుఁగున భారతం బొనరించి మించు న
న్నయ దిక్కమఖి నెఱ్ఱనం దలంచి
తే. ఇలను సకలరహస్యముల్ దెలుపఁజాలు
భాస్కరుని సోము నెంతయుఁ బస్తుతించి
అర్థి ఘనమార్గదర్శనులైన కవుల
సంతతంబును మన్మానసమున నెంతు. ||9||

ఉ. షండున కేల రంభ; కడు జారున కేల కులప్రచింత; పా
షండున కేల సాధుజనసంగతి; కష్ట నికృష్ట లోభియౌ
చండికి నేల నిర్మలయశంబులు; వేశ్యకు నేల సిగ్గు; దు
ష్పండితు డైనవానికిని సత్కవితారసగోష్ఠి యేటికిన్? ||10||

వ. ఇవ్విధంబున నిష్టదేవతావందనంబును సుకవిజనానందనంబును, గుకవినిందనంబునుం గావించి సకలకలికలుషతిమిరభాస్కరోదయంబును, నుల్లసితసంపత్పల్లవాసంతికావాసంబును, నవరసనిగూఢగంభీరంబునుంగానెద్దియేనియు నొక్కమహాప్రబంధంబు రచియింపఁ బూనియున్న యప్పుడొక్కనాఁటి ప్రభాతకాలంబున: ||11||

ఉ. కస్తురిబొట్టు నెన్నుదుటఁ గౌస్తుభరత్నము పేరురంబునన్
బ్రస్తుత శంఖచక్రములు బాహువులన్ నతనాభిఁ దమ్మియున్
సిస్తుగ నొప్ప భూసతియు శ్రీసతియున్ దనుఁజేరి కొల్వఁగాఁ
గస్తురిరంగసామి కలఁ గానఁబడెన్ గరుణాతిభూమియై. ||12||

వ. ఇవ్విధంబునం గనుపట్టిన యద్దేవునింగాంచి సమంచితవినయసంభ్రమంబులు మనంబునం బెనంగొనఁ బులకితగాత్రుండనై సాష్టాంగదండప్రణామం బాచరించి కరకమలపుటంబు నిటలతటంబున ఘటియించి యానందభరితుండనై యుండ నన్నుఁ గనుంగొని యద్దేవుండు గంభీరమధురభాషణంబుల నిట్లనియె. ||13||

తే. సముఖమీనాక్షినృపగర్భవిమలజలధి
చంద్ర, వేంకటకృష్ణేంద్ర, శౌర్యసాంద్ర,
మునుపు జైమిని భారత మనఁగ వచన
కావ్య మొనరించినట్టి సత్కవివి గావె! ||14||

శా. వాసిన్ రంగవిభుండు నేను, ధరణిన్ వాక్ ప్రౌఢిమన్ నీ వహ
ల్యాసంక్రందన మన్ బ్రబంధము రసోల్లాసంబుగాఁ జేయ బే
రాసం గోరి వినంగ వచ్చితిఁ బ్రియం బౌనట్లు నాపేరిటన్
భాసిల్లం దగ నంకితంబు నొనగూర్పన్ నీకు మేలౌ నికన్. ||15||

వ. అనియానతిచ్చుటయును దోడన మేలుకాంచి మేలుకాంచినహృదయంబున నుదయంబునఁ గాల్యకరణీయంబులు నిర్వర్తించి యంత దండడిమెఱయ బురోహితభృత్యామాత్యసామాజికబంధువర్గంబులు గొలువంగూర్చుండి యుభయభాషాకవితావిశేషులైన శేషము వేంకటపతి, బుణిగె కృష్ణకవీంద్రుఁడు నాకాప్తసఖులుఁ గావున వారిం బిలిపించి, యాశుభస్వప్నంబు వినిపించుటయు, వారలు సంతోషభరితాంతరంగులై శ్రీరంగవల్లభుండు శ్రీభూమిసమేతుండై నీకుం గనుపట్టెం గావున నితోధికధనధాన్య కరితురగభటకదంబకాది నానావిధసంపదలును,

బహుగ్రామభూములునుం గలుగు; సప్తసంతానంబులలో నతిశ్లాఘ్యం బైన ప్రబంధసంతానంబు నిర్మింపుమనియెం గావున శీఘ్రంబె మీతండ్రికి నీవు జనియించినచందంబున సకలగుణాధారులైన కుమారులు నీకుం గలుగుదురు; స్వామిహితకార్యఘటనాధుర్యుండవు, బంధుజనపోషకుఁడవు, శ్రీరంగపతిపదారవిందమిళిందాయమానమానసుండవుం గావున నీ కిట్టిశుభస్వప్నంబు గలిగె; భవదీయవంశావతారక్రమంబు వర్ణించెద మాకర్ణింపుమని యిట్లనిరి: ||16||

క. శరణంబులు జగముల కా
భరణంబులు వేదములకుఁ బంకజలక్ష్మీ
కరణంబులు నారాయణ
చరణంబులు నెసఁగు శూద్రజాతికి నిరవై. ||17||

క. నాలవవర్ణం బనియెడి
పాలసముద్రంబునందు భావుకలక్ష్మీ
లోలుఁడు లోకావనకరు
ణా[1]లీలుఁడు కేశవప్పనాయఁడు వెలసెన్. ||18||

ఉ. ఇంద్రుం౦ు భోగ సంపద, నుపేంద్రుఁడు రూపముచేత, నా హరి
శ్చంద్రుఁడు సత్యవాక్యమునఁ, జంద్రుఁడు కాంతినిరూఢి, చాపని
స్తంద్రత రామచంద్రుఁడు, లసన్మతి చాతురిచేత శేషభో
గీంద్రుఁడె యంచు భూమిజను లెన్నఁగఁ గేశవనాయఁ డొప్పగున్. ||19||

క. ఆ కేశవనాయనికిన్
రాకేశవదాతకీర్తిరాజితపుణ్యా
శ్లోకుఁడు వేంకటనాయఁడు
శ్రీకాంతున కబ్జభవుని చెలువునఁ గలిగెన్. ||20||

ఉ. చందురు ఱొమ్ముమెట్టి యరచందురుతాలుపు నజ్జుగిట్టి యా
నందిని ముక్కు గుట్టి సురనాయకదంతిని జెక్కు గొట్టి య
స్పందితలీల సీరి యొడిఁ బట్టి చెలంగుచుఁ గీర్తి వీనులన్
విందొనరించు నార్యులకు వేంకటనాయఁడు భూపమాత్రుఁడే! ||21||

క. పెదగురువపనాయఁడు త
త్పదమలమూర్తికిని బుట్టి శాశ్వతకీర్తిన్
గుదురై యీవిని జదురై
యెదురైన విరోధినృపుల నెల్ల జయించెన్. ||22||

క. అతనికి గలిగెను బాదా
నతశాత్రవుఁ డెల్లిసెట్టినాయఁడు రేఖా
రతిపతి భాషావాచ
స్పతి భోగానుభవమున దివవస్పతి యనఁగన్. ||23||

క. శంకరకైంకర్యపరుం
డంకభయంకరుఁడు గల్గె నతనికి నుర్వీ
సంకటహరసాయకుఁ డగు
వేంకటనాయకుఁడు భువనవిశ్రుతయశుఁడై. ||24||

సీ. ధన్యుఁడై నృపతిమూర్ధన్యుఁడై నిర్ధాత
దైన్యుఁడై నృపసంఘమాన్యుఁ డగుచు
గేయుఁడై సుజనాళిగేయుఁడై దానరా
ధేయుఁడై విద్వద్విధేయుఁ డగుచు
ధీరుఁడై కనకాద్రిధీరుఁడై కదనహం
వీరుఁడై సద్గుణహారుఁ డగుచు
శీలుఁడై హరిభక్తిశీలుఁడై సంగీత
లోలుఁడై కవిబృందపాలుఁ డగుచు
తే. సకలబాంధవసంతోషి సత్యభాషి
స్వామిహితకారి స్వజనరక్షణవిహారి
వెలయు బహుసంపదలచేత విబుధభాగ్య
దాయకుండైన వేంకటనాయకుండు. ‖25‖

క. ఆనరపతి వేంకటమా
మానినిఁ బెండ్లాడి వరకుమారునిఁ బడయన్
దానతపోధ్యానాదు ల
నూనగతిన్ పెద్దకాల మొనరించుతఱిన్. ‖26‖

క. భూనుతు లాదంపతులకు
మీనాక్షీసుందరేశ మృదుపదపద్మ
ధ్యానాక్షయవిభవుం డగు
మీనాక్షయనృపతి గల్గె మేదురయశుఁడై. ‖27‖

సీ. మక్కువ మీఱంగఁ జొక్కనాథస్వామి
తనమహాలింగమధ్యంబు వెడలి
చంద్రరేఖాజటాశార్దూలచర్మాహి
డమరుత్రిశూలముల్ కొమరుమిగులఁ
గలలోనఁ గనుపట్టి కరుణాకటాక్షముల్
చెలఁగఁ గటాక్షించి చేరఁ బిల్చి
కేలిశూలమ్ము డాకేలఁ గైకొని హస్త
మస్తకసంయోగ మాచరించి
తే. ఆయురారోగ్యపుత్రపౌత్రాభివృద్ధి
ధనకనకవస్తువాహనతతుల విమల
తత్త్వవిజ్ఞాన మొసఁగె నేధార్మికునకు
నతఁడు కేవలనృపుఁడె మీనాక్షివిభుఁడు. ‖28‖

సీ. కప్పుమీఱినకందిపప్పులకుప్పలు
రాజ్యంబు వెలసేయు నాజ్యములును
బహుపుణ్యఫలపరిపాకముల్ శాకముల్
నిచ్చమెచ్చుల నిచ్చుపచ్చడులును
విప్పడంబుల నొప్పు నప్పడంబులరాసు
లతిరసంబులు వడ లతిరసములు
చంద్రమండలసుప్రసన్నము లన్నముల్
ప్రతిసుధారసములు పాయసములు
తే. వెలయ మృష్టాన్నసత్రముల్ వెట్టి సేతు

బాట నల్లూరులోపలఁ దేటతీయ
నీటిమేటితటాకంబు నిధి యొనర్చె
మేదినీశ్వరమాత్రుఁడే మీనవిభుఁడు. ॥29॥

సీ. ఈలంపునీలంపు మేలికంబంబులు
కులశైలజాలంబు కొమరుఁదాల్ప
రంగారుబంగారు వ్రాఁతచిత్రంబులు
కిన్నరనరసురాకృతులు గాఁగ
నేతులజోతులనెఱి దీపమాలికల్
తారకాగ్రహములదారి మీఱ
నెఱమట్టుకటిపట్టు నిగ్గుచందువపొందు
ఘనఘనాఘనముల గరిమఁబూన
తే. నిండుమెండున బ్రహ్మాండమండలంబు
రహి మహామంటపంబు సద్భక్తియుక్తి
సుందరేశ్వరుసన్నిధిఁ జంద మొంద
నమరఁ గట్టించె సముఖమీనాక్షివిభుఁడు. ॥30॥

క. బంగారుబొమ్మయుం బలె
రంగారన్ వన్నెవాసి రాణింపంగా
రంగగు నలమేలమయను
నంగన నాథునుఁడు పెండ్లియై విలసిల్లెన్. ॥31॥

చ. కులమును శీలమున్ విభునికూర్మియు బాంధవపోషణంబు ని
శ్చలపతిభక్తి సత్యమును జక్కఁదనంబును గల్గి యొప్పుచున్
జలధరనీలవేణి నవసారసపాణి మనోజ్ఞవాణి యా
మెలఁతలమేలుబంతి యలమేలమయింతి చెలంగెఁ గీర్తులన్. ॥32॥

సీ. పంకజాతము డించి పతి డెంద మలరించి
కలుముల వెదచల్లు కమలపాణి
వృత్తభేదము లేక విభుసమ్ముఖాలోక
మాన్యయై పొలుపొందు మంజువాణి
వామవర్తన డిందివరు నైక్యముం జెంది
మహనీయయౌ సర్వమంగళాఖ్య
ఒకచాయఁ జేయక యొగి నాథుఁ బాయక
రాజద్గుణాఢ్యయౌ రమ్యసంజ్ఞ
తే. యనుచుఁ బొగడఁగఁదగిన తొయ్యలులమిన్న
సరసవాగ్జితనవమాధ్వి పరమసాధ్వి
ఘనయశోపల్లి యాశ్రితకల్పవల్లి
మహితగుణపేటి యలమేలమావధూటి. ॥33॥

సీ. పలికెనా కపురంపుఁబలుకులరాసులు
ఘుమఘుమ వాసించి కొమరుమించుఁ
గనువిచ్చి చూచెనా కటికల్వరేకుదొం
తరవసంతములసంతనలు మీఱుఁ
జిఱునవ్వు నవ్వెనా నెఱచందమామ వె

న్నెలకన్న మిన్నవన్నెలు చెలంగు
కలికినెన్నడ ముద్దు గులికెనా రాయంచ
కొదమజొంపముల సంపదలు పొదలు
తే. సరససంగీతసత్కళాశారదాంబ
వినుతపాతివ్రతిఁ గుమారుఁ గనినయంబ
సకలజనమాన్య సాధురక్షణవదాన్య
వెలయు నలమేలమకు సాటి కలిమిబోటి. ॥34॥

శా. ఆరామామణి మీనభూవిభుఁడు దా మత్యంతభక్తిన్ సదా
శ్రీరాజిల్లఁగ వేంకటాచలపతిన్ శ్రీకృష్ణునిం గొల్వఁగా
వీరాగ్రేసర, నీవు గల్గితి జగద్విఖ్యాతకీర్తిప్రభల్
మీఱన్ వేంకటకృష్ణభూప సుకృతీ లీలామనోజాకృతీ! ॥35॥

సీ. చిగురుజిరారౌతుఁ జెనఁకుచక్కఁదనంబు
కదనంబు రిపులఁ బుల్గరవఁజేయుఁ
జేయుదన్వత్కర్ణశిబిదానశీలంబు
శీలంబు ధర్మదాక్షిణ్యశాలి
శాలిధాన్యసువర్ణసహితమ్ము భవనమ్ము
నమ్మువారికి నిధానమ్ము మాట
మాటఁజూచును ధైర్యమహిమ జాళ్వాగట్టు
గట్టురాయల్లునిఁ గదుముఁగడఁక
తే. కడకనులయందె వసియించుఁ గమలవాస
వాసవ పురారి మురవైరి భక్తి దొరలు
దొరలు నీసరి యగుదురె దరహసముఖ
సముఖ వేంకటకృపేంద్ర, శౌర్యసాంద్ర! ॥36॥

సీ. చదువఁగా నేర్తువు శారదాశారదా
జ్ఞాననానూపురార్భటుల ధాటిఁ
బాడఁగా నేర్తువు పండితాపండితా
కర్ణనానందసంఘటన పటిమఁ
బలుకఁగా నేర్తువు భావజాభావజా
టాపగాటోపనిరర్గళోక్తి
దగ వ్రాయనేర్తువు తారకాతారకా
నీకరేఖాసమానేకలిపుల
తే. మెచ్చనేర్తువు కవితలమేల్మిఁ దెలిసి
యిత్తు వేనుఁగు పాఁడిగా నెలమిఁ గవుల
కన్నిగుణములు నీయందె నమరె నౌర!
రిపుజయాధార వేంకటకృష్ణధీర! ॥37॥

ఉ. ఎంతయొయార మెంతసొగ సెంతపరాక్రమ మెంతరాజసం
బెంతవిలాస మెంతనయ మెంతవదాన్యత యెంతఠీవి మేల్
సంతతశౌర్యధాటి విలసద్గుణపేటికిరీటి వన్నిటన్
కంతజయంతరూప, కవికల్పక, వేంకటకృష్ణభూవరా! ॥38॥

సీ. వింటివా నీవంటి వింటివాని ధరిత్రి

గంటి నే నల్ల ముక్కంటి నొకని
సారిగా నీ వొక్కసారి గాటపువీథి
దూరుచోఁ బొదలలోఁ దూరు రిపుఁడు
వింతమీఱంగ నీ వింత మీటినఁ దేజి
మంతుకృద్వైరిసామంతు నణఁచు
వేదండ మెక్కి నీ వే దండ వచ్చినా
వే దిక్కు సొచ్చు దా వేది పరుఁడు.
తే. ఉన్నతోన్నతి నెన్నుచో మిన్న వీవె
నిన్ను సన్నుతి సేయును బన్నగపతి
విమలచారిత్ర మీనభూవిభునిపుత్ర
సముఖ వేంకటకృష్ణేంద్ర శౌర్యసాంద్ర! ||39||

సీ. ధైర్యమా శౌర్యమా దాక్షిణ్యమా పుణ్య
మా నయమా జయమా ప్రతాప
మా శుభరూపమా మహితవిజ్ఞానమా
దానమా భోగమా శ్రీనిరూఢ
యోగమా యాశ్రితవ్యూహసంరక్షణ
రాజద్విలాసమా రమ్యమంద
హాసమా మహితసౌహార్దస్వభావమా
భావమా భూరిప్రభావమాన్య,
తే. నీకె తగునంచుఁ బాండ్యభూనేత విజయ
రంగచొక్కేంద్రుఁ డత్యంతరంగసబహు
మానసామాజికత్వ మిం పూన నొసఁగె
సముఖ వేంకటకృష్ణేంద్ర శౌర్యసాంద్ర! ||40||

మ. నలనాసత్యవసంతులం(?) గెలుచు సౌందర్యంబు ధైర్యంబు దో
ర్బలమున్ స్వామిహితానువృత్తి దయయున్ ప్రౌఢత్వమున్ విద్యయున్
వెలయన్ బాల్యమునందె నీవు మధురోర్వీనాథు మెప్పించవా
భళిరా, వేంకటకృష్ణభూవరమణీ, భాషాఫణిగ్రామణీ! ||41||

క. అందముగ నహల్యాసం
క్రందనమున్ రచన సేయఁగా నేరుతువౌ
పొందుగ మధురిమ జగదా
నందము ఘటియింపు మనుచు నను నిట్లనఁగన్. ||42||

వ. నేనును బ్రమోదభరితమానసుండనై. ||43||

———♦ షష్ఠ్యంతములు ♦———

క. హరికి నవనవనీతా
హరికి సకలగుణరత్నహారికి మురసం
హరికి మందరధారికి
క్ష్మారమణీమణిమనోనుసారికి హరికిన్. ||44||

క. హాటకమయచేలునకున్

ఘోటకచటులప్రచారగుణశీలునకున్
పాటితరిపుజాలునకున్
నాటితనానాప్రపంచనటజాలునకున్. ||45||

క. చూటీకుడుత్త నాచ్చా
ర్చూడాసంబంధగంధి సుమసరధృతికిన్
క్రీడాపల్లవపతికిన్
నీడజకులసార్వభౌమ నిర్భరగతికిన్. ||46||

క. అభిసరణరమిత నిచుళా
ప్రభుకన్యామణికిఁ గైటభద్విపసృణికిన్
వభసదురస్స్థలశుభకౌ
స్తుభవాసరమణికి దమితదుర్దమఫణికిన్. ||47||

క. శస్తునకున్ రక్షణకృత
హస్తునకున్ వాసవునకు నాత్మీయతనూ
విసారితభువనునకున్
కస్తూరీరంగపతికిఁ గరుణాకృతికిన్. ||48||

వ. అంకితంబుగా నాయొనర్పంబూనిన యహల్యాసంక్రందనంబను
మహాప్రబంధంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన: ||49||

శా. శ్రీరంజిల్ల నహల్య మౌనిసతియై వృత్రారిపై మోహ మే
దారిం గూరిచెఁ దానఁ గల్గిన దురంతం బైన శాపంబునున్
శ్రీరామాంఘ్రిరజంబు లెవ్విధము దీర్చెన్ బల్కుమం చీసమా
చారంబున్ జనమేజయుం డడుగ వైశంపాయనుం డిట్లనున్. ||50||

మ. పదియార్వన్నియరెక్కపక్కి నొకరాబాబావజీరుండు సాం
ద్రదయాంగీకృతయౌవరాజ్యభరతన్ రక్షింప లోకత్రయీ
విదితంబై యమరావతీపురము శోభిల్లున్ వియద్వాహినీ
మృదువాతూలవినీతదివ్యయువతీక్రీడాపరిశ్రాంతియై. ||51||

చ. సురమణి ముద్దుమోవి సుధ చొక్కపునవ్వు బలారివాహముల్
కురులు, సురద్రు గుచ్ఛములు గుబ్బలు, వేలుపువాఁక యచ్చపున్
మెఱుఁగు మఱుంగునై , చికిలి మించఁగఁ దత్పురలక్ష్మి కాంతివి
స్ఫురణభవిష్ణు విష్ణుపదభూషణమై చెలువొందు నిచ్చలున్. ||52||

తే. మండలీభూతశక్రకోదండ మనఁగ
దైత్యచక్రాంగకంపనోద్దండ మగుచు
రమ్యఘృణిజాత నూత్నచిరత్నరత్న
ఝాటమై దీటుమీఱు నవ్వీటికోట. ||53||

ఉ. రాణఁ జెలంగునప్పురవరంబున నుండు జనుల్ నిజాశ్రిత
త్రాణధురాధురంధరులు దానయశఃపరిశోభితాత్మకుల్
ప్రాణిదయాళు లౌట యొకబాధమె యచ్చట నుండునట్టి పా
షాణము వృక్షముల్ పసులు సైత మభీష్టము లిచ్చుచుండఁగన్. ||54||

సీ. అచ్చుటికలభంబు లజుపీతకమలంబుఁ
జేనంటి నైషాదశిక్ష నుడుగు
నచ్చుటి తురగంబు లభ్రకేశునిమౌళిఁ
గుప్పించి సాదులు ద్రిప్ప మరలు
నచ్చుటి యరదంబు లవ్విష్ణురథమును
దలమీఱి సారథుల్ నిలుప నిలుచు
నచటిభటు లజాండ మవియవ్రేయఁ దలంచి
యది నీరు బుగ్గయం తనుచునెంతు
తే. రచటి పాత్రలు నృత్తవిద్యానిరూఢిఁ
బూని శారద వెలవెల వోవ నాడి
యాదిగురువని మ్రొక్కుదు రమరపురముఁ
గోరి వర్ణింపఁబూన నెవ్వారితరము? ||55||

చ. వసువులకెల్ల సంతతనివాసము విశ్వవిభూతి కాశ్రయం
బెసఁగు ననంతరత్నముల కిమ్ము మహాసుమనఃప్రకాండ సం
వసతి మరుద్గణాంచితము వల్గుసుధర్మము సౌమ్యజీవహ
ర్షసదనమై చెలంగు నమరావతి నెన్నఁదరంబె యేరికిన్? ||56||

మ. వరబృందారకగర్భయౌ పురరమావామాక్షికిన్ బ్రహ్మ భీ
కరదైత్యగ్రహశాంతికై సలిలచక్రవ్యాజ వర్ణాంకశం
ఖరథాంగాంకిత శుద్ధరూప్యమయ రక్షాపట్టికన్ గట్టెనా
హరిపాదాంబుజసంగ గంగయె యగడ్తై యొప్పు నవ్వీటికిన్. ||57||

సీ. కలిగించు నొకకొమ్మ కలమాన్నపరమాన్న
బహుపూపఘృతసూపపానకములఁ
గల్పించు నొకకొమ్మ ఘనసారహిమనీర
పాటీరకాశ్మీరపంకములను
దొరకించు నొళదళం బురుహేమమణిదామ
శాటికాపేటికాసముదయముల
నిచ్చు నొక్కొకసుమం బెలమించుతుల మించు
ప్రాయంపు గరువంపుఁ బద్మముఖుల
తే. నీగతి సమస్తవస్తువు లీఁగఁ దివురు
వేల్పుమానులుఁ దీవలు వేనవేలు
దనర విలసిల్లుఁ దత్పురోద్యాన మగుచు
నందనంబు జగత్త్రయానందనంబు. ||58||

ఉ. శ్రీ లుదయింప దిక్పతులు చేతులు మోడ్చి భజింపఁ దమ్ముఁడై
శ్రీలలనామనోహరుఁ డశేషభరంబును నిర్వహింపఁ బా
తాళమువట్టి శాత్రవులు తద్దఁ గృశింప నిలింపపట్టణం
బేలును భోగసాంద్రుఁడు సురేంద్రుఁడు భూరిమహోదినేంద్రుఁడై. ||59||

సీ. వృత్రగర్వస్ఫూర్తి విదళించినయినుండు
పాకసామజమదోత్పాటనహరి
పరమహీభృత్తుల భంజించు జిష్ణుండు
తఱియైన శరవృష్టి గురియు ఘనుఁడు

మఘశతయాజియౌ మహితసుధర్ముండు
భువనైకభారంబుఁ బూనువృషుఁడు
కరమున శతకోటి గలస్వస్థజీవనుఁ
డమరభోగినులతో నలరుభోగి
తే. శచికుచంబుల మకరికాసముదయంబు
వ్రాయు లేఖర్షభుం డనవద్యహృద్య
మాఘ్యవిచికిలరుచిరసమాఖ్య గాంచు
దేవతాసార్వభౌముండు తేజరిల్లు. ||60||

చ. అతఁ డొకనాఁడు కుందనపుటందపుదుప్పటి వల్లెవాటుతో
సతతముఁ దావులీను హరిచందనపున్ జిగి మేనిపూఁతతో
నతులకిరీటహారకటకాంగదముఖ్యవిభూషణాళితో
రతిపతిమీఱుసోయగము రాజసమున్ దళుకొత్తు ఠీవితోన్. ||61||

చ. చిలుకలకొల్కి యొక్కరుతు చేరి పరాకు పరా కటంచనన్
జలరుహపాణి యోరు సరసన్ కయిదండ యొసంగ ముంగలన్
హాళహాళి నొక్కగంధగజయాన బరాబరి చేయ వాలునుం
బలక కలాంచి కుంచె యడపం బొకకొందఱుఁ బూనికొల్వఁగన్. ||62||

సీ. వేవన్నెబంగారు వింతగోడలచాయ
పగలింటి యెండలభ్రమ లెసంగ
ఇంద్రనీలస్తంభసాంద్రరోచిచ్ఛటల్
బహుళాంధకారవిభ్రాంతి నీయఁ
బద్మరాగాంకురప్రాంశువితర్దికల్
జ్వలదగ్నిమండలజ్ఞప్తి నింప
నిర్మలవజ్రమణీకుట్టిమంబులు
స్వచ్ఛాంబుపూరసంశయము నింప
తే. నుద్యదితరేతరప్రతియోగవస్తు
సంగతులు శక్రకార్ముకశక్తి యొక్కొ
యనఁదగిన కాంచనాంచితయవనికావి
తానపరికర్మయైన సుధర్మయందు. ||63||

చ. కరమునఁ గంకణాలు విడిగాజులు గల్లనఁ బల్లవాధరల్
వరుసగ నిల్చి చామరలు వైవ మహోన్నతభద్రపీఠిపై
సురగరుడాహిచారణవసుప్రముఖుల్ శుచిధర్మదైత్యరా
డ్వరుణసమీరయక్షపురవైరులు సూరెలఁ జేరి కొల్వఁగన్. ||64||

క. కొలువున్న తఱిఁ బరాశర
కలశోద్భవ కణ్వ కండు కవి గాధేయా
దులు వచ్చి యతనిచే మ్రొ
క్కులుగొని కనకాసనములఁ గూర్చుండిరటన్. ||65||

తే. నలపురూరవు లాదిగాఁ గలుగు చక్ర
వర్తులు పదాఱుగురు రాజవర్యు లమిత
కీర్తిధుర్యులు వైభవస్ఫూర్తి మెఱయ

నన్నుగాహితుసభను గూర్చున్న తఱిని. ||66||

సీ. అతిరాత్రయాజుల యరిదికుండలములు
మెట్టి మించులుగాఁగ నెట్టుపఱిచి
సత్త్రయాజుల వెల్లజన్నిదంబులు దీసి
సన్నగజ్జెలు గూర్చ సంఘటించి
ఉక్థయాజుల కనకోత్తరీయంబుల
మేలుముసుంగుగాఁ గీలుకొల్పి
అల వాజపేయయాజుల యాతపత్రంబు
లెండకు మఱుఁగుగా నేర్పఱిచి
తే. తలిరువిలుకాని బిరుదుపతాక లనఁగ
నోరపైఁటలు జీర నొయ్యార మెసఁగ
వత్తు రింద్రుని కొలువుకు వారకాంత
లచ్చెరువునొంది సురలెల్ల మెచ్చి పొగడ. ||67||

సీ. "సోమయాగఫలంబు సుదతి నీ కిచ్చేను
మొగ మిషు ద్రిప్పవే ముద్దుగాను
సోమపానఫలంబు భామ నీ కిచ్చేను
ఆనంగ నాకు నీ యధర మీవె
కలికిరో సాన్నాయ్యకలశాలఫల మిత్తు
బటువైన కుచములఁ బట్ట నీవె
రమణిరో నా మహావ్రతఫల మిచ్చేను
రతుల న న్నేలవే బ్రతికి పోదు"
తే. ననుచు శాండిల్య కౌండిల్యముని పరాశ
రాత్రి గార్గేయ గౌతమ చ్యవన భార్గ
వౌర్వ జమదగ్ని శాకల్య పర్వతాది
ఋషులు మోహింప నప్పరస్త్రీలు మఱియు. ||68||

సీ. "అషు ఇషు బోవకే యిషువులచే నిన్ను
విషమాస్త్రుఁ డేచీని వెఱ్ఱిపడుచ
వాజపేయఫలంబు వలదషే యో యోష
యింద్రుఁ డే మిచ్చిని యిషు నిలువవె
మేము శుంఠల మషే , మీరు [2]నేర్చినపాటి
యెరుగ మషే వేదమెల్ల జదివి
యతివ నీవు [3]ద్వరోష్ట యయ్యేదినము లయ్యె
నగరికిఁ బోవకే నడుమ నెషులో"
తే. అనుచు ఛాందసు లగు సోమయాజివరులు
వెంట నంటంగ మధుమయవినయభరిత
మంజుభాషల చేత సమ్మతులు చెప్పి
వెడలి రప్పుడు వేలుపువెలవెలఁదులు. ||69||

మ. గొనబుంజందురుకావిపావడలపైఁ గొమ్మించురాయంచడాల్
మినుకుంజీరలకుచ్చెలల్ గులుకఁగా మిన్నేటిపొందమ్ము ల
ల్లన వక్త్రాంబుజపాలికిన్ మఱుఁగుగా హత్తించుచున్ గంతుమో
హనదివ్యాస్త్రములోయనన్ వెడలి రొయ్యారంబుతో నచ్చరల్. ||70||

ఉ. చిన్నిమిటారులో చికిలిచేసిన మారునిచిక్కటారులో
వెన్నెలగుమ్మలో మెఱుఁగువెట్టిన కెంపుకడానిబొమ్మలో
పొన్నలబంతులో మగుడఁబోవనిమిన్నుమెఱుంగుకాంతులో
యెన్నఁగనంచు నభ్రచరు లిచ్చల మెచ్చఁగ వచ్చిరచ్చరల్. ||71||

సీ. అశ్రాంతనవయౌవనారంభయౌ రంభ
శృంగారరసరేఖ చిత్రరేఖ
రతిరహస్యజ్ఞానరాశియౌ నూర్వశి
అంగజాతాగ్నికి నరణి హరిణి
పాటిలాధరజితపానక మేనక
హాటకసమరోచి యా ఘృతాచి
తరుణులం దెల్ల నుత్తమ యా తిలోత్తమ
మణితమంజులభాష మంజుఘోష
తే. రామణీయకవిభ్రమరామ హేమ
సరసనుతగీత నృత్యప్రచార తార
మఱియుఁ దక్కినవేలుపుమచ్చెకంటు
లెలమి నరుదెంచి రపుడు దేవేంద్రుసభకు. ||72||

క. అంజలులు సేసి వేలుపు
లంజలు నిలిచిరి బలాసురధ్వంసికడన్
రంజనఁ బూజించి రహిన్
గంజాస్త్రుఁడు నిలిపినట్టికైదువు లనఁగన్. ||73||

ఉ. వారిజపత్త్రలోచనల వాసవుఁ డల్లనఁ దేరఁజూచి శృం
గారపు వింతలేనగవు కల్గొనలన్ దళుకొత్తఁ గొల్వులో
వారల నెల్లఁ గాంచి "యిటువచ్చిన యచ్చర గచ్చురాండ్రలో
నే రుచిరాంగి చక్కనిది , యెవ్వతె విద్యలమేటి" నావుడున్. ||74||

క. దేవేంద్రుఁ జూచి వరుణుఁడు
"దేవా! దేవరకుఁ దెలియదే సకలంబున్
నీవడిగినచో నుత్తర
మీవలె నటుగానఁ బలుకు దేఁ దోఁచినటుల్. ||75||

ఉ. ఆటదియన్న నూర్వశి యథార్థము పల్కుదు నింతెకాని మో
మోటమి నాకు సైఁపదు బుధోత్తమ! పాటల నాటలందు స
య్యాటలమేటి చక్కదనమా గొనమా యలబోటికే తగున్
పాటలగండులెల్ల నల భామిని గోటికి సాటివత్తురే!" ||76||

చ. అనవుడు మిత్త్రుఁ "డౌనవు, జలాధిపువాక్యము నిక్క మూర్వశీ
ఘనకచ రూపసంపద జగన్నుత మెంతని సన్నుతింప నా
ఘననయదేశ్య రక్తి పరికల్పన మేరితరం, బదేమి యీ
మునివరు లిప్పురూరవుఁడు మున్నగు రాజులు ము న్నెఱుంగరే?" ||77||

క. అనినఁ బురూరవుఁ డచ్చటి
జననాథుల మొగముఁ జూచి "సర్వజ్ఞనిధుల్

ఘను లీమిత్రావరుణుల్
కని పలికిరి నిజ మిదే యఃఖండిత" మనినన్. ||78||

శా. ఆకంధీశ్వరుమాటకున్ నగుచు యక్షాధీశపుత్త్రుం డనున్
"మీ కీయూర్వశిమీఁది యాస దురుసై మి మ్మిట్టు లాడించెనో
కాకున్నన్ గుణగుంభరంభను వినాగా నోర్తు నగ్గింతురా
నాకాధీశుఁడు తక్కువా రెఱుఁగరా నారీషు రంభా యనన్." ||79||

ఉ. ఏచినప్రేమ యక్షసుతుఁ డీగతిఁ బల్కినఁ గండుమౌని దా
సైచక "యింద్రుసన్నిధి నసత్యము లేలర, ప్రేలె దోరి, ప్ర
మ్లోచకు నూరుకాండజితమోచకు లేశము సాటి వత్తురే
ఖేచరసిద్ధసాధ్యఫణికింపురుషామరచంపగాంగులున్? ||80||

ఉ. పున్నమచందురుం గెలుచు ముద్దుమొగంబును దేటమాటలున్
సన్ననికౌను మేనుజిగిచందముఁ దీయనిమోవియందమున్
కన్నులతీరు నీలములకప్పును మించినకొప్పుసొరు నా
యన్నులమిన్నకే తగు నటన్నది విన్నది లేదె యెన్నఁడున్." ||81||

క. నాగంబుల నాగంబుల
నాగంబులఁ గెల్చు కురులు నాభియు నడలున్
భోగంబుల భోగంబుల
భోగంబులఁ దరుణియారు బొమ చను లేలున్. ||82||

క. చేరలకు మీఱుకన్నులు
బారెడుకీల్జడయు ఔొమ్ము పట్టవుకుచముల్
బేరజముల నారజముల
నీరజముఖి లెనయె దాని నీటుకు" ననినన్. ||83||

చ. బలిమిని గండుమౌని నొకప్రక్కకుఁ దోచి విభాండకుం డనున్
"నెలఁతలమేలుబంతి హరిణీహరిణాక్షియె యాలతాంగి దాఁ
గిలకిల నవ్వుచున్ దివిరి కిన్నర మీటుచు వచ్చుముచ్చటల్
కులుకులు పావురాలపలుకుల్ బెళుకుల్ మఱి కోటి సేయవే? ||84||

చ. పెదవిని వింతకావి నునుపెక్కినకీల్జడతీవి కల్వలన్
జెదరఁగఁజేయు కన్నులును సిస్తగు జక్కవ నేలుచన్నులున్
మదకరినేలు నెన్నడలు మల్చినరీతిని నొప్పు నున్దొడల్
ముదముగఁ జూచినంత నల బోటికి జోటులు సాటి లేరెటన్. ||85||

ఉ. దాని యొయారపున్ సొగసు దాని మితారి కతారి చూపులున్
దాని కడానిమేనిజిగి దాని చనుంగవలో పటుత్వమున్
దాని గళంబుఠీవియును దాని కరంబుల సోఁగ వ్రేఁగెయున్
దాని శిరోజకాంతియును దానికిఁ గాని మ ఱెందు లే దొకో." ||86||

క. వార లిటుపల్కుపల్కులు
సైరింపక కౌశికుండు జడముడి వీడన్
దూరంబున జపమాలికఁ

బారంగా వైచి యమరపతి కభిముఖుఁడై. ||87||

ఉ. "ఆనిక చేసి పల్కెద హా హా, కసుమాలపుఁ బంజలంజెలన్
గానకళావిశారద మొగానఁ గళానిధిఁబోలుచాన యా
మేనక యుండు దానిజిగిమే నకలంకసువర్ణకాంతికిన్
దానక; మింతి విభ్రమవితానక మచ్చెరువిచ్చు నిచ్చకున్. ||88||

ఉ. కన్నులు చేరలన్ గొలువఁ గాఁదగుఁ గొ నరపేద చన్నులా
కిన్నర కాయలంగెలుచుఁ గీల్జడబారకు మీఱు మోము క
ప్పున్నమచందమామ యొకపోలిక వాలికతూపు చూపు నా
కన్నులయాన, దాని కెన గాన జగాన మొగానఁ బల్కెదన్. ||89||

క. భూమియు నాకాశంబును
గామినికటిరుచికిఁ గౌనుకాంతికి సాక్షుల్
పామును బట్టెద నే నా
భామిని నూఁగారు కెందుఁ బ్రతిలేదనుచుఁన్. ||90||

చ. వదలనినిష్ఠ మీఱఁగఁ దపంబున వర్తిలు మేము సైతమున్
మదిమది దానితోఁ దగిలి మానము మౌనము నేటిపాలుగా
నదెయిదె తేపుమా పనుచు హాయనముల్ [4]పడి యుంటి మన్నచో
మదవతి రూపరేఖలను మాటికి మాటికి నెన్న నేటికిన్?” ||91||

చ. అనుటయు మాండకర్ణిముని "యంద ఱటుండఁగనిండు మెండుగా
జననుత కామజన్య సహజన్య సరోచి ఘృతాచి యున్నత
స్తనకటిభార తార వనితాజనతానుతనామ హేమ ర
త్యనుపమలాలసాలస మదాలస యిప్పురి పంచరత్నముల్." ||92||

క. నావిని పరాశరుం డను
“నీ వేలుపుఁ జెలులు చిలువయింతులు మర్త్య
స్త్రీవితతి దాశకన్యక
లావణ్యముఁ బోలలేరు లక్షాంశంబున్. ||93||

ఉ. మాటలు వేయు నేమిటికి మన్మథమోహనవిద్యయైన యా
పాటలగంధియూరు లలబంగరుబొమ్మవెడందకన్ను లా
గాటపుగబ్బిగుబ్బెతచొకాటపునెన్నుదు రెన్ని చూచుచో
నేటికి రంభ యాహరిణి యేటికి నాశశిరేఖ యేటికిన్? ||94||

శా. ఫాలక్షోణి చెమర్పఁ గౌను బెళుకన్ బాలిండ్లు వొంగార దో
ర్మూలంబుల్ దళుకొత్త నూరురుచి సొంపుల్ గుల్క నేత్రప్రభల్
మీలందోలఁగ నేటవాలువగ నమ్మీనాక్షి యాయేటిలో
నేలేలోయని పాడు చోడఁగడవే యింపొక్కటే చాలదే?" ||95||

సీ. “అంజనాసతిఁ బోలు, కుంజరగామిని
కలుగునే” యనె మరుద్గణవిభుండు
"తప్పుమాట లివేల దారుకావనినుండు
నతివలే యతివ”లం చనె హరుండు

"చాలించవయ్య, సృంజయునికూఁతురి కెన
గారు పోపో"మ్మనె నారదుండు
"శరవణంబునను గొందఱుకాంత లున్నారు
వారు మీసర"మని వహ్ని పలికె
తే. మఱియు సభలోని మునులును సురలు నృపులు
దారుచూచిన చెలుల వేర్వేఱఁ బొగడి
"రంత రంతాయెఁ గద మహారాజసభ"న
టంచుఁ గంచుకి వారల నమరబట్టె. ||96||

క. అత్తఱిఁ బురూరవుం డను
"మెత్తురె యొకపాటిదాని మిత్రావరుణుల్
పుత్తడిబొమ్మకు గుమ్మకుఁ
జిత్తజుచార్వసికి నూర్వశికి సరిగలరే?" ||97||

క. ఆరాజరాజనందనుఁ
డారాజుం జూచి "కొంటె లనుకొంటేనే
నారీమణి రంభారం
భోరుకు నూర్ రోసినట్టి యూర్వశి సరియే?" ||98||

క. అనుటయుఁ జందురు మనుమఁడు
కనుదమ్ములు జేవురింపఁ గరకరిమీఱన్
ధనరాజకుమారకునిన్
గనుఁగొని యిట్లనుచుఁ బలికెఁ గాంతాళముతోన్. ||99||

క. "ఉండ్రా, యక్షాధమ, నీ
తండ్రిం గని తాళుకొంటిఁ దగఁ గాకున్నన్
తీండ్రంబగు కత్తిని నీ
జీండ్రపు నాలుకదళంబు ఛేదింతుఁ జుమీ!" ||100||

చ. అనినఁ గుబేరనందనుఁ "డహా"యని బెట్టుగఁ గేక వైచి క్రొ
మ్మినమిసలీను కప్పుజిగిమీసముపై జెయివైచి "యోరి ఛీ
చెనఁటి, గరాస, యీసభను జెప్పినటుల్ మఱి నీవు చేయకుం
డిన విడ రాచకోచ, ధగిడీ!" యని దిగ్గన లేచి వీఁకతోన్. ||101||

మ. రమణీరత్నము రంభఁ జూడ బురుసారంగున్ జెఱంగున్ నెఱా
కొమరుం దుప్పటి కాసెగా బిగిచి జగ్గుల్ మీఱు గ్రొం బైరుమాల్
జముదాడింబరుఁజంది యేది మఱి రాజా, లెమ్ము వా ల్గో"మ్మనన్
బొమ లల్కన్ ముడివెట్టి వీరరసవిస్ఫూర్తిన్ విజృంభించుచున్. ||102||

క. "రూకలకోమటికొడుకా,
పోకలఁ బోయెదవదేర, పోరా పోరా,
నీకున్ మత్తే కొరడా
చేకొని కొట్టింతుఁ గొంటె చెనఁటి గరాసా! ||103||

క. "మొగమున మీసముఁ గలిగిన
మగవాఁడైతే కడింది మగఁటిమి మీఱన్

తెగఁబడిపోట్లాడవలెన్
బిగువేమిర, రాచములుచవిడుతునె నిన్నున్. ||104||

ఉ. "పందగులామ, నీవు నొక బంటవె? గెంటనికిన్కతోడఁ బౌ
రందరి చిక్కటారిని గొలారిక మంపిననాఁటి కెచ్చుటన్
పొందుగ దాగియుంటివిర పోర, ధనంబులు గూడఁబెట్టువాఁ
డెందును సంగరంబునకు నేర్పడి ప్రాణము దెంపు చేయునే? ||105||

ఉ. "బంటుతనంబు లాడుకొని పారకు; రావణుచేతి పెట్టునన్
కంటికి నీరు గ్రమ్మఁ గలకంబడిపారెను నీదుతండ్రి నీ
యింటను లేదు పౌరుష మొకింతయు; బీరములేల చేతిక
త్తంటకు కోడెకాఁడ! చురు కంటఁగ వెంటనె చెంపఁగొట్టెదన్." ||106||

చ. అని మొలవంక డుస్సి సమరార్భటిఁ జావడిక్రిందికిన్ గుభా
లన దుముకన్ ధనేశసుతుఁ డట్లనె చేయ జయంతుఁ డిద్దఱిన్
బనివడి రెండు బాహువులఁ బాయఁగఁ ద్రోయుచు "మీర లిర్వురున్
దనుజులమీఁద మార్కొని ప్రతాపముఁ జూపు" డటంచు నిల్పఁగాన్. ||107||

క. "నీకేమి యాతఁ డాతఁడుఁ
బైకొని మార్కొనిన నిన్నుఁ బ్రార్థించిరటో
యీ కొట్లాటలు దీర్పఁగ
నాకాధిపతనయ" యనుచు నారదుఁడనియెన్. ||108||

సీ. అపుడు విభాండకుం డాగ్రహంబున లేచి
బలిమిచేఁ దన కమండలువుఁ గొట్టె
చెయిమించి మాండకర్ణియుఁ జేతిదండంబు
పెళ పెళాలనఁ ద్రొక్కి విఱిచివైచె
పొటుకునఁ బర్వతజటిలుండు జడచుట్ట
విదళించి యట త్రెంచి విసరివైచె
కండుమహాముని కడుఁగోపగించుక
పడుపాటుగాఁ గక్షపాల చించె
తే. కండ్ల నెఱచేసి పటపటఁ బండ్లు కొఱికి
గోచు లెగఁగట్టి జందెముల్ కుఱుచబట్టి
అట్టహాసంబు లొనరించి యొండుఁగఱచి
మునులు గుంపులు గూడుక మొనసి రంత. ||109||

సీ. 'తారతమ్యా మెఱుంగలే రింద' అని లేచె
గాధేయుఁ డంత లోకములు బెదర
'నీవేమి తెలిసి వర్ణించితో మేనక'
నని యాతని విభాండుఁ డదిమెఁ గేల
'హరిణితోఁ దిరిగిన యడవిమెకంబ వీ'
వని కండు వతనిమే నప్పళించె
'గండువుకేకాని కాదు ప్రమ్లోచ'యం
చతని వెన్ దట్టె మహర్షి యొక్కఁ
తే. డదియె పెదపెదమాటలై యలుకవొడమి

జడలు వీడఁగ వల్కలాచ్ఛాదనములు
జార దండకమండలుల్ పాఱవైచి
గజిబిజిగఁ బోరుచుండ నాఖండలుండు.॥110॥

ఉ. "అచ్చరమచ్చెకంటులకునై కడుహెచ్చిన మచ్చరంబుతో
విచ్చలుగాను మెచ్చుగువివేకము లెల్లను వెచ్చపెట్టి వి
రిచ్చట దొమ్మిగూడి కలహించినఁ దేరుగడేల పుట్టు నీ
రచ్చ లణంచఁగా వలయురా” యని యింద్రుఁడు చేయమర్చుచున్.॥111॥

ఉ. గాధిజుఁ జేరి వేడుకొని, కండుమహామునికిం బ్రియోక్తులన్
బోధనచేసి, శక్తిసుతు పొంతకుఁ బోయి, విభాండకున్ "వృధా
గాథ [5]య”టంచుఁ బల్కి భయకారి మునీంద్రుని వాదణంచి స
క్రోధుల మిత్రు నప్పతిఁ బురూరవు యక్షజుఁ దాళఁ బట్టుచున్.॥112॥

కం "ఏకాంత ఎవరి కితవో
యాకాంతను వారు పొగడు టదియుక్తం బే
మీకేల వాదు మీలో
‘లోకో భిన్నరుచి’ యనెడు శ్లోకము వినరే.”॥113॥

చ. అనుటయు నొక్కతాపసుఁ "డహా! పదివేలయినా తిలోత్తమే
వనిత" యనంగ, వేఱొకఁడు , "వామ” యనంగ, నొకంకడు “చిత్రరే
ఖ"న మఱికొంద ఱందుఁ "బదహాటకమాలిని భీమ పుండరీ”
కన, వెసం బుట్టెఁరేఁ బెట్టు కలహంబులు నారదుఁ డుబ్బియార్వగన్.॥114॥

క. " రాజానుమతో ధర్మో'
నా జను లనుకొంద్రు గాన నవ్యప్రతిభన్
మాజగడముఁ దీర్పఁగను బి
డౌజా, నీవె”యని మౌను లందఱు వేఁడన్.॥115॥

క. “నలువగల సృజించిన య
న్నలువ గలఁడు నిర్ణయింప నలినాక్షుల మి
న్నలువగ లటపోవుద"మని
నలువగలన్ ఠీవి మెఱయ నగరిపుఁ డంతన్.॥116॥

చ. ఉఱుముల బండికండ్లరొద యొప్పగు వాల్మెఱుపుం బతాకలున్
చిఱుమెఱుపుం ధ్వజంబులును జేరుబలాకలబారు చామరల్
శరమణిచాపముల్ వెలయ సొరగు నభ్రరథంబు నెక్కి భా
సురసురదుందుభుల్ మొఱయ సూరెల సూరులు సన్నుతింపగన్.॥117॥

సీ. గంధర్వు లొకవంక గాంధారపంచమ
బంధురగాంధర్వపటిమఁ జూపఁ
జారణు లొకక్రేవ ధోరణుల్ మీఱఁ గై .
వారముల్ సారెకు సారెఁ జేయ
నచ్చర లొకచాయ హెచ్చుకోపుల మెచ్చు
లచ్చెర్వుగాఁగ నాట్యములు సలుప
సంయము లొకయిక్క సామజయస్తోమ

నామాభిరామమంత్రములు బొగడఁ
తే. ద్రిభువనైకాధిపత్యంబుఁ దెలుపఁజాలు
గొప్పముత్తెంపు జంపులగొడుగు నీడఁ
దరుణు లిరుగడఁ దెలచామరలు వీవ
వెడలె జేజేలయెకిమీఁడు వేల్పువీడు. ||118||

క. కసవులు మేసియు నని మొన
నసువులఁ బాసియు విరోధు లలయంగ యశో
వసువులగు వసువు లుజ్జ్వల
వసువులొలయ వెడలిరపుడు వాసవుమ్రోలన్. ||119||

మ. కుడిగోరొత్తులగుబ్బచన్ను గని సిగ్గుల్ గుల్కు డాకంటితో
నెడదౌ కీల్జడపాటుఁ జూచి పులకల్ హెచ్చంగ మువ్వన్నెప
చ్చడ మొప్పన్ నెలవంకతోఁ గనకభాస్వన్నాగభూషాళితో
మృడు లేతెంచిరి వేడ్కఁ బద్మభవునిన్ వీక్షింప జంభారితోన్. ||120||

తే. తరణికిరణంబు లచ్చర మెఱుఁగుఁబోండ్ల
మెఱుఁగుసొమ్ముల కొకవింతమెఱుఁగు వెట్ట
బారసూరులు సలిపిరి బారు సూరు
లాగమంబుల నుతియింప నాగమంబు. ||121||

చ. అల వినువాక కుందనపుటందపుఁదామరతావిఁ గుల్కుచున్
సొలయు మరుత్కుమారకులు సొంపుమెయిన్ వెనువెంట నంటఁగా
నలకలు వీడఁ గౌను లసియాడ సురాంగన లేగుదెంచి రు
త్పలశరుఁ డూర్ధ్వలోకములపై నిగుడించిన యమ్ములో యనన్. ||122||

క. నగరిపుఁ డివ్విధమునఁ జని
నగరీతివిశాలసాలనయనోత్సవదన్
ప్రగుణితనవరత్నధగ
ద్ధగితన్ వాగ్జాని రాజధానిం గనియెన్. ||123||

సీ. ఏప్రోలు వాణీవరేధితాశోకంబు
శోకంబు మోదంబు సుడియ దెందు
ఏపురి రవికోటిఘృణియుతాభోగంబు
భోగంబు మోక్షంబు పొసఁగు నెందు
ఏపురం బంబరశ్రీపరమాకల్ప
మాకల్పము వసింతు రార్యు లెందు
ఏపూర్మతల్లి యహీనతరానంద
రానందదఘకర్మరతుల కెందు
తే. సంతతవసంతసరసరసాలసాల
ఫలరసాలోలకీరాదిపత్త్రి జాల
గదితఋుగ్యజుషంబు నిష్కల్మషంబు
నగుచు నవ్వీడు జోడులే కలరు నెపుడు. ||124||

చ. వరజగదండభిత్తికల వన్నియకోట బహిస్థితాంబువుల్

పరిఘ లతఃపరప్రకృతిఁ బాదమహావనదుర్గమై తగన్
కరమరుదారు నేపురము కామరుషాపరుషారికోటులన్
దరియఁగనీయ దన్నలువ నాల్గుమొగాలఁ బరామృశింపఁగన్. ‖125‖

శా. ఆలోకంబునఁ గోటిసూర్యనిభదివ్యాస్థానమధ్యంబునన్
శ్రీలింపొందు చిరత్నరత్నవిలసిత్సింహాసనాగ్రంబునన్
బాలాదిత్యమహత్సహస్దళయుక్ పద్మోజ్జ్వలత్కర్ణికన్
హేలాస్పష్టజగత్త్రయుండు కొలువుండెన్ ధాత చేతోధృతిన్. ‖126‖

సీ. క్షణకళాఘటికాదికాలంబు సాకార
మై గడియార మందంద పల్క
గ్రహతారకారాశిగణము లల్లనఁ జేరి
పంచాంగదినశుద్ధిఁ బల్కరించ
సకలదిగ్దేవతల్ సభికుల నెల్లను
జోటు లెఱింగి కూర్చుండ ననుప
పంచభూతంబులు ప్రణమిల్లి యే సృష్టి
నేమించునో యని మోముఁ జూడ
తే. వేదములు వందిజనములై వినుతిసేయ
శాస్త్రములు వేత్రపాణులై సంచరింప
జెలఁగి కొలువున్న త్రైలోక్యసృష్టికర్త
నగరివాకిట నిజవాహనంబు డిగ్గి. ‖127‖

క. ప్రతిహారి తోడరా న
ప్రతిహారివిభూతి మెఱయ నమరేంద్రుఁడు దా
శతధృతిసన్నిధికిం జని
నతి చేసి సమున్నతాసనంబున నుండెన్. ‖128‖

ఉ. సారసపత్రనేత్ర విలసన్నవనీరదగాత్ర పావనో
దారచరిత్ర కంసమురదానవజైత్ర రమాకళత్ర శం
పారుచినేత్ర బోధరసమాత్ర పృథాసుతమిత భక్తహృ
న్నీరజబాలమిత్ర వరనీరజపత్రపవిత్రకీర్తనా! ‖129‖

క. కస్తూరీతిలకాంకిత
నిస్తులముఖచంద్ర వదననిందితచంద్రా
అస్తోకద్యుతివిస్తృత
కౌస్తుభమణివక్ష విమలకమలదళాక్షా! ‖130‖

స్రగ్విణీ. వారణాధీశదుర్వార భీవారణా
ధారణా యోగిహృద్వాసనిర్ధారణా
కారణశ్రేణీకాకల్పనా కారణా
చారణక్షేమవైశాల్య దోచ్చారణా. ‖131‖

———— ♦ గద్య ♦ ————

ఇది శ్రీమత్పాండ్యమండలాధీశ్వర శ్రీ విజయరంగ చొక్కనాథ మహీ
నాథకరుణాకటాక్ష సంపాదిత గజతురంగ మాందోళికా ఛత్రచా

మర విజయకాహళ భూరిభేరీబిరుదధ్వజ ప్రముఖ నిఖిల
సంపత్సారంపరీసమేధమాన సముఖ మీనాక్షీనా
యక తనూభవ శ్రీమీనాక్షీదేవీ కటాక్ష
లబ్ధకవితాసాంప్రదాయక వేంకట
కృష్ణప్పనాయక ప్రణీతంబైన
యహల్యాసంక్రందనంబను
మహాప్రబంధంబునందుఁ
బ్రథమాశ్వాసము.

[1] శీలుఁడు
[2] చదివిన
[3] బహిష్ఠ (?)
[4] పది
[5]యి"దంచు

శ్రీరస్తు

అహల్యాసంక్రందనము

ద్వితీయాశ్వాసము



శ్రీకనకవిమానాంతర
కాకోదరరాజతల్ప కలితాపేక్షా
శ్రీకనకాంగీప్రేమ ధు
రాకలితవిశాలవక్ష రంగాధ్యక్షా! ‖1‖

వ. అవధరింపుము. ‖2‖

క. ఆయెడ నవ్వలికథ సౌ
ఖ్యాయతి జనమేజయుండు కరుణింపుమనన్
ధీయుతవర్యుఁడు వైశం

పాయనుఁ డిట్లనుచుఁ బలికెఁ బరమప్రీతిన్. ||3||

ఉ. ఆమెయిఁ జిన్నినవ్వు వదనాబ్జనివాసినియైన చానకున్
గోమలకాంతి వింతమెఱుఁగుల్ ఘటియింప విరించి యిట్లనున్
"సేమమె నీకు సర్వసురశేఖర! భద్రమె దేవకోటికిన్,
ధీమహితుల్ మునుల్ సఖులె, నీ విటువచ్చిన దేమి?" నావుడున్. ||4||

ఉ. "స్వామికటాక్షవీక్ష లనిశంబును గల్గుటఁజేసి యేమెయిన్
సేమమే మాకు సర్వసురశేఖర! నే నొకప్రశ్న చేసెదన్
నీ మును సృష్టిసేసిన యనేకవిధప్రమదాజనంబులో
నేమదిరాక్షి చక్కనిది యేర్పడ నానతియిమ్ము" నావుడున్. ||5||

క. మోమునఁ జిఱున వ్వొలయఁగఁ
దామరచూ లనియె నముచిదమనునితోడన్
"నామనసుకు సరిపోయిన
భామామణిఁ గాన నీప్రపంచములోనన్. ||6||

సీ. "రంభ యెన్నఁగ జడప్రాయ యూర్వశి నల్పు
జీవంబు లేనిది చిత్రరేఖ
వామన పొట్టిది వక్రాంగి శశిరేఖ
హరిణి యటంటిమా యడవిమెకము
గానుగరోల్ చాయఁ గను నత్తిలోత్తమ
పగలు చూచినచో నభాస తార
ధాన్యమాలిని మోము దర్శించిన ఖరంబు
పాండువుమేనిది పుండరీక
తే. నాగకన్య లటంటిమా నడలు కుంటు
తక్కువారలచందంబుఁ దలఁపనేల
ముజ్జగంబులలో నున్న ముదితలందు
నొచ్చె మొకయింత లేనిది యొకతె లేదు! ||7||

సీ. "కన్నులైతే సరే, కన్నవిన్నదిగాని
మించుఁదళ్కులు గ్రుమ్మరించవలదె!
చన్నులైతే సరే, స్మరరాజ్యపట్టాభి
షేకకుంభంబులై చెలఁగవలదె!
వదనమైతే సరే వరమనోహర్షాబ్ధి
శరదిందుబింబమై మెఱయవలదె!
రూపమై తేసరే, చూపరకనులకు
నిర్వాణసౌఖ్యంబు నింపవలదె
తే. కాంతయైనంత సరియె నిష్కాముఁ డైన
మౌనివరునైన మరునిబందానుగాఁగఁ
జేయవలవదె యిటువంటి చిన్నిచాన
ముజ్జగంబులలోఁ గాన బుధనిధాన! ||8||

మ. "కుదురై యొప్పులకుప్పయై తనువునం గోరంత యొచ్చెంబు లే
నిదియై నొవ్వని జవ్వనంబు గలదై నిద్దంపుటొయ్యారియై

మదనోజ్జీవితయై గరాగరికయై మాణిక్యపుంబొమ్మయౌ
మదిరాక్షిన్ సృజియింతు నే నొకతె మ న్మాహాత్మ్యమున్ జూడుమా!" ‖9‖

క. అని పలికి పద్మగర్భుఁడు
తనగురుఁ డగు బద్మనేత్రుఁ దలఁచి ప్రయత్నం
బొనరఁ జతుర్దశలోకీ
వనితాజనతాతిశయిత వైఖరి యెసఁగన్. ‖10‖

సీ. చందురులో మైల జలజంబులో దుష్ప
యూడ్చి పోఁద్రోచి రెం డొకటి సేసి
అరుణాశ్మకాఠిన్య మమృతపాండుగుణంబు
నుడిగించి యారెంటి నొకటి సేసి
అరులజో డెడయించి గిరులప్రతాపంబు
పెకలించి యారెంటి నొకటి సేసి
యిభతుండచాంచల్య మిల ననంటులజాడ్య
మొడిచి యారెంటిఁ దా నొకటి సేసి
తే. కులుకునెమ్మోము కెమ్మోవి గుబ్బచన్ను
లరిదియూరులు నిర్మించి యంగజునకు
వింతకైదువుగా నొక్కదంతిగమన
నబ్జభవుఁడు సృజించె నహల్య యనఁగ. ‖11‖

వ. ఇట్లు నిర్మించిన. ‖12‖

ఉ. అంబుజగంధి చక్కఁదన మల్లనఁ గన్గొని విస్మితాత్ముఁడై
యంబుజనేత్రుఁ డప్పుడు త్రియంబకభావముఁ గోరె నాతఁ డ
ష్టాంబకలీలఁ గోరె మది నాతఁడు గోరె సహస్రలోచన
త్వంబు నతం డనంతనయనత్వముఁ గోరె మఱేమి చెప్పఁగన్. ‖13‖

చ. వనితను గాంచి రంభ తల వంచెఁ, దిలోత్తమ మోము నల్లచే
సెను, శశిరేఖ లోఁగమలెఁ, జేష్టలుదక్కెను జిత్ర రేఖ, కాఁ
కనొగిలె హేమ, మైమఱపు గాంచె మదాలస, తగ్గుఁ జెందె వా
మన, కరఁగెన్ ఘృతాచి, యవిమానత మేనక గాంచె నెంతయున్. ‖14‖

సీ. రాజయోగారంభరతులైన యతులైన
వదనంబుఁ గని పారవశ్య మొంద
వరకుండలీంద్రభావనులైన మునులైనఁ
జికురపాశముఁ గాంచి శిరము లూపఁ
బద్మసనాభ్యాసపటులైన వటులైన
బదకాంతిఁ గన్గొని ప్రస్తుతింప
నిర్గుణపరతత్వనిధులైన బుధులైన
నవలగ్నలతఁ గాంచి యాసఁ జెంద
తే. వినుతసకలాగమాంతవాసనలు గన్న
ధన్యులైనను నెమ్మేనితావిఁ గోర
నలినసంభవుకడ నిల్చె నయనవిజిత
ముగ్ధసారంగి యాజగన్మోహనాంగి. ‖15‖

ఉ. బాలకురంగనేత్రి నునుఁబల్కులకున్ విరివింటివానిబా
బాలకువాదు పెన్ దొడల బంగరురంగుమెఱుంగు లంటికం
బాలకు రాదు నెమ్మొగము బా గలపున్నమచందమామ దం
బాలకుమీఁదు దానిసరిబాలిక లేదు జగత్త్రయంబునన్.॥16॥

క. కుందరమా దంతావళి
మందరమా చన్నుఁదోయి మై[1]జగ్గుజగా
హొందరమా యాభామిని
ముందర మానినియుఁ గలదె ముజ్జగములలోన్.॥17॥

ఆ. తూపు రూపుమాపుఁ దొయ్యలి నునుజూపు
సోముగోయు నోము భామమోము
కెంపుసొంపు నింపు శంపాంగియధరంబు
గౌరు సౌరు దేరు కలికినడలు.॥18॥

ఆ. లతల వెతలఁ బెట్టు లలితాంగినునుమేను
కలువఁ గెలువఁజాలుఁ జెలువచూపు
శుకముమొగముఁ గొట్టు సుకుమారిమాటలు
దరముఁ దఱుము లీలఁ దరుణిగళము.॥19॥

సీ. గిండ్లుగా గజనిమ్మపండ్లుగా బంగారు
చెండ్లుగా నింతిపాలిండ్లు దనరుఁ
గావిగా నమృతంపుబావిగా రుచిఁ దేనె
క్రోవిగా నలివేణిమోవి దనరు
రూపుగా మరుచేతితూపుగా సిరులకు
బ్రాపుగాఁ బూఁబోణిచూపు దనరుఁ
గుల్కుగాఁ గపురంపుఁబల్కుగా రాచిల్క
కళ్కుగా లతకూనపల్కు దనరు
తే. తమ్మి లనుకొనుఁ దమ్ములఁ గొమ్మముఖము
సరులు నీలంపుసరులకుఁ దరుణిగురులు
వింటికొనలకు సమము వాల్గంటిబొమలు
వర్ణితములౌనె శ్రీ లింతికర్ణములకు.॥20॥

సీ. పల్లవమ్ములకాంతినెల్ల వమ్ముగఁ జేయు
కామినీపాదపంకజము నిజము
తామేలుసొగసు న న్నేమేలు ననిమించు
బింబాధరీప్రపదంబుడంబు
వరిపొట్టకట్టి లావరిపొట్టని తలంచు
కలికిపిక్కలరంగు కలహొరంగు
రంభ మైపట్టి లారంభమంద విదుల్చు
తొయ్యలిబంగారుతొడలుకడలు
తే. చిలువబాగారు నయ్యారె, చెలువయారు!
తొలుకనాకాశతులకౌను చెలియకౌను
లలితపున్నాగముసనాభి లలననాభి
కనకలికుచంబు వరబాలికాకుచంబు.॥21॥

క. వరమా కరతల, మిందీ
వరమా కనుదోయి, హంసవరమా నడ, ని
ల్వర మాచెలిఁ గన మరుదే
వరమాయగఁ దనరె లోకవరమా యనఁగన్. ||22||

క. కరమా నునుదొడ, దర్వీ
కరమాజడ, జంఘ మే ల్మకరమా, చపలా
కరమా తనులత, కమలా
కరమా చెయి, చెలిని ధర సుకరమా పొగడన్. ||23||

చ. కినిసి కుచాననాంగరుచి గిన్నెలతో నెలతో లతోన్నతిన్
ఘనకచ కంత రూపములు కందరమై దరమై రమైక్యమై
గొనబగు వాక్కటీక్షలటు కోయిలకో యిలకో లకోరికో
వనితనొసల్ వళుల్ నడుము బాలహరిన్ లహరిన్ హరి న్నగున్. ||24||

క. గోరస మాపల్కులరుచి
సారస మాముఖవిలాససంపద మరుచే
నారస మావీక్షణ మళి
కౌరస మాకేశపాశ మబ్జాననకున్. ||25||

శా. బంతే చన్గవ నిగ్గు మేనురుచిపోల్పన్ జాళువామేలుడాల్
దొంతే కన్నులధాళధళ్యరుచు లెంతో కల్వకున్ జూడ మేల్
బంతే కంతునిదంతినేలునడలున్ బాగైన యీభామకున్
ఎంతేలేదు సమాన మెంచుటకుఁగా నీరేడులోకంబులన్. ||26||

సీ. తనుసృజించినబ్రహ్మ తనయంద మీక్షించి
తన్మయత్వము నొంది తత్తరింప
నైష్ఠికులైన సనత్సుజాతాదులు
మది జల్లుమన హరిస్మరణ సేయ
నధ్యాత్మవిజ్ఞానులైన సన్యాసులు
పరవశులై గగుర్పాటుఁ జెంద
వాణియు నప్సరోవనితాజనంబులు
'మగవారు కామైతి' మని తలంప
తే. ముద్దుముంగుర్లు కొనగోట దిద్దుకొనుచుఁ
దెలివిచూపు లకాలచంద్రికల నీన
నడలుగని ధాతతేజీలు జడనుపడఁగ
బాల్యయావనకల్య యహల్య యొప్పె. ||27||

సీ. 'అమృతాశనాధిపత్యము చెల్లునా దీని
యధర మానక' యంచు నమరవిభుఁడు
'దక్షిణనాయకత్వము పోలునా దీని
రతులఁ దేల్పక ' యంచు రవిసుతుండు
'నవరసరసికత హవణించునా దీని
సారెఁ గూడక' యంచు శరధివిభుఁడు
'సార్వభౌమస్థితి సమకూరునా దీని

వెంట నంటక' యంచు విత్తవిభుఁడు
తే. నలఘుశతకోటికాంక్షలు నతనుదండ
భృతులు నంజనతృష లలకేహితములు
నిన్మడింపఁగ ననిమిషదృష్టు లైరి
అంబుజభవోపలాల్య నహల్యఁ జూచి. ||28||

సీ. కల్కికటాక్షంబు కల్గితేగద తాను
గుసుమాస్త్రుఁడ నటంచుఁ గుసుమశరుఁడు
కొమ్మవాతెఱతేనెఁ గ్రోలితేగద తాను
మధువు నౌదునటంచు మాధవుండు
నెలఁతముద్దుమొగంబు నిమిరితేగద తాను
ఘనకళానిధి నంచుఁ గమలవైరి
సుదతియూరువుతావి సోకితేగద తాను
గంధవాహుఁ డటంచు గాలివేల్పుఁ
తే. దలఁచి రచ్చట సిద్ధగంధర్వయక్ష
చారణాదులు దత్కాంతిపూరవార్ధి
మగ్నులై చిత్రరూపులమాడ్కి నుండి
రంత శచికాంతుఁ డెంతయు నాత్మలోన. ||29||

మ. ఎలమించున్ దులమించు హేమలతయో యారేడులోకంబులన్
వలపించందగు కామదివ్యకళయో వాంఛన్ ద్రిలోకీదృగు
త్పలనీహారమయూఖరేఖయొ జగద్భాగ్యంబె యీరూపమై
లలిఁ [2]గన్పట్టెనొకాక యింతులకు నీ లావణ్యమున్ గల్గునే? ||30||

ఉ. డంబులు శైలశేఖరవిడంబులు దీనికుచంబు లెన్న నొ
చ్చెంబులువల్కుఁ గుందనపుఁ జెంబుల, నిద్దపుటద్దముల్ గపో
లంబులు, నీలమేఘపటలంబులు పెన్నెరు లౌర, యౌర యా
యంబుజగంధి రత్న మిలయందలి సుందరులందు నెంచఁగన్. ||31||

శా. రేరాజున్ నగుమోముతో వనరుహశ్రీఁ గేరుకందోయితో
బారన్ గొల్వఁగవచ్చు పెన్నురముతో బాగైన నెమ్మేనితో
'నీ రాజెవ్వఁడు సానురాగమున నన్నే చూచుచున్నాఁడు మే
లౌరా సోయగ'మంచు జిష్ణువు నహల్యాభామయున్ గన్గొనెన్. ||32||

క. అప్పుడు పూర్వకకుప్పతి
తప్పక యత్తరుణిఁ జూచె తరుణీమణియున్
ఱెప్పల నార్పక చూచెన్
గుప్పెన్ మరుఁ డిద్దఱన్ లకోరులచేతన్. ||33||

క. జగముల నన్నిటి నేలుచు
నగణితసౌందర్యవిక్రమైశ్వర్యములన్
బొగడొందెడు తనకంటెను
మగువకుఁ దగినట్టి వేఱె మగఁడుం గలఁడే. ||34||

చ. అని తనుఁజూచి తోడనె యహల్యను గాంచి సభాసదావళిన్

గనుఁగొని తాను వేఁడునెడఁ గాదనఁడంచు సురేంద్రుఁ డిట్లనున్
"వనరుహగర్భ మీమహిమ వర్ణనసేయఁ దరంబె యద్భుతం
బనుపమ మక్షిభాగ్యఫలమై సృష్టి యొనర్చి [3]తింతలోన్. ||35||

ఉ. చక్కఁదనాలకుప్పయగు చక్కెరబొమ్మను సృష్టి చేయుటే
యెక్కువగాదు దీని మది కింపగు నాథుని నిర్ణయించినన్
జక్కనితారతమ్యములు సర్వ మెఱుంగుదు వైనఁ దెల్పెదన్
దక్కొరు లెవ్వరుం[4]గలరు తన్వికి నేనొకరుండు దక్కఁగన్. ||36||

క. నరులన్ గిన్నరులన్ గిం
పురుషులఁ జారణుల సిద్ధపురుషుల ఋషులన్
బరికింపుము వీరలలో
విరిబోఁడికిఁ దగినవాఁడు వీఁడని చెపుమా! ||37||

ఉ. ముందుగ నేను వేఁడితిని మున్నుగ నే నినుఁ బ్రశ్న సేయఁగా
నిందుముఖిన్ సృజించితివి యెవ్వరికిన్ బనియేమి దేవరా
జ్యేందిరవోలె బాల ననుఁ జెందుటయుక్తము జాతిరత్నము
కుందనమున్ ఘటించినఁ దగున్ మఱియొక్కటి యొప్పియుండునే." ||38||

క. అనుటయుఁ బకపకనగి య
వ్వనజజుఁ డను "నీకు నీవే వడ్డించుకొనన్
జనునే యిప్పుడు నీ కి
వ్వనిత పొసఁగ దరుగు మగుడ వచ్చినత్రోవన్." ||39||

క. అనిపల్కి యచటనుండెడి
మునులం గని వీర లెల్ల + ము న్నొకతొకతెన్
గొనియుందురు గౌతముఁ డొకఁ
డనఘుఁడు నైష్ఠికుఁడు వాని కర్హ మటంచున్. ||40||

క. అక్షపదున్ భావితకమ
లాక్షపదున్ బిలిచి ధాత "యబ్జదళాక్షిన్
రక్షింపు మిది భవద్వ్రత
దీక్షకు శుశ్రూషఁజేయు ధృతమతి" ననుచున్. ||41||

ఉ. తేఁటిమెఱుంగుముంగురులుఁ దేటకనుంగవ లేఁతకౌనులున్
వాటపుముద్దుమేనులును వట్రువచన్గవ గల్గువారిఁగా
నాటకుఁ బాటకున్ గవిత లల్లుటకున్ దిటమైనవారిఁగాఁ
బాటలగంధులన్ సఖుల బల్వుర నిచ్చి యహల్య కిట్లనున్. ||42||

క. "మునికిన్ దినకరసమధా
మునికిన్ బరిచర్య సేయు ముదితాశయవై
ముని కింశుకవనికిం జను
మునికిన్ నీ కగుశుభంబు లుత్పలగంధీ!" ||43||

చ. అని పనిపంచ మంచిదని యంచితభక్తి విరించికిన్ వచో
వనితకు మ్రొక్కి యక్కలికి వల్గువిభూషణభూషితాంగియై

మునిపతి వెంట నేఁగె సురముఖ్యుని వీక్షొని; యింద్రుఁ డయ్యహ
ల్యను మది నెంచియెంచి మరునమ్ము లురమ్మున డుస్సి పాఱఁగన్. ||44||

క. అమరావతికిన్ వెసఁ జని
యమరావలిఁ బనిచి కుసుమితారామములో
నమరారిన పువ్వులశ
య్య మరాళిగమనఁ దలఁచి యాత్మగతమునన్. ||45||

ఉ. ఎన్నికలేల నీలమణు లెన్ని సరోజము లెన్ని దొండపం
డ్లెన్ని దరంబు లెన్ని గిరు లెన్ని మృణాళము లెన్ని పొన్నపూ
లెన్ని యనంటు లెన్ని దొన లెన్ని ప్రవాళము లెన్ని రత్నముల్
చెన్నుగఁ గూర్చి యేర్పడిచి చేసెను ధాత తదంగమాలికన్. ||46||

చ. మదనునిపొందుఁ గోరి రతి మానిని నోమిననోములెల్ల నీ
యదన ఫలించెనో యనఁగ నంగనగుల్ఫము లుల్లసిల్లుఁ ద
త్పదము లొనర్చి పద్మజుఁడు పాణితలంబు విదుర్పఁ జిందుత
త్పదమలకాంతిబిందులు రసాలకిసాలబిసప్రసూనముల్. ||47||

చ. మదవతిపాదముల్ దనకు మాతృసమానములంచు ధాత స
మ్మదమునఁ బూజచేసిననుమంబులనన్ నఖపంక్తి యొప్పగున్
మృదుగమనాగమంబు లెలమిన్ బఠియించి యుపన్యసించు చా
యఁ దనరు మంద్రనాదకలహంసకముల్ విలసిల్లు నింతికిన్. ||48||

చ. నవముగ మోముచంద్రుఁడు గనంబడి కప్పురతావిగుప్పెడిన్
రవికనె పిక్కటిల్లెను ఘనస్తనచక్రము లొప్పెఁదారకల్
నవిసెను బాల్యపుంజడదినంబు లటంచని జైత్రయాత్రకై
కవదొన లుంచె నిర్గముగఁ గంతుఁడనన్ జెలిజంఘ లొప్పగున్. ||49||

క. ఊరుయుగం బనుపేరన్
బారెడుబంగారునీటివాఁకను రతియున్
మారుఁడును జిన్నిగరిగలు
సారుగ ముంచిరనఁ జెలికి జానువు లమరున్. ||50||

క. కదలికలన్ మలినంబై
కదలికలన్ బొరలువిచ్చు కర్పూరంపున్
కదలికల నవ్వు శశిపా
కదలిక యూరుజిగి తెలిజగాచల్వ రుచిన్. ||51||

క. కుందనపువు గెంటెనపూ
వందంబున ముద్దు గుల్కు నంగన వలరా
మందిరము చంద మెన్నఁగ
సౌందర్యపు మూలబొక్కసం బన నమరున్. ||52||

క. కుందనపుతగడొ బంగరు
కెందమ్మిదళంబొ మిసిమి కేతకిరేకో
చందురుమెకముపదంబొ య

నం దగు కందర్పునగరునారీమణికిన్. ||53||

క. కలదని కొందఱు లేదని
యిలఁ గొందఱుఁ బలుక రెంటి కీరట్టుగ న
చ్చెలికౌను మధ్యమస్థితి
మలయుచునుం డట్లుగాన మధ్యంబయ్యెన్. ||54||

చ. నలువగురోమరాజి యమునానదినారి తదీయవీచికా
వళి వళులయ్యె నందు సుడివర్తులనాభి తదంతరీప మ
చ్చెలియనితంబబింబ మటు చేరువ గన్పడునట్టి రాజనం
బుల పొటకళ్ళులున్ మఱియుఁ బోవఁగ నాగెటిచాలు నొప్పగున్. ||55||

సీ. తమ్మిమొగ్గలు గాదు తారావళీహృద్య
శృంగారభంగి నెసంగుకతన
గజకుంభములు గావు కంఠీరవేంద్రావ
లగ్నభంగైకఖేలనమువలన
జక్కవకవ గాదు సరసల నెలవంక
లుంచంగ యోగ్యమై యుండుకతన
శైలేంద్రములుగావు శైలేంద్రగర్వంబు
ద్రుంచునె మున్ను భ్రమించుకతన,
తే. మున్ను శంకరుఫాలాగ్నిఁ బొసఁగఁబడిన
యతను బ్రతికించునట్టి దివ్యామృతంబు
లునుచు బంగరుకలశంబు లనఁగవలయు
వనితకుచములు పొగడ నెవ్వరితరంబు? ||56||

క. తరుణి కరద్వయసామ్యముఁ
బొరయన్ బ్రాయోపవేశ మొనరించెఁ గుశా
స్తరణమునన్ గమలంబులు
ధరణిఁ గుశేశయపదంబు దానం బూనెన్. ||57||

చ. ధరణిని గంధరాహ్వయముఁ దాల్చి కుచాద్రితటోపరిస్థితిన్
దిరముగ నుండి క్రొమ్మెఱుగుఁ దీగె చెలంగఁగ మౌక్తికచ్ఛటా
భరణ మెసంగఁ గంబురుచి పాటిల మోహతమంబు నించి య
మ్మరువపుబంతి యింతికి సుమంగళమౌ గళ మొప్పు మెప్పుగన్. ||58||

మ. సకలాభీష్టము లిచ్చునంచు సుమనస్సందోహముల్ నన్ను నా
యకరత్నంబని యెన్నునట్టి నను నాహా కొమ్మకెమ్మోవి యెం
చకయుండన్ గఠినంబటంచు ననుచింతాభారమున్ మీఁదఁ దా
ల్చికదా వేలుపు మానికంబుగనియెన్ జింతామణీనామమున్. ||59||

క. పగడంబుడంబు వలదను
జిగురాకున్ రాకుమనునుఁ జెలివాతెఱ యా
వగలాడినాస యా సం
పగిమొగ్గన్ బగుల ద్రొక్కుఁ బగ[5]మగలీలన్. ||60||

ఉ. క్రొన్నెలవంకశంక లిడు కుల్కుబొమల్ గని యచ్చకోరముల్

పన్నుగ నొప్పు ఱెప్పల నెపంబునఁ జొక్కపుఱెక్క లార్చుచున్
కన్నులు గల్కికన్నులయి కన్పడె నా జిగిడాలుఁ జూచి యా
కన్నులవింటిరాయఁడు జగంబులు గెల్వఁగ డాలుఁ గైకొనెన్. ||61||

క. నాసా కాంచనకోశచ
కాసాదృగ్విభ్రమంబు కర్ణాటశ్రీ
భాసురమై చెలిమోము వి
భాసిల్లెన్ రాజరాజపట్టాంచితమై. ||62||

చ. అలికచమోముఁ బోలను సుధాంశుసరోజము లొక్కపుష్కర
స్థలమునఁ బ్రార్థనల్ సలుపఁ జంద్రుఁడు పొందెఁ బ్రసాద మంతలో
పల బహురాజపానమధుపస్పరిశంబున యోగభంగమై
జలజమటుండెఁ గానియెడం జందురునిం గని సైఁచియుండునే? ||63||

ఉ. భామినియారు సూదిమొనపైని జనుంగవపోక లుంచి యా
పై మఱినిల్చి కంతము తపస్థితి నబ్జత నొందె మోవియున్
దా మదిఁ జూచి యబలను దప్పక పొందె మొగంబు నట్లనే
యేమఱకబ్జతం బడసె నింపుగఁ గన్గవ చెందె నబ్జతన్. ||64||

చ. తొలి నవపత్రమై పటిమ దోపమిచే శతపత్రమై చలం
బెలయ సహస్రపత్రమయి యింతిపదంబులు దాఁకి తోడనే
దళములఁ బాసి రోసి బిసదండముఁ జెండెఁ గముండ లుత్తగన్
నలినము హంస సంగతి దినంబునుగాంచు నభీష్టయోగమున్. ||65||

ఉ. మారుఁడు లోకముల్ గెలిచి మాతృగృహంబున నుంచె జైత్రతూ
ణీరము లన్నయట్లు తరుణీమణిపాదయుగంబుమీఁద జం
ఘారమఁ జూడ నొప్పె నటుగాకయ హేమమయోరుకాండముల్
మీఱునె తత్సమీపమున మించి సమంచితశైత్యసంపదన్. ||66||

ఉ. అంబుజగంధి యూరువుల యందముతో సరిబోరవచ్చి హే
రంబు గజేంద్రహస్తము తిరంబుగఁ జెందెను దంతభంగ మ
య్యంబరదంతిరాట్కరము నభ్రముఁ బట్టుక ప్రాఁకు దాని చే
తంబడు నంటికంబములుఁ దార్కొనినం దలవంపు లౌఁగదా! ||67||

తే. చిన్నిపదముల హలరేఖచేత సీత
దీలుపడు కౌనుచేత విదేహజాత
గోముమీఱినకటిచేత భూమిపుత్త్రి
యనఁగ విలసిల్లు నయ్యింతి యతనుదంతి. ||68||

క. కురులో యొమ్మగు తుమ్మెద
గఱులో చకచకితకాంతఁ గనునీలపురా
సరులో యిందీవరపున్
విరులో యిరులో యనంగ వెలఁదికి నమరున్. ||69||

తే. తూండ్లు భుజములు జాళువాగిండ్లు గుబ్బ
లేండ్లుపదియాఱు నెన్నఁటి కెన్నటికిని

విండ్లు కనుబొమ లౌర, యీవెలఁది వేడ్కఁ
బెండ్లియాడినఁగద నేను బెంపుగాంతు. ||70||

ఉ. మాయురె! తత్సమాన యగు మానినిఁ గాన జగంబులోన నా
హా! యిటువంటి చక్కదన మవ్విధి యెవ్విధిఁ జేయనేర్చెనో
హాయిరె! బాలచూపుతుద లక్కట జక్కడపున్ మెఱుంగులై
నాయెద డుస్సిపారె రతినాథుని యాధునికాస్త్రవైఖరిన్. ||71||

సీ. మెలఁత మైజిగిఁ బోలు మెఱుపుఁ జూచెదనన్న
నింపొందఁ గందోయి యెదుట నిలదు
సఖిమోము సొబగొందు చంద్రుఁ జూచెదనన్న
మబ్బు నిబ్బరముగా మరుగువడెను
చెలిగుబ్బసరి జక్కవలను జూచెద నన్న
బక్షపాతము గల్లి బైటఁ దిరుగు
మగువ యా రీడుపన్నగముఁ జూచెదనన్న
బిలములోపల నుండి వెడలు టరుడు
తే. వనిత యవయవసాదృశ్యవస్తువులను
జూచియేనియు నొకపాటిసుఖముఁ బడసి
చింత మదిలోన నుపశమియింతు ననిన
దానికినిసైత మాబ్రహ్మ తాళఁడాయె. ||72||

చ. తన కది కూతురాయె పురదానవవైరికిఁ జెల్లెలాయె న
వ్వనధిసుతామనోహరుఁ డవాప్తసమస్తమనోరథుండు గా
న నది యలక్ష్యమే నొకఁడ నాతికి నర్హుఁడ నన్నటుంచి బా
పనిపరిచర్య కంపె వలబంగరుబొమ్మను బొమ్మ నేమనన్. ||73||

క. కామునిచర్యల కగు చెలి
కా మునిచర్యలకు వగునె యకటా మాధు
ర్యామలసాహితి రసికశి
ఖా[6]మణికినిగాని మడ్డిగానికిఁ దగునే? ||74||

తే. కమ్మవిల్కానియమ్ముల కుమ్మలించి
నెమ్మి నే వేఁడ నెమ్మది సమ్మతిలక
పొమ్మనియె ముద్దుపుత్తడిబొమ్మ నియక
బమ్మయే వాఁడు పెనుజాతిబొమ్మగాని. ||75||

చ. మునుకొని సిగ్గుతో నళికి మో మటు ద్రిప్పి కరాంగుళిద్వయం
బునఁ జుబుకంబు నెత్తి నునుమోవిని గ్రోలినఁ నొచ్చె నొచ్చె నం
చని తనలోనఁ బల్కుచు రవంతయుఁ గంతునిఁ దోపనీయకే
కనుఁగవ కింపుసేయు నల కన్యను గూడి చెలంగు టెన్నఁడో. ||76||

చ. మిసమిసలీను మొల్కచనుమిట్టల కట్టిటు కేలుసాచఁగా
దుసికిల నట్టె మిట్టిపడి తొయ్యలి చె య్యటుద్రోయ నెయ్యపున్
గొసరులఁ గుస్తరించి కొనగోటను బొక్కిలిఁ జీటి మెల్లనే
యొసపరి నీవి కొగ్గుచు నయో కడువేడుక లందు టెన్నఁడో! ||77||

చ. చను(గవక్రేవ(జూచినను స్వస్తికహస్తము చేత(గప్పుచున్
గొనబుగ ముద్దుపెట్టుకొన(గొంకుచు మో మటులిట్టు(ద్రిప్పుచున్
గను(గవ మూసి నాదు రతికౌశలి(జూడక సిగ్గువెల్లిలో
మును(గుచు నుండు ముగ్ధయగు ముద్దులగుమ్మను జూచు టెన్నడో! ||78||

సీ. సిబ్బెంపుగుబ్బలం జెనకనీయని సిగ్గు
చెనకిన(బులక లెంచించు తమియు
కొమరైన వాతెర(గ్రోలనీయని లజ్జ(
గ్రోలినచో మరుల్ గొలుపు వలపు
నెఱికొప్పు కెంగేల నిమురనీయనినాన
నిమిరిన వలపున నిలుచు ప్రేమ
బిగిపోకముడి నంట విడువనీయని వ్రీడ
యెనసిన [7]విడువక మనెడు తమక
తే. మెదను సమముగ(బెన(గొన హృద్యమైన
మధ్యమవయస్సుముద్దుగుమ్మయును నేను
నందనోద్యానవనసీమలందు(గూడి
పొందికలచేత నానంద మొందు టెపుడొ? ||79||

చ. పలుకులలోన(బిక్కు లొకపానుపునన్ బొలయల్కచిక్కులున్
కల(కలు దీఱు మ్రొక్కులును గాటపు(గౌ(గిటిలోన సొక్కు ల
గ్గలమగు మోవినొక్కులును గామునిసాములనేర్పుటెక్కులున్
గల యల నిండుజవ్వనపు(గన్నియమిన్నను బొందు టెన్న(డో? ||80||

చ. కల(గి చలించు ముంగురులు కర్ణములన్ నటియించు కమ్మలున్
చిలికెడు చిన్నిక్రొంజెమట చెక్కుల నించుక జరు కొంచెపున్
తిలకము నొప్ప(బౌరుషరతిశ్రమతాంతవిలోలనేత్ర యా
కలికిమొగంబు నెన్న(టికి(గన్నులపండువు గా(గ(జూతునో? ||81||

ఉ. ఇంకొకసారి పోయి హరిణేక్షణ నిమ్మని వేడుకొందునో
పంకజగర్భు నాత(డు కృపారహితాత్మత నీయకుండెనా
కొంకు దొఱంగి జంగ యిడి క్రూరు(డు మారు(డు లీల బాలచూ
తాంకురసాయకానలశిఖావళికిన్ శలభంబు(జేయ(డే? ||82||

ఉ. ఆసరసీరుహాక్షిపయి నాసల సాసరివారు నవ్వ ను
ద్వాసితధైర్యతన్ విసివి వాసనవింటివజీరునమ్ములన్
గాసిలుచున్నవాఁడ నను(గన్నడసేసె విధాత యయ్యయో!
దోసము కాదొకో తనకు(దొయ్యలి నీయక యిట్టు లేచుటల్. ||83||

సీ. [8]చాన కమ్మనిమోవి చవి(గ్రోల(గల్గితే
మధులక్ష్మి కీ పుష్పమంటపంబు
కలికిమోమున మోము(గదియింప(గల్గితే
యబ్జునకును గమలార్పణంబు
అరవిందముఖికొప్పు నఱుమంగ(గల్గితే
నీలకంధరునకు నెమలిపించె
కలకంఠిపల్కు లాకర్ణింప(గల్గితే

హృద్యవాగ్ద్విజుల కభీష్టఫలము
తే. అలికచకుచంబు లంటంగఁ గలిగెనేని
యేడుకొండలరాయని కేను భక్తిఁ
గనకశిఖరము లెత్తింతుఁ గంతుకాఁక
తీరుఁగాక, వయారి నన్ జేరుఁగాక! ||84||

క. అని యనిశముఁ జింతించుచు
ననురాగమునన్ దరంగితాశాశయుఁడై
వనితను మనమునఁ దలఁచుచు
ననిమిషపతి వెండియున్ మహామోహమునన్. ||85||

సీ. మగునపాదములని చిగురుటాకుల నెత్తు
సఖియూరులని కదళికల హత్తు
సతినితంబంబని సైకతస్థలి వ్రాలు
చెలువవళులని వీచికలను దేలు
మెలఁతయారనుచుఁ దుమ్మెదచాలుఁ గని సొక్కు
కలికిచన్నులని జక్కవల నొక్కు
పొలఁతి గళంబని పోకబోదియ నూను
వెలఁదిమోవి యటంచు బింబ మాను
తే. రమణినేత్రంబులని చకోరములఁ జూచు
చెలువకొప్పని నెమ్మికై చేయిఁ జాచు
తెలిసి తోడనె విరహార్తి దిగులుఁజెందు
కుందు నందనమందు సంక్రందనుండు. ||86||

సీ. ప్రతిలేని చిత్తరుప్రతిమ నీడ్వఁగఁ బోయి
ముదిత కాదని యెంచి బెదరి చూచు
తననీడఁ గని కౌఁగిటను జేర్పఁగాఁ బోయి
మగువ కాదని యెంచి వగచి నిలుచు
మొనసి యింద్రాణితో ముచ్చటాడఁగఁ బోయి
మునిరాణి కాదని [9]మనసు నొచ్చు
కనుమూయఁ దోఁచురూపును బట్టఁగాఁ బోయి
తరుణి దబ్బరటంచుఁ దత్త రించు
తే. రమ్మనుచుఁ జీరుఁ జెంతల క్రమ్మిచేరు
మోహ మెదఁ గూఱుఁ గళఁదేరు ముద్దుఁగోరు
గోరికల మీఱుఁ బలుమాఱు మారు దూఱు
నమరవిభుఁ డెట్లు దనరారు నట్టెతారు. ||87||

ఉ. జాదులు సూదులంచుఁ దెలిచల్వలు చిల్వలటంచుఁ గప్రపున్
వేదులు నేదులంచు నెలనిగ్గులు నగ్గులటంచు రాజకీ
రాదులు వాదులంచు మణిహారము భార మటంచు నెంచుచున్
పైదలిపైఁ దలిర్చుతమి పర్వ సుపర్వవరేణ్యుఁ డుండఁగన్. ||88||

ఉ. అచ్చట నాయహల్యయు వియచ్చరవల్లభురూపసంపదల్
మెచ్చుచుఁ బచ్చవింటియెకిమీని లోరికి నిచ్చ నొచ్చుచున్
నెచ్చెలిచాలు గొల్వ నవశనీయహుతాశనధూమమండలా

భ్యుచ్ఛ్రయవేష్టితాగము తపోవనభాగముఁ గాంచె నంతటన్. ‖89‖

సీ. ఉంఛధాన్యసమర్పితోర్వరాధీశార్హ
షష్ఠభాగాంకితసైకతంబు
త్రిషవణాప్లుతమౌనిధృతవల్కలాంచల
పృషతచంద్రకవఝ్ఝరీతటంబు
మునిబాలకానీతపునరంకురత్కుశ
శ్యామికాకోమలక్ష్మాతలంబు
పృషదాజ్యహోమసమేధమానహుతాశ
ధూమగంధావృతవ్యోమభాగ
తే. మతిథి[10]పూజార్హవస్తుసమార్జనైక
సంగ్రహవ్యగ్రగృహమేధిసంకులంబు
శాంతము నగణ్యపుణ్యనిశాంత మగుచు
శ్రమముల నణంచు గౌతమాశ్రమముఁ జేరె. ‖90‖

క. జలజాతాసనునాజ్ఞన్
కలకంఠీతిలక మపుడు గౌతమమునికిన్
చెలఁగి పరిచర్య సేయుచు
ఫలకిసలయకుసుమసమిదుపాస యొనర్పన్. ‖91‖

క. తాళీహింతాళీకం
కేళీవకుళామ్రనారి కేళీకుహళీ
పాళీఘనకేళీవన
మాళీతతి గొలువఁజేరె నాళీకముగాన్. ‖92‖

చ. అళికచముంగురుల్ గనిన, యబ్జములందలితేంట్లు దూఁటె దొ
య్యలిపలుకుల్ వినంగఁ బొదలంతట గోయిలదండు చేరె నె
చ్చెలికుచకుంభముల్ గనుచుఁ జెట్లకుఁ జక్రములెల్లఁ బాఱెఁ గో
మలినడయందముల్ దెలిసి మానసమున్ వడిఁ జేరె హంసముల్. ‖93‖

సీ. అందముల్ త్రిభువనానందముల్ స్మరమూల
కందముల్ సరసమాకందము లివె
తుంగముల్ పుషితసారంగముల్ వాసనా
రంగముల్ లలితనారంగము లివె
చారువుల్ నవకేసరోరువుల్ [11]భాజిత
మేరువుల్ వికసన్నమేరువు లివె
సైకముల్ మధురసానేకముల్ కృతజనా
శోకముల్ పుష్పితాశోకము లివె
తే. పొగడ నెగడిన మొగడల పొగడ లివియె
తుంటవిలుదంట నంటుల నంటు లివియె
కొమ్మచనుగుమ్మ యొమ్ముల నిమ్మ లివియె
కలికి! యాతోఁట చిగురువిల్కానికోట. ‖94‖

ఉ. బాల నిజంబు నీపలుకు భాసిలుకొమ్మలు కొత్తడంబులున్
రాలు రజంబు మందు బలునారికెడంబులపాళెలు ఫిరం

గీ లలపండ్లు గుండ్లు నళికీరచకోరమయూరపాలి యు
త్కూలబలంబు నై న మరుకోటయె యీయెలదోఁట చూడఁగన్. ॥95॥

చ. తెలివిరిపొన్నగిన్నియల తేనియమద్యము లాని సొక్కులన్
గులుకుచు మొగ్గచంటిలతకూనలమోవుల నొక్కి ముద్దుకో
యిలపలుకుల్ చెలంగ నల యింతుల పయ్యెద లొయ్యఁదీయుచున్
దిలకపుఁ దావు లంటుచును ద్రిమ్మరి తెమ్మెర గ్రమ్ముఁ గొమ్మరో! ॥96॥

చ. కుసుమసమూహవాసనలఁ గుల్కెడు నీ లతకూనయొక్క తా
పసతరుఁ జేరవచ్చె నదె పద్మదళాయతనేత్రి, కంటివా
కుసుమసమూహవాసనలఁ గుల్కెడు నీలతకూనయొక్క తా
పసతరుఁ జేరి యుండుటిది పద్మజు నానతిఁ గాదె కోమలీ! ॥97॥

చ. అమితమరందతోయముల నర్ఘ్యము పాద్య మొసంగియున్ మద
భ్రమరరవంబులన్ గుశలభాషణముల్ సవరించి వేడ్కతో
గమలజుముద్దుకూఁతురని కైకొని నిన్ను వసంతలక్ష్మి ప
క్షముదగఁ బూజ సల్పెడు లసద్బిసతంతుసహోదరోదరీ! ॥98॥

క. దాడింబపండ్లకై వెస
వేడెంబులు వెట్టిఁ జిలుక విరిబోణీ, నీ
కోడెచనుగుబ్బగవకై
వేడుకఁ బడి తిరుగు నమరవిభుమదిఁ బోలెన్. ॥99॥

ఉ. అన్నులమిన్న శోకహర మౌట యశోకసమాఖ్యఁ గాంచు నీ
సన్నుతశాఖరాజమును సారెకుఁ దన్నెదవేమి న్యాయమే
కన్నులవింటిబోయకును గైదువు లిచ్చి సమస్తపాంథులన్
మన్నిగొనున్ బలాశి యిది మన్నన కర్హ మటే విలాసినీ! ॥100॥

క. నుడువుచు నీగతిఁ జడలన్
నడుముల్ బిగియంగఁ జుట్టి నారీనివహం
బెడనంతఁ దన్నుఁ బొగడఁగ
నొడిగట్టెను మారుఁ డఖిలయువధృతిహృతికిన్. ॥101॥

సీ. మైసిగ్గుసొంపు సంపగివసంతములచే
బ్రమ్ముతుమ్మెదబారుఁ బాఱఁ దరిమి
సంకుమదామోదసహజవాసనలచే
జిలుకల నెల్లదిక్కులకుఁ ద్రోలి
లోలమానాపాంగజాలకశ్రేణిచేఁ
బికజాలములఁ బికాపికలు చేసి
నెఱికొప్పు నెఱకప్పు నీలాభ్రపంక్తిచే
మదమరాళంబుల నదరఁ దోలి
తే. తావియుడివోని విరులు క్షతంబులేని
ఫలములు నచుంబితములైన పల్లవములు
నంచ లంచలఁగలఁచని మంచినీళ్లు,
దరుణి యొసగంగ మునిపతి తపము సేసె. ॥102॥

ఉ. ఆతరళాక్షియందము మహత్తరమౌ కటిమందమున్ వచో
జాతగళన్మరందము నిజంబగు నెమ్మెయిగంధమున్ బెడం
గౌ తరితీపుచందము మహామునిడెందము నొంపదాయె నం
తే తరుణీవిలాసముల ధీరులచిత్తము దత్తరిల్లునే.॥103॥

క. ఆనిష్ఠానిధినిష్ఠయు
భూనుతమగు బ్రాహ్మచర్యమును గాంచి యజుం
డానాతిఁ బెండ్లిసేసెన్
గానేతరధైర్యఖనికి గౌతమమునికిన్.॥104॥

చ. సతతము నద్నిహూత్రపరిచర్యయు దేవపితృప్రతోషణం
బతిథిసమర్చనంబు మొదలైన గృహస్తవిధానమెల్లఁ బ్ర
స్తుతమతిఁ జేయు గౌతమునికితోడ నహల్య కృతానుకూల్యమై
స్థితి విలసిల్లఁ గాపురము సేయుఁ బురంధ్రులు సన్నుతింపఁగన్.॥105॥

క. వనజాక్షి యిట్టులుండియుఁ
బనిదీరినవేళ నొంటిపాటున బలసూ
దను చక్కఁదనమె తలచున్
వనితల నమ్ముదురె శివశివా యెంతైనన్.॥106॥

ఉ. జన్నములందు నింద్రు గుణశంసనముల్ విను సాదరంబుగాఁ
బన్నుహవిర్విశేషములు పాకవిరోధికి నిచ్చుమెచ్చుగాఁ
గ్రన్నన సన్నుతింపు శచికాపురమే కద కాపురం బటం
చన్నలినాయతాక్షి తనయందముఁ జూచి శిరంబు నూఁచుచున్.॥107॥

ఉ. "వేళయెఱింగి కూడి రతిభేదములన్ దనియించి యల్గినన్
బాళిని బుజ్జగించి రసభావములన్ గరఁగించునాయకుం
డేల యదృష్టహీనలగు నింతులకున్ లభియించు" నంచు నా
లోలవిశాలనేత్ర తనలోపలఁ గుందును వెచ్చనూర్చుచున్.॥108॥

మ. ప్రమదారత్న మహల్య యింద్రుని మదిన్ భావించుఁ దోడ్తోన ధ
ర్మము గాదంచుఁ దలంచు నెంచినగతిన్ రానిచ్చునా దైవమం
చు మదిన్ వేసరు నిచ్చవచ్చువిభుతోన్ సొంపొందు టిల్గాంద్ర కే
లమరుంబొమ్మను నాఁడుపుట్టువున నాహా, పుట్టనౌనా యనున్.॥109॥

తే. కోరఁదగినట్టి కోరికల్ గోరవలయుఁ
గాని రాయలుగను కలల్ గాననగునె?
పంగుఁడైనట్టి జనుఁడేడ, గంగయేడ?
యొల్ల నీ వట్టివెతలని యూరకుండు.॥110॥

మ. అది యట్లుండె సురేంద్రుఁ డంతట నహల్యాయత్తచిత్తంబుతో
హృదయాంతర్గతచింతతో ననుదినోద్రిక్తానురాగంబుతో
గదియంగూడని కాఁకతో నవిజహద్గంభీరభావంబుతో
మదనోన్మక్తనవాతిముక్తశరసంపాతంబు సైరించుచున్.॥111॥

చ. మదనుఁ డనల్పశిల్పకళ మాటికి నేర్పఁగ రాగసంపదల్

కుదురుగ సంఘటించి యవికుంఠితభావనపేరితూలికల్
హృదయపుఁబల్కయందు నవనీరజలోచనరూపవైఖరుల్
విధితముగా లిఖించుచును లేఖవిభుం డనిశంబుఁ గన్గొనున్. ||112||

సీ. అంగతాపముడింద హరిచందన మలంద
నది మేనికాఁకచే నగ్ని యయ్యె
శ్వాసవేగ మణంప జలజ మాఘ్రాణింప
నది కంతుసమ్మోహనాస్త్ర మయ్యె
తనువుచెమ్మట దీర్పఁ దొషారజల మార్ప
నది మారభోగివిషాంబు వయ్యె
డెంద మారటదీఱ నందనవనిఁ జేర
నది యసిపత్రవన్యాభ మయ్యె
తే. ముల్లుదీసినయెడఁ గొఱ్ఱు మొత్తినట్టు
లొకటి సేయంగఁబోయిన నొక్కటయ్యె
నెంతగ్రహచారమో నిర్జరేంద్రునకును
మకరకేతుమహాదశ వికటమయ్యె. ||113||

సీ. మందారవని కేగు మందారవనిలోన
డెంద మానందంబు నొందకున్న
మందాకినికి నేగు మందాకినీతటి
మారజ్వరనిదాఘ మారకున్న
మందరగిరి కేఁగు మందరగిరియందుఁ
బొందికగాఁ బ్రొద్దుపోవకున్న
బిందుసరసి కేఁగు బిందుసరస్సులో
నారాటమింతేనిఁ దీఱకున్న
తే. బుడమి కేతెంచి గౌతమమునివరేణ్యు
నాశ్రమంబున కేఁగి యహల్యమేని
కమ్మనెత్తమ్మినెత్తావిగాడ్పు సోఁకఁ
గొంతవిశ్రాంతిఁ గనికోరి కుధరవైరి. ||114||

ఉ. ఒక్కొకవేళ వచ్చి పురుహూతుఁడు జాఁగిలిమ్రొక్కి జాళువా
చక్కని కమ్మతమ్మి కవచానపదంబుల నంటునట్లుగా
మక్కువ మౌనికిచ్చు ముని మానిని కిచ్చు వధూటి నవ్వు లేఁ
జెక్కు లఁ దోపఁ గన్నుఁగవఁ జేరును నాతనికేలు మాఱుగన్. ||115||

చ. ఎవరది యింటిలోపల?
న దెవ్వరు?
శక్రుఁడ;
చెల్లి! మీరలా,
యివలికి రండు;
నీదుమగఁ డెక్కడ?
మూల ఫలార్థ మేఁగె;
రా
నువిదరొ, తామసంబగునొ?
ఉండుఁడు, పూజలు గాంచి పొండు;

సే
యవలయు పూజ నీ వెఱుఁగవా?
-యన సిగ్గున నేఁగు నవ్వుచున్. ||116||

మ. మునితో నింద్రుఁడు మాటలాడునపు డంభోజాక్షి కీలందె గ
ల్లన మైజల్లన మాట తోఁపక వితాకై యుండఁ దద్భావమున్
గని యాజవ్వని సిగ్గు ప్రౌఢిమయు శృంగారంబు లేనవ్వులున్
మొనయంజూచు నతండు చూచిన మరల్చున్ జూపు వేఱొక్కెడన్. ||117||

ఉ. ఈనళినప్రవాళములు నీకదళీతరు లీమహీస్థలం
బీనడబావి యీఖగము లీలత లీక్రముకాభిరూప్య మీ
భూనుతసోమలక్ష్మియు నపూర్వములంచు నుతించు వాసవుం
డానలినాక్షిచక్కఁదన మాశ్రమవర్ణనగా మునీంద్రుతోన్. ||118||

ఉ. రంగదభంగవైభవము రాజిల యజ్ఞములందు నభ్రమా
తంగము నెక్కి యింద్రుఁడు తదాశ్రమవీథిని వచ్చుచోఁ జెలిన్
ముంగటఁ జూచి కన్నులను మ్రొక్కు మనస్సున గౌఁగలించు న
య్యంగన రెండునుంగని యనంగుఁడు పువ్వుల వైచు కత్తికిన్. ||119||

క. ఈగతి నింద్రుఁ డహల్యా
రాగతిరస్కృతశచీపురంధ్రీరతియై
ద్రాగతివేలకృతస్వ
ర్భాగతియై తిరిగె నానుపోసినరీతిన్. ||120||

ఉ. కౌస్తుభచారువక్ష సితకంజదళాక్ష కళిందకన్యకా
నిస్తులనీలవర్ణ కమనీయ చరాచరమానసనీయ ప
ద్మాస్తనకుంకుమాంక నవమండన దానవదర్పఖండనా
కస్తురిరంగ రంగపురకైరవపూర్ణకురంగలాంఛనా! ||121||

క. కుందారవిందసుందర
మందారసుకీర్తిహార మహితవిహారా
వందారుజనాభీప్సిత
బృందారకరత్న సమరభిన్నసపత్నా! ||122||

మత్తకోకిల. చంద్ర పుష్కరిణీతటాంచలచార చారణసన్నుతా!
మంద్రనీరదమాలికాసుకుమార మారశతోపమా!
సాంద్రసత్కరుణానవామృతసార సారసలోచనా!
ఇంద్రచంద్రదినేంద్రముఖ్య సురేశ యీశవిభావితా! ||123||

——————♦ గద్య ♦——————

ఇది శ్రీ పాండ్యమండలాధీశ్వర శ్రీ విజయరంగ చొక్కనాథ మహీ
నాథకరుణాకటాక్ష సంపాదిత గజతురంగ మాందోళికా ఛత్రచామర
విజయదోహళ కాహళ భూరిభేరీబిరుదధ్వజ ప్రముఖాఖిల
సంపత్పారంపరీసమేధమాన సముఖ మీనాక్షీనాయక
తనూభవ శ్రీమీనాక్షీదేవీ కటాక్ష
లబ్ధకవితాసాంప్రదాయక వేంకట

కృష్ణప్పనాయక ప్రణీతంబైన
యహల్యాసంక్రందనంబను
మహాప్రబంధంబునందు
ద్వితీయాశ్వాసము.

[1] నిగ్గు
[2] గన్పట్టును
[3] రింతలోన్
[4] దగరు
[5] మ్రొగ్గతిలన్
[6] మణికే
[7] విడువకు మనెడు
[8] చాన! రమ్మని
[9] ముగుద నెంచు
[10] పూజార్థ
[11] భాసిత

శ్రీరస్తు

అహల్యాసంక్రందనము

తృతీయాశ్వాసము



శ్రీతరుణీనయనోత్పల
శీతమయూఖాభిరామ శ్రితజనవాంఛా
జాతప్రతిపాదన చణ
చేతోవ్యాపారనిరతి శ్రీరంగపతీ! ||1||

వ. అవధరింపుము. ||2||

క. శ్రీయుతుఁడగు జనమేజయుఁ
డాయతమతి నవలికథల నడిగిన మదికిన్

హాయి దలిర్పఁగ వైశం
పాయనుఁ డిట్లనియె లోకపావనచరితన్. ||3||

క. ఇటులుండ నొక్కనాఁ డా
కుటిలాలక కడకు వచ్చెఁ గొంకక ఘటనా
ఘటనాకోవిదమతి యగు
జటినీమణి యోర్తు లలితసత్వరగతియై. ||4||

చ. పదముల యోగవాగెలును బాణితలంబున నాగబెత్తమున్
నుదుట విభూతిరేఖయు మనోజ్ఞకటీతటిఁ గావిజీరె పొన్
బొదివినయట్టి యొక్కమొగపున్ రుదురాకలదండ సందిటన్
వదనమున్ మృదుస్మితము వర్తిలు యోగినిఁ గాంచి భక్తితోన్. ||5||

క. వందనమొనర్చి పూజల్
పొందికగాఁ జేసి పీఠమున నునిచియు బా
లేందుముఖి! యెందుఁ బోయెదు
వెం దుండుదు విందు వచ్చు టేమి యటన్నన్. ||6||

ఉ. ఉంచును సత్యలోకమున యోగబలంబున నెల్లదిక్కులన్
బొందుగ సంచరింతు శశిఖండకిరీటికిఁ దద్వధూటికిన్
మందరధారికిన్ రమకు మాటలబోటికి నవ్విరించికిన్
పొందికలం దెడాటములు పుట్టిన మాన్పుదు వారు మెచ్చుఁగన్. ||7||

క. నందనవని నిన్నన్ సం
క్రందనుఁ గనుఁగొంటి నతనిఁ గనినంతనె నా
డెందము భగీలుమనియెన్
దందడిఁబడు వానిదీనదశ యేమందున్? ||8||

సీ. నిబిడోష్ణనిశ్శ్వాసనికరంబుచేఁ గల్ప
వనవాటి తాపించవన్నె గాఁగ
కల్పానలాకల్పకందర్పవహ్నిచే
నెసఁగు విర్వాక యిట్టింకులింక
ధారాళనేత్రాంబుధారాతివృష్టికి
జలదసందోహ మాశ్చర్యమొంద
నత్యంతకఠినదీనాలాపములచేత
వజ్రమేనియు గుండె పగిలి యెడల
తే. కరుణయెల్లఁ బుమాకృతిఁ గాంచినట్లు
విరహతాపంబు మూర్తీభవించినట్లు
తలఁచి పలుకంగరాని దుర్దశలఁబొందు
మఘవు నే నందుఁ గనుఁగొంటి మచ్చెకంటి. ||9||

ఉ. ఎవ్వతెమీఁదనో హృదయ మీభువనత్రయనాథు నింతగా
రవ్వలఁ బెట్టినట్టి యలరక్కసి యెవ్వతొ చూతమంచు నే
నవ్వల మధ్యకుంజకుహరాంతరసీమ నణంగియున్నచో
నవ్వలశాసనుం డనియె నవ్వల నవ్వలమానవేదనన్. ||10||

ఉ. 'ఏల సృజించె దాని నను నేల సృజించెను బ్రహ్మ దాని కీ
లాలితరూపయౌవనకళాలలితాంగవిలాసవిభ్రమం
బేల నొసంగె? బేలతని మేటికి నిచ్చె, మదీయబుద్ధికిన్?
బాలికతోడ నామనవి బల్కెడువారి జగానఁ గానఁగా. ||11||

మ. 'కలలోఁ జూతునటన్న నిద్ర యెఱుఁగన్ గన్నారఁ జిత్తర్వునన్
దెలియం జూచెదనన్న బాష్పములచే నేత్రాబ్జముల్ క్రమ్మెడిన్
కలయన్ ధ్యానముఁ జేతునన్న మది నున్మాదంబు సంధిల్లెడిన్
ఇలలోఁ దాళఁగరానితాప మహహా యెట్లోర్చెదన్ దైవమా! ||12||

చ. 'కులుకుటొయారపున్నడలు గుబ్బచనుంగవ గొప్పకన్నులున్
తొలుకరిక్రొమ్మెఱుంగుగమితో గమితోపమమైన మేనితో
నలయలివేణి లోవెలి నహర్నిశమున్ గనుపట్టుచుండియున్
జలగత చంద్రమండలము చాడ్పునఁ జేతికి నబ్బ దక్కటా! ||13||

మ. 'ధనికున్ జేయును లోభివాని నెఱదాతన్ బేదఁగాఁ జేయు ర
త్యనభిజ్ఞుండగు నెడ్డెకున్ మదనతంత్రప్రౌఢయౌదాని భా
ర్యనుగాఁ జేయు నటన్న కోపమునఁ గాదా బ్రహ్మశీర్షంబు ద్రుం
చెను శంభుం డటువంటివానికి ననౌచిత్యం బనన్ జెల్లునే?' ||14||

క. అని పలికి చిత్రఫలకం
బునఁ దనభావమున నున్న ముద్దులగుమ్మన్
దనువునఁ బులకలమొలకలు
పెనఁగొనఁగా వ్రాసి చూచి పేరెద నునిచెన్. ||15||

క. 'ఆరూపము నీరూపము
సారూప్యముఁ జెంది యుండె జలజదళాక్షీ!
మారుఁడు స్వైరవిహారుఁడు
వీరనివారని మదిన్ వివేకము లఱుచున్. ||16||

ఉ. 'మోవిని మోవిఁ జేర్చు, నది ముద్దిడకున్నను మ్రొక్కుఁగేల, ని
చ్ఛావిధిఁ గౌగిలించు, నది చన్నులనొత్తమి వెచ్చనూర్పుఁ జే
నీవిక నంటు హత్తమికి నెవ్వగఁ బొర్లును బూవుఁబాన్పుపై ,
దైవముఁదిట్టు దిట్టుకొనుఁ ద న్నినుఁ దిట్టును బెట్టు మూర్ఛిలున్. ||17||

చ. 'యమవరుణాదు లెవ్వనికటాక్ష మపేక్ష యొనర్తు రాగమా
గ్రములు యదీయరూపగుణకర్మము లెన్నును వందివైఖరిన్
హిమకరసోదరీరమణుఁ డెవ్వని వాకిటికార్యకర్త యా
యమరవరుండె గోరె నిను నంగన, నీదగుభాగ్య మెట్టిదో! ||18||

చ. 'కొసరులొ చెక్కు నొక్కుటలొ కూకిరవల్ పలికించి పల్కుటో
యొసపరియల్కలో నయములో రతిసుద్దులొ వింతముద్దులో
పసఁ దొడసందుపొందికలొ వాతెరకూర్పులొ ప్రక్కమార్పులో
రసికతలేనిగేస్తురతి రామకు నేమిసుఖంబు దెల్పుమా! ||19||

చ. 'వ్రతములఁ గృచ్ఛ్రకోటి నుపవాసములన్ దనువుల్ కృశింపఁగా

మతి నరతిన్ శిరోవృతిని మౌనముతో మొగమోరగా వడిన్
పితరులయప్పు దీరె[1]ననిపింతురు యౌవనమత్తకాశినీ
తతిహృదయంబు నేచుబలుతాపసులన్ బసులంచు నెంచుమా! ॥20॥

సీ. 'నేఁటి కమవాస్య నేఁటికిఁ బున్నమ
నేఁటికి సంక్రాంతి నేఁడు విషువు
నేఁడు వ్యతీపాత నేఁటికి వైధృతి
నేఁటికి మన్వాది నేఁటికిఁ దిథి
నేఁటి కేకాదశి నేఁటికి ద్వాదశి
నేఁటికి శివరాత్రి నేఁడు వ్రతము
నేఁటికి ఋతుకాలనియమంబు దప్పెను
నేఁటికిఁ బోనిమ్ము నేఁటి కోప
తే. మనుచు దినములు గడపుచు నలసులైన
పాపజాతులు పెండ్లాడి పాలవంటి
వయసు వమ్మొనరింతురు వనితలకును
బుడమి నిల్లాలిపుట్టుక పుట్టనగునె?' ॥21॥

చ. అనుటయు నర్మకోపదరహాసవిలాసలసన్ముఖాబ్జయై
యనియె నహల్య యిట్లనుచు "నమ్మకచెల్ల! యిటాడఁ జెల్లునే?
నను నటువంటిదానిఁగ మనంబునఁ నెంచెదొ యెంచకున్న నీ
యనువున నందువా యెఱుఁగవా మగువా, నను నాదుచిత్తమున్. ॥22॥

ఉ. 'ఎవ్వరి నేను మున్ను మొగ మెత్తి కనుంగొనఁ జూచినావు! నే
నెవ్వరి చెంగటన్ నిలిచి, తెవ్వరితో నగి, తేమి చేసి తే
నెవ్వతె నింద్రుఁ డెవ్వఁడు బళీ! ననుఁ బోఁటికి నిట్టిసుద్దులా
యివ్వనిమూలనున్న నను నేటికి ముంగిటి కీడ్చెదే చెలీ! ॥23॥

ఉ. 'వేది యలంకరించుటయొ వేల్మి కమర్చుటయో హవిస్సులన్
బ్రోదిగఁ జేయుటో కుసుమముల్ గొనితెచ్చుటొ దేవపూజ క
గ్రోదకమాహరించుటయొ యుగ్మలి, మా కిటువంటి సుద్దు లీ
బోదలదానఁ గాను ననుఁ జుల్కనఁగా నెదలోఁ దలంపకే." ॥24॥

తే. అనిన యోగిని యెల నగ వంకురింప
"ఘనకచవు శైలకుచవు సైకతనితంబ
వేను నినుఁ జుల్కఁగా నెంతునే మృగాక్షి!
పంచకన్యలలో నెన్నఁ బ్రముఖ వీవు. ॥25॥

ఉ. ఎంతతపంబు సేసిన మఱెంతపతివ్రతనిష్ఠ నున్నఁ దా
నెంతకృశించినన్ వ్రతము లెన్ని యొనర్చిన నెన్ని పుణ్యతీ
ర్థాంతరముల్ చరించిన నొయారికి రూపవిలాసవంతుఁడౌ
కాంతునిఁ గౌఁగిలించినసుఃఖంబు లభించునటే విలాసినీ! ॥26॥

ఉ. ఎందును సంచరింప కఖిలేంద్రియముల్ సుఖమొంద డెందమున్
బొందుగఁ దన్నుఁ దా మఱవ బుద్ధి కగోచరమైనయట్టి యా
నందము బ్రహ్మ మందు రది నవ్యవయోనవమోహనాంగియౌ

చందనగంధికిన్ దొరకుఁ జక్కనిమక్కువకాఁడు చిక్కినన్. ||27||

ఉ. చేతన మౌటయే యరిది చేతనమైన మనుష్యజన్మ మ
త్యాతతపుణ్యలభ్య మటు లైనను స్త్రీజననం బలభ్య మా
జాతికిఁ గామమున్ సురతసౌఖ్యము హె చ్చది పోవఁద్రోచినన్
పాతక మాత్మహత్యకు సమం బగుపాతక మొక్కటున్నదే? ||28||

ఉ. వారక నత్తగారి కనుబ్రామి, నిజేశ్వరు మోసపుచ్చి యా
యారునుదూరు నై నఁబడి యందరికన్ని ఘటించి యాత్మఁ దా
గోరిననాథునిం గలసి కొల్లలుగా సుఖమందకున్న నా
సారసపత్రనేత్రి యెలజవ్వన మేటికి జన్మ మేటికిన్. ||29||

సీ. కాంతుదంతక్షతిఁ గాంచనిమోవియు
మోవియే చల్లమ్ముగ్రోవి గాక
సరసుండు బట్టని చన్నులు చన్నులా
యల మేకమెడచన్ను లంతె గాక
ప్రాణేశుఁ డనుభవింపని యౌవనమ్ము యౌ
వనమటే నిజమ యవ్వనము గాక
పతిమేన మకరికల్ వ్రాయని వ్రేళ్లును
వ్రేళ్లటే కలజువ్విళ్లు గాక
తే. చంద్రకిరణమ్ము సోఁకిన చంద్రకాంత
మనఁగఁ బదియాఱుకళల జిమ్మనికరంగ
కరఁగి కరగించి కాంతునిఁ గవయకున్న
నారి నారియటే వింటినారి గాక. ||30||

ఉ. ఏలనె జాలి సర్వజగదీశ్వరుడైన సురేశ్వరుండు ని
న్నేలఁదలంచె మేలు గనవే వినవే యరచేతికబ్బు లి
బ్బేలను బేలనుం బలె బలే పలుకందొరకొంటి వైన నీ
కీలు నొకేం తెఱుంగుదు వకీలొనరింతు వికీల వేటికే? ||31||

చ. చిలుకలకొల్కి, నీ సొగసు చిత్తరువందునఁ జూచి కన్నులన్
[2]బలపల నీరునించి తల వంచి తలంచి భ్రమించి మించి హా
వలపుల కేమి సేతు నని ప్రార్థన చేయు నుమామహేశులన్
బలరిపుఁ డమ్మహామహుని భావ మదేమి యెఱుంగఁబల్కవే. ||32||

క. అనిన నహల్య యొకించుక
నునుజెక్కుల నవ్వుదోప నూల్కొన నీకన్
అనుఁ దా ననుతాపనతా
ననతావనతాంగి యగుచు నవమధురోక్తిన్. ||33||

సీ. 'స్వర్ణచిత్రవిచిత్రవర్ణమందిరములా
యాపర్ణసదనంబు లింద్రునకును
సురసిద్ధసాధ్యభాసురదివ్యవీథులా
యాయాశ్రమంబు దేవేంద్రునకును
వరకల్పనాకల్పకరకల్పతరువులా

యీవృక్షములు నందనేశునకును
పటుదానసందానబహుమానగజములా
యీమృగావళులు మహేంద్రునకును
తే. రమ్యసౌందర్యవరకళా[3]ప్రౌఢిమలును
గలిగి చెలఁగినయింద్రాణిఁ గాను నేను
ప్రేమ నాపైని శక్రుఁ డేరీతిఁ బూనుఁ
గ్రొత్తవలపులు వలవరే కుతలపతులు. ॥34॥

సీ. రంభ కైవడిఁ గంబురాగుల్కుపల్కులో
తమిఁగూర్చువలపులో తారరీతి
నూర్వశిచందాన నొరపొందుచిన్నెలో
రక్తిఁ గుల్కుటొ మదాలసవితాన
శశిరేఖయందాన సకలకళాప్రౌఢొ
ఎదురొత్తులిచ్చుటో హేమలీల
మంజుఘోషనిరూఢి మణితానుకూల్యంబొ
మానలీలలో ధాన్యమాలినివలె
తే. నెఱిఁ దిలోత్తమగతి నతిస్నేహగరిమ
నెనయుటో సాగరికరీతి యింతలేని
తపసియిల్లాండ్రపై బాళిఁ దగిలి మిగుల
వగలఁ జెందుదురే తమవంటిదొరలు. ॥35॥

క. సతికిన్ మును జేపట్టిన
పతి నొక్కరుఁ దక్క నితరుఁ బాటించుట సం
గతియటవే నీ కెంతటి
మతిదిటవే యిట్లు నుడువ మర్యాదటవే!" ॥36॥

ఉ. నావుడు యోగినీరమణి నవ్వుచు [4]నెచ్చెలి కొప్పు దువ్వుచున్
"నావచనంబు వేదవచనంబని యెన్నుము బొంకెఱుంగనే
నీవు జనించినప్పుడె సురేంద్రుఁడు నీదగుచెట్టఁబట్టినాఁ
డీవిధి యౌను గాదనిన నీవె మునీంద్రునిచే నెఱుంగుమా! ॥37॥

క. అది సూక్ష్మరూపమంటే
నిది యాతనిస్థూలరూప మిదియదివేఱా!
మదనాశుగసదనాయిత
హృదనాగత ధైర్యవయ్యె దేలా బాలా! ॥38॥

సీ. పతులఁ గాదనుచు గోపాలుతోఁ బోయిన
గొల్లయిల్లాండ్ర కేకొదువ వచ్చె
ధవు లేవు రుండ నారవవానిఁ గోరిన
నాళాయనికి నేమి నయము తగ్గె
ఘటికాద్వయికి నొక్కకాంతుచెంతకుఁ జేరు
పౌలోమి కేపాటి పదవి దప్పె
మగని న టుంచి మార్మగనివెంబడిఁ జన్న
తార కేయిల్లాలితనము తగ్గె
తే. వారి కెవ్వారికిని లేని యారు దూరు

నీ తలనె వ్రాసెనే ధాత నికృతిచేత
నిశ్చలానంద మొందుము నెమ్మి నేఁడు
నలినలోచన! దేవుఁ డున్నాఁడు నాఁడు. ॥39॥

ఉ. ఇంతులపాపముల్ పతుల కింతయె గాని ప్రసక్తి లేదు కా
సంతయు వారి కంచు స్మృతు లన్నియుఁ బల్కును కా దటంచు నిం
తింతయుఁ గల్గెనేని ఋతువైన జనున్ మఱి చింత యేలనే
కాంతకు సమ్మతం బయిన కాంతునిఁ బొందుటె యొక్కనేరమా? ॥40॥

క. రాజీవాక్షి, 'యహల్యా
యై జార' యటంచు నాగమాగ్రస్తుతుఁడౌ
నాజిష్ణు నెనయవే 'యో
షాజారమిదంప్రియ' మను చదు వెఱుఁగవటే!?" ॥41॥

క. జటినీమణి యిటులాడిన
కుటిలాలక యింద్రు నెనయుకోరిక వొడమన్
దటుకునఁ బతిభయ మెసఁగఁగ
నటునిటు ననలేక శబలితాశయ యగుచుఁ. ॥42॥

ఉ. కూరలు కందమూలములు కూళ్లు తలంటులు గారనూనె మా
చీరలు నారపట్ట కయి చేయుట మాకులమందె లేదు కాం
తారమునన్ జరించుట తృణంబులమీఁదఁ బరుండుటల్ మముం
గోరెడువారలుం గలరె కోమలి, నీదువివేక మేమనన్. ॥43॥

చ. మదనుని గుమ్మితీమొనలు మాటికి మర్మములంటఁ బాఱినన్
వదలనికోరికల్ మొలిచి వర్ధిలి డెందమునందె డిందినన్
హృదయము ఱాయి చేసికొని యింపుఁ దలంపక యుండఁగాఁ దగున్
గదలఁ దరంబె యొక్కనికిఁ గంఠము జూపిన కంబుకంఠికిన్. ॥44॥

ఉ. అద్దములోనఁ దోఁచు ముడు పందనిమ్రానిఫలంబు కోపపున్
గద్దరిచిల్వచేఁబడిన గందపుఁదీవె మహావిషంబులో
నద్దినపణ్ణెరంబు మగనా లది కొంచెమునన్ లభించునే
సుద్దులు వేయునేల బలసూదనుతోఁ దెలియంగఁబల్కవే. ॥45॥

సీ. చక్కనివాఁ డింటిచాయకు వచ్చిన
మామగా రూరక మండిపడును
పుట్టింటిలో నొక్కపూట యుండఁగరాదు
కత్తికోతఁగఁబోరు నత్తగారు
నిమిషంబు పొరుగింట నిలిచియుండఁగరాదు
పటుకార్లఁ బట్టును వదినగారు
కడకుఁబోయిన నొక్కకడ నుండఁగారాదు
మఱఁదలు కొండేలమారిబసివి
తే. తోడికోడండ్రు చూపోప కాడుకొండ్రు
[5]పట్టపగ బట్టి పోరాడు బావగారు
జారసంగతిఁ గాంక్షించు చంద్రముఖికి

నత్తగారిల్లె కారాగృహంబు దలఁప. ||46||

క. భావమున నేమికిటుకో
నావంకనె చూచుచుండు నామగఁ డెపుడున్
[6]రావశమో పోవశమో
[7]యీవని కెవ్వానికైన నిందునిభాస్యా! ||47||

క. కాదని నీ మొగమోటకు
నేదయినన్ మంచి దంటినేనియు రతికే
లీదక్షు నతని నెవ్వతె
మేదిని మెప్పింప నేర్చు మేలిమితోడన్. ||48||

క. తారావధూటి యొక్కతె
తారాపతి యొక్కరుండు ధన్యులు జగతిన్
వారివలె సాహసింపఁగ
నేరికి శక్యంబు మగల కింతులకైనన్. ||49||

క. నామనవిగఁ దనపై నిఁక
నీమమతలు మానుమనవె యెవ్వరి కెవరే
కాముపెతల్ నావలె సు
త్రాముని సైరింపుమనుము తామరసాక్షీ! ||50||

ఉ. చుక్కలఱేనిఁ గంతుని నుచుక్కను చక్కదనంబుగల్గు మా
చక్కనిసామి పాదజలజాతము లొదలఁ జేర్చి మ్రొక్కితిన్
చిక్కఁగఁ గౌఁగిలించితిని సేమము వేఁడితి నేడనున్న నీ
ప్రక్కనె యున్నదాన నని భావమునన్ నెనరూనఁబల్కవే. ||51||

సీ. తనగుణంబులు విని ఘనమైన పులకలఁ
గడిమిపూవులగుత్తికరణి నుందు
తనరూపు భావించి తనరినచెమటచే
మధుసిక్తపద్మినిమాడ్కి నుందు
తనవిలాసము నెంచి దర్పకజ్వాలచేఁ
గనకశలాకనఁ గరఁగుచుందు
తనపొందికఁ దలంచి తనువెల్ల జల్లనఁ
జిత్రార్పితాభనిశ్చేష్ట నుందుఁ
తే. జేతనంబయ్యు నేను నచేతనముల
సరణి విరహాఖ్యకల్పావసానజలధిఁ
జేత నీఁదుచుఁ బారంబుఁ జేరఁగాన
ధరణి మగనాలికంటెఁ బాతకియుఁ గలదె? ||52||

మ. విరులెల్లన్ ప్రదరంబులయ్యె విధురుగ్వీచుల్ దలంపంగ బం
ధురహేతిప్రకరంబులయ్యె నళిసందోహంబు లెల్లన్ భయం
కరదుర్వారశిలీముఖప్రతతులై కన్పట్టె నేదిక్కులన్
మరుఁడయ్యెన్ సుఖ మెప్పుడో కలుగుటల్ నాతాపముల్ దీఱఁగన్. ||53||

సీ. ఎన్నటికోకదా యెమ్మెకాని కరంబు

లెత్తి నాకన్నుల నొత్తుకొందు
నెన్నఁటికోకదా హృదయేశుసందిట
నివ్వటిల్లెడు ప్రేమఁ బవ్వళింతు
నెన్నఁటికోకదా వన్నెకానియురంబు
గబ్బిగుబ్బలఁ గ్రుమ్మి కౌఁగిలింతు
నెన్నఁటికోకదా యేలినసామికి
నందంపువాతెఱ విందొనర్తు
తే. నెన్నఁడోకద వగకాని కింపు మెఱయఁ
కంతుకయ్యంపువింతలు గానుపించి
హవుసు చెల్లింతుఁ జెలులలో నతిశయింతు
ననుచు నేనుందు నీయాన హంసయాన! ||54||

తే. ఏఁబరాధీనఁ గావున నింతవంతఁ
గ్రాఁగుచుండంగవలసెను గాకయున్న
నెఱకలను గట్టికొనియైన నెగసివచ్చి
తనయెదను వ్రాల నాచిల్కతాళివలెను. ||55||

ఉ. భారము లాయె నమ్మ కుచపాళికి హారము లేమిసేతు ని
స్సారము లాయె నమ్మ ఘనసారము మన్మథభూతభీమహుం
కారము లాయె నమ్మ కలకంఠనినాదము లమ్మచెల్ల, నా
ధారము లాయెనమ్మ పరితాపభరంబుల కెల్లఁ బ్రాణముల్. ||56||

ఉ. పట్టఁగరాని మోహమునఁ బైకొని తోఁచినవెల్లఁ బల్కి తీ
మట్టునఁ గట్టిపెట్టు మిది మానసమందె ధరిత్రిలోపలన్
పుట్టని యట్టిబిడ్డలకుఁ బూసలు గట్టుదు రమ్మలక్క లే
గుట్టున నుండుదాన నతికోపనుఁ డింటిగృహస్థు యోగినీ! ||57||

క. నాతల్లి వీవు నీతో
నాతలఁ పేమిటికి దాఁచ నాతీ మాయిం
టాతఁ డెపుడైనఁ గలసిన
నాతనిఁగాఁదలఁతు ముకుళితాక్షిద్వయనై. ||58||

తే. అగ్నిహోత్రాల వేళాయె నమ్మ! నీవు
పోయిరమ్మని పంపి యా పొలఁతియుండ
సంభవించును దోషా[8]ధికార మింక
గనుఁగొన నవర్షమని సూరి కన్ను మొగిచె. ||59||

సీ. కరిఘటాహలిపటాశరభటాయసకటా
హములనైల్యముపొంత నణఁగఁదొక్కి
హరిశిలాభరజలాకరపికార్భకకులా
మితకాంతిసంతతి మితము చేసి
ఉరగరాడ్గరదురాధరధరామితశరా
సితరుచిప్రాచుల చేరి చేరి
అళివిభాసురవిభాహరివిభాతులితభా
సంతతాభ్యుదయముల్ సంతరించి

తే. యినసుతాపింఛతాపింఛవనదనికర
ఖంజనాంజనగిరి నీలకంజపుంజ
జంబుకాదంబసైరిభాడంబరములఁ
దాండవించెను దమము భూమండలమున. ॥60॥

చ. తెలుపును నల్పు దిక్కులు విదిక్కులు మేరునగంబు సర్షపం
బిలయు నభంబు దూరము సమీపము హ్రస్వము దీర్ఘమన్న సం
జ్ఞలు గల సృష్టి నేమిటి కొనర్చితి నంచు విరించి యెంచఁగాఁ
బ్రళయపయోధు లొక్కమొగిఁ బర్విన‌టుల్ వెసఁబర్వెఁ జీఁకటుల్. ॥61॥

చ. మదననిదాఘతాపముల మాన్చు ఘనాఘనసంఘమో యనన్
గదిసె మహాంధకారములు కారిశగవేషణతత్పరాత్మలై
కొదుకుచు సందులన్ దిరుగు కొమ్మలు బెళ్కుమెఱుంగు లై రిలన్
వదలనివర్షమయ్యె నిశి పాంథజనంబులకున్ దురంతమై. ॥62॥

తే. తాపము లణంగె భూతసంతతు లెసంగ
నతనుధర్మపరిస్ఫూర్తు లతిశయించె
నుత్తమస్థితి మించెను నుత్తమముగ
ఖరకరాభావమే శుభంకరము ధరను. ॥63॥

చ. ఒక మగనాలు మాఱుమగం డుండునికేత మెఱుంగ కేతమో
వికలత నొక్కెడన్ నిలువ వేఱొకతంచుఁ దదీయభర్త యా
సకియనె కౌగిలింప నది జారుఁ డటంచును జారయంచుఁ దా
రొకరొకరిం దమిం గలసి రుద్ధతి మన్మథుఁ డుబ్బి యార్వఁగన్. ॥64॥

చ. వెడవిలుకాని వేదనల వేఁగుచు దుర్విటు లేఁగఁ జీఁకటిన్
గుడిసెలు పంచలున్ వెడలి కుంటియు గ్రుడ్డియు భుగ్నరుగ్ణ ము
ట్లుడిఁగినయింతి మున్ను వలయోత్కరశబ్దనివేదితాత్మలై
బడిబడిఁ బైఁడిఁదీసిరి తమం బఖిలోత్తమమంచు నెంచుచున్. ॥65॥

ఉ. కప్పులకప్పడంబులును గస్తురిపూఁతలు చాలు నిప్పు డే
చొప్పున నేఁగినన్ మనలఁ జూఁడగలండె త్రినేత్రుఁడేనియున్
ముప్పదినాళ్లు నీదృశతమోవృతి సేయఁగరాదె బ్రహ్మయం
చప్పెనుచీకఁటిన్ వెడలి రారటమై కులటల్ తటాలునన్. ॥66॥

క. ఆయామవర్తి మునివరుఁ
డాయామము నిగమసంహితాభ్యాసకృత
వ్యాయామశ్రాంతమతిన్
సాయామతరుచ్ఛదాస్తృతాజినశయ్యన్. ॥67॥

మ. పవళింపన్ రమణీశిరోమణి రతిప్రారంభసంరంభతన్
ధవుపాదంబులు పట్టి యెత్తెడువితానన్ గోరు సోఁకించినన్
‘నవలా, నీదుచెఱంగు మాసి పదియార్ నాళ్లాయెఁ గాలంబు ద
ప్పె వృథాదోష మిదేల మాను' మన నవ్వేళన్ విలోలాత్మయై. ॥68॥

క. 'త్రిదశాధిపుఁడైతేఁ గద

యద నెఱుఁగుచుఁ గోర్కెఁదీర్చు' నని తనలోనన్
మదనాశుగ మదనాశుగ
మదనాశుగధాటి కదిరి మానిని మునితో. ||69||

శా. "ఔ లెం డంతకుమున్నె మాకుఁ బనిలే దాచోదనే; నిద్రపై
బాళిన్ మీపదమూలమందు శయనింపన్ వచ్చితిన్ జోలి చాల్
చాలుం బొమ్మని యల్క మాఱుమొగమై చందాస్య నిద్రింప న
వ్వేళన్ శాంతమహార్ణవం బనఁగ సంవేశించె నమ్మౌనియున్. ||70||

వ. తదనంతరంబ. ||71||

ఉ. యోగిగతిన్ సురేంద్రుఁడును యోగ మొనర్చి తదీయసూక్తిపై
యోగజరాజగామిని వియోగదశన్ విని దాని చాతురీ
యోగము మెచ్చి కంతుని నియోగము నౌదలఁ దాల్చియంత సం
యోగము సాహసక్రియఁ బ్రయోగము సేయఁగఁగూడదన్ మతిఁన్. ||72||

తే. కోడిగపుఁ గంతుయాతన కోడి వజ్రి
కోడియై కూసె "గొక్కొరోకో" యటంచు
మౌని మేల్కని వామనస్మరణ దనరఁ
గాల మరయక మునుగంగ గంగ కరిగె. ||73||

క. గౌతమవేషమున బెడం
గౌ తమకము మీఱ నిర్జరాధీశుఁడు బా
గౌ తమమునఁ జేరం జని
గౌతమసతికరముఁ బట్టె కౌతుక మెసఁగన్. ||74||

తే. "కొమ్మ యొకపుంజు తనపెంటికోడిఁ దలఁచి
కూసెఁగా కది వేకువకోడిగాదు
ప్రొద్దు వొడువంగఁ దద్దయుఁ బ్రొద్దుగలదు
ముద్దుగా శయ్య కరుదెమ్ము ముద్దుగుమ్మ!" ||75||

వ. అనిన నహల్య శంక మది నంకుర మందఁగ మందహాసయై యనియె 'మునీంద్రవేషమున నాశతమన్యుఁడొ కాక యన్యుఁడోనను఼ జెనకంగవచ్చె మునినాథుఁడు గా'డని ప్రేమయున్ భయంబెనయఁ గరంబుఁ దీసికొని యిట్లనియెన్ గిలికించితంబుగన్. ||76||

చ. 'రతిపతి యంపఱంపముల రంపునఁ గంపమునొంది నేను మున్
రతికయి వచ్చి మచ్చిక లొనర్చినఁ బేర్చినచర్చ 'నొప్పునే
ఋతుదివసంబు దప్పెఁ గడ కేఁగు మ'టంటి విదేమి యిప్పు డీ
గతి బతిమాలె దెవ్వఁడవొ కల్లలు చెల్లవు పల్కు' నావుడున్. ||77||

తే. 'అలశతానంద[9]గురుఁడ గోత్రాధికారి
పరుల శతకోటియుక్తుల భంగపఱతు
నాత్మభూసన్నిధిని నీకరాంబుజంబుఁ
గాంక్షఁ బట్టితి నన్నెఱుంగవె మృగాక్షి! ||78||

చ. అతివల జాలిచేష్టితకళాస్పదమర్మవిభేదభేదియై
జతనగు జవ్వనంబు డిగజాఱకమున్నె యథేష్టభోగముల్
ప్రతిదివసంబుఁ జెందకయె బాలిశుఁడైన జనుండు పిమ్మటన్
గతజలసేతుబంధనము గాఁ దలఁచున్ విషయోపభోగముల్. ||79||

క. ఋతుకాలదినములైనన్
ఇతరదినములైన మఱియు నేదినమైనన్
వితసేయక రతికేళీ
ప్రతియగుకృతి కఘము రాదు వనితా'యనుడున్. ||80||

క. శ్లేషార్థముఁ దెలిసి నిజా
శ్లేషార్థము వచ్చె నలశచీపతి యనుచున్
యోహారత్నంబు తదా
భాషణకౌతూహలానుభావాన్వితయై. ||81||

ఉ. "నాపయి నింత ప్రేమ మునినాథున కెన్నఁడుఁగానఁ గావునన్
నాపతి వీవుగావు కుహనాకృతి వెవ్వఁడవో యెఱుంగ నీ
రూపముఁ జూప కూఱక మరుల్ గొని బల్మి యొనర్చితేని నే
సైఁప నిజంబు పల్కు మీఁకఁ జల్లకు వచ్చియు ముంత దాఁతురే?" ||82||

చ. అనుటయు జాళువామినుకుటంచులదుప్పటివల్లెవాటుతో
ననుపమతారహారకటకాంగదముఖ్యవిభూషణాలితో
ఘనఘనసారసంకుమదకల్పకమాల్యకదంబకంబుతోఁ
గనఁదగియెన్ శచీవిభుఁడు కంతువసంతగతిన్ నిజాకృతిన్. ||83||

ఉ. ఆలలితాంగి యాసురుచిరాంగునిఁ గన్గొనినంతఁ జెమ్మటల్
గీలుకొనంగ మేను బులకించ నకించనధైర్యయై మదిన్
జాలియు బాళిఁ దత్తరము నానఁగ నానఁగ నా నగారి ను
న్మీలదపాంగనీల నలినీదళరాజినిఁ బూజ చేయుచున్. ||84||

ఉ. దేవ, శచీమనోరమణ, దేవర వచ్చిన దేమి?
నీదు శో
భావిభవంబుఁ జూడ;
వనవాసిని కేమిటి చెల్వు?
రత్న మే
తావున నున్న నేమి?
వనితానవమన్మథ, నాపయిన్ గృపో
ద్భావన నానతిచ్చెదవు!
భావజునాన నిజంబుపల్కితిన్. ||85||

క. "నామగనివేషభాషల
నేమిటికి ధరించివచ్చి తెఱుఁగంజెపుమా"
"నీ మగనిరూప మౌటకు
పైమాటలు నడపవలదె పంకజగంధీ!" ||86||

క. "తగవా యిటువలెఁ బల్కఁగ

మగనాలను నేను భువనమాన్యుఁడ వీవున్
నగరాజదమన, నిన్నున్
నగరా యిట్లయిన సురలు నగరావళులన్. ||87||

క. అని పలికి యళుకుఁ గులుకున్
నునుసిగ్గును రాగరసము నూల్కొనుచూడ్కిన్
గనుఁగొనుచు నవలఁ బోవఁగఁ
జని యడ్డముసొచ్చి పాకశాసనుఁ డనియెన్. ||88||

చ. నిలు నిలు మోలతాంగి, కరుణించవె చంపకగంధి, సిగ్గటే
చిలుకలకొల్కి, యంజకవె చిత్తజుపూవులముల్కి, నీపయిన్
పలచితినే మృగాక్షి, పెరవాఁడనటే శుకవాణి, యేనిఁకన్
నిలువఁగలేనె చాన, నను, నీదగుబంటుగ నేలవే చెలీ! ||89||

శా. నామీఁదన్ దయసేయవే పలుకుపంతం బేల వే యేలవే
మోమోటం బొకయింక లేక సకీ, నీ మోమైననుం జూపవే
నీమో వించుక నొక్క నీయఁగదవే నీప్రక్కకున్ జేర్పవే
యేమైనా పలు కాదరించుచు వేత నే నెందాఁక సైరింపుదున్." ||90||

క. అనుచున్ బలరిపుఁ డంతటఁ
జనవును బలిమియును నెనరు సైఁగలుఁ దోపన్
దనకరముల వనితామణి
చనుమొనలకు వేగఁ జాచఁ, జాన యిటాడెన్. ||91||

చ. “సరసము చేయరాకు నునుజన్నులపైఁ జెయి వేయఁబోకు ని
ల్వరమని నల్వురున్ వినుకులన్ గడునిందలు గట్టి యెందుకున్
వెఱవక యాడుకొందు రవివేకమునన్ వల దేల వాదు ని
ర్జరపతి! చాలుఁజాలు మునిరాజు వినన్ మఱి మానమయ్యెడున్. ||92||

చ. "మునిపతి కోపగించినను మోసమటంటివి మోసమేలనో
వనిత, యతండు నిష్కపటి వాహిని కేఁగెను దానమాడ నీ
మనసు కరంగఁగావలెను మక్కువతో ననుఁ గౌగిలించి నీ
ఘనగళశబ్దమంత్రములఁ గాయజభూతముఁ దొలఁగావలెన్. ||93||

ఉ. దూరపుఁగొండలున్ నునుపు దోఁచునటన్నది నిక్కమాయె నో
వారిజగంధి, నీమనసు వచ్చునటంచని వచ్చినాఁడ ని
స్సారము చేయఁగాఁ దగదు చక్కన గా దిది లేనిపోని యా
బీరములేల నాదుమనవిన్ వినవే ఘనవేణికామణీ! ||94||

ఉ. చేర్పుము కౌఁగిటన్ వడిని జిక్కులు బెట్టకు కంతుకాక చ
ల్లార్పఁగ మోవిపానకము లానఁగ ని మ్మిదివేళ శయ్యకుం
దార్పుము జాగు సేయకవె తామరసాక్షి మరుండు సాక్షి కం
దర్పునిమందిరంబునకు దండము దండము మాటిమాటికిన్. ||95||

చ. సతతము నీగుణంబులను జక్కఁదనంబును విందుఁగందు సం
గతిగ ననంగసంగరముఖంబునఁ గోరిక దీర్తువంచు నే

మతిని దలంచి నీకడకు మానిని, వచ్చితి కాదటంటివా
యతనుని యాన నీమగని యాన మఱిన్ మఱి యాన నాపయిన్. ||96||

సీ. కొమ్మ, నీ కమ్మని కెమ్మోవి యీయవే
యమృతంబుఁ గ్రోలిన యరుచి దీఱ
కలికి, నీచనుగుబ్బకవఁ జేరనీయవే
కనకాద్రిపై నున్న కసటు దీఱ
సుదతి, నీకౌగిఁటఁ గదియింపవే కల్ప
సుమతల్పమున నున్న సొలపు దీఱ
వనిత, నీతొడజగ్గుఁ గనుఁగొన నీయవే
రంభతో నెనసిన రట్టుదీర
తే. మస్తుమీఱిన సురహస్తి మస్తకంబుఁ
గుస్తరించిన మామకహస్తములకు
హాయిగా నీ నితంబంబు లంటనియవె
కంటు నామీఁద నేల వాల్గంటి, నీకు.' ||97||

ఉ. కురులకు వందనంబు తెలిగోముముఖంబునకున్ జోహారు నీ
యరుదగు కంబుకంఠమున కంజలి నీ కుచకుంభపాళికిన్
కరములు మోడ్చెదన్ బెళుకు కౌనుకు మ్రొక్కెద పంచబాణ మం
దిరమునకున్ సతీమణి! పదింబదిగా పదివేల దండముల్. ||98||

క. అని చెలిపాదంబులపై
ఘనచింతామణిసురత్నకనకకిరీటం
బును మోపి లేవకుండిన
వనజానన సిగ్గువలపు వడ్డికిఁ బాఱన్. ||99||

క. "దేవుఁడ వేలిన సామివి
పోవయ్యా! నీవు నాకు మ్రొక్కఁగఁ దగునా
లేవు" మని గుబ్బచనుమొన
లా విభునెద సోఁక నెత్తె నంగన ప్రేమన్. ||100||

ఉ. ఎత్తిన పట్టువీడక సురేంద్రుఁడు తత్కుచకుంభపాళిపై
నత్తమిలన్ దురంతవిరహార్ణవపూరము నీదుకైవడిన్
హత్తి రసాలసాలమున నల్లెడు మల్లియతీవకైవడిన్
గుత్తపుగుబ్బలాడి చనుగుత్తులఁ దత్తను వొత్తె సొక్కుచున్. ||101||

ఉ. అంతటఁ గొంతసేపటికి నంగన సిబ్బెపుఁ గుబ్బఁ గ్రుమ్మినన్
స్వాంతము జల్లనంగ బలశాసనుఁ డాసను మోవియాన నొ
క్కింత మొగంబు ద్రిప్పి "పడకింటికి రమ్మట కొన్ని సమ్మతుల్
కాంతుఁడ, నీ వొసంగినను గాని యొడంబడ" నంచుఁ బల్కుచున్. ||102||

తే. చెట్టపట్టుక తనదు పూసెజ్జకడకు
వల్లభునిఁ దోడుకొని పోయి వలపు మెఱయఁ
దొడను దొడఁజేర్చి కూర్చుండి తోయజాక్షి
తోయజాక్షీణరసధార దొలుకఁ బలికె. ||103||

సీ. 'మెఱుఁగువాతెఱ నొక్కకుర యెంగిలయ్యాని'
'యమృతాని కెంగిలి యనఁగ నేమొ!'
'సుద్దిగ నున్నాను వద్దుర మైవ్రాల'
'నతివ, బంగారాని కంటుగలదె?'
'గుబ్బచన్నుల నంటకుర యొక్కప్రొద్దురా'
'చెయ్యంటకయగోటఁ జెనకరాదె'
'జీకిన మడుపువద్దుర నేఁడు నోమురా'
'తరుణి, యైనను నీవె కొఱికియీవె'
తే. 'వ్రతము కలయిక కారాదు వాదు లేల'
'కలయకయె కళలయిక్కువల్ తెలిసి నొక్కి
దక్కి దక్కింతు నే నిన్నుఁ దరుణి! యనఁగ'
నిగ్గుమొగమునఁ గళ దేర నెలఁత యనియె. ||104||

సీ. 'నేను నీ చెక్కులనెలవంక లుంతును
నీవు నాచన్నుల నిలుపరాదు
నేను నీ కేమ్మోవి నెఱగంటు సేయుదు
నీవు నామోవి కందించరాదు
నేను నీకురు లెల్ల నెఱిఁ జిక్కు వఱపుదు
నీవు నాకొప్పుఁ బట్టీడ్వరాదు
నేను నీగళమున మృగనాభి నలఁదుదు
నీవు నా నెమ్మేన నించరాదు
తే. గుటగుటల మీఱిగడిదేటి కూకిపల్కు
లీవు నేనునుఁ బల్కరా దిట్లు సమ్మ
తైన వచ్చెద నీవు రమ్మనినకడకు
వివిధశృంగారరసలోల విబుధపాల!' ||105||

చ. అనుటయు నల్లనవ్వి విబుధాధిపుఁ 'డట్లనె నౌనుగాక యం
చన గురికట్టునిల్చునటె యంగజుకేళి' నటంచుఁ జేర్చి న
క్కున ననబోఁడి చన్మొనలఁ గ్రుమ్మె సురేంద్రుఁడు మోవియానెఁ గం
జనయన చెక్కుఁగీటెను గచాకచిఁ బోరిరి వార లిర్వురున్. ||106||

వ. ఇట్లు మదనకదనారంభసముజ్జృంభమాణమనోభిలాషలనయ్యహల్యాసుందరీపురండరులమందానందకరచందనాదికస్తూరికా పరిమళద్రవ్యంబులకు సొమ్మసిలియుండి రప్పుడమ్మందయాన బృందారక బృందవందితపదారవిందుడగు నాసంక్రంచనునింగలయు మోహావేశంబునంబట్టలానిగుట్టునం జిట్టాడుచు మట్టుమీఱి యతండు కౌఁగిటం జేర్చినంజేర్పనీయక యబ్బురఁపు గబ్బిసిబ్బెంపుగుబ్బలనిబ్బరంబునఁ జెయిసోఁకిన సోఁకనీయక కటికిచీఁకటికప్పులన్ గుప్పునన్ గప్పుకొప్పు నిమిరినన్ నిమురనీయక మిక్కిలి యెక్కువయైన చక్కని చెక్కు గీటినం గీటనీయక మధుర సుధారసధారాధురంధరంబైన బింబాధరంబు గ్రోలినం గ్రోలనీయక కుందనపుటందంపుగెంటెనపూవునుం గుంటుపఱుచు తుంటవింటిపాదుసాహిదివాణంబు నంటిన నంటనీయక మెండొడ్డుకొని యేమఱించి యొయ్యనొయ్యన విరులశయ్యకుఁ జేర్చి లాలించి కౌఁగిలించి యదలించి బాహాబాహిఁ గచాకచిం బెనంగి యల్లందులకుం గమకించి నీవి వదలించి చివురుసవురు జవురు మోవితేనెలఁ గ్రోలి పైకొని కోకిలచందంబున శ్రవణానందంబుగా గుటగుటం బలుకుచు

"మేలు, బళీ, హౌసు, శాబాస"ని మెచ్చియొకరొకరిమేను లప్పళించి
వింతవింతపిలుపులం బిలుచుచుఁ గెందామరలంబోలు కందామరల నరమోడ్పులు
గావించుచు మన్మథబ్రహ్మానందంబునుం బొంది మఱియును. ||107||

శా. 'ఔనే ముద్దులగుమ్మ, చూచి తవునే యందంపుఁబూరెమ్మ, మే
లౌనే చక్కఁదనాలయిక్క, యదెమేలబ్జాస్త్రుచేఢక్క, యౌ
దౌనే యింతులమేలుబంతి, భళి శిస్తౌనే కళల్ దొంతి, మి
న్నౌనే' యంచు మఱిన్ బురందరుఁ డహల్యాభామ నీక్షించుచున్. ||108||

సీ. 'ఎన్నఁడు నేర్చితే యింతులమేల్బంతి,
పారావతారావపాటవంబు
యెపు డభ్యసించితే యిందుబింబానన,
వివిధచుంబనకళావిభ్రమంబు
యెచ్చోట నేర్చితే యేణీవిలోచన,
నఖరాంకవిన్యాసనైపుణంబు
యేనాఁ డెఱింగితే చీనిచక్కెరబొమ్మ,
పంచబాణాహవప్రౌఢిమంబు
తే. మూలనున్నట్టి జడదారి ముద్దరాల
వెన్నిచిన్నెలు నేర్చితే యెమ్మెలాడి,
మేలు మే'లని కాంతుఁడు మెచ్చి పొగడ
వింతవింతగ మఱియును సంతసమున. ||109||

సీ. వెనుదీయకుమటంచు వెడవిల్తుఁ డాడించు
జాటిపోలికఁ గీలుజడ చలింప
స్మరసంగరంబునఁ గురియు పూవులవాన
తెఱఁగున సరులముత్తెములు రాల
మరుఁడను జగజెట్టి బిరుదువీణెలమాడ్కి
గళరవంబున జమత్కార మెసఁగఁ
జిత్తజరాజ్యాభిషేకాంబువులమాడ్కి
జల్లుగాఁ జెమటచిత్తళ్ళు గురియ
తే. మదనపరదేవతాధ్యానమహితనిష్ఠఁ
బోలి యఱమోడ్పుఁగనుదోయి పొలుపు మీఱ
నంబుజేక్షణ పురుషాయితంబు సలిపె
నెలమి నమరావతీంద్రు దేవేంద్రుఁ గూడి. ||110||

వ. అప్పుడు. ||111||

ఉ. భావము లొక్కటయ్యెను బ్రపంచ మొకించుక తోఁచదాయె నే
నీ వను భేదమున్ జనె యనిర్వచనీయ మఖండ మాత్మసా
క్ష్యావిదితంబు నద్వయ మనంతమునౌ సుఖ ముప్పతిల్లె నిం
దీవరగంధికిన్ బతికి నిర్భరసౌరత మొంది పొందుచోన్. ||112||

సీ. చంద్రమండలసుధాసార మూరినయట్లు
చెమటచే నెమ్మోము చెలువు మీఱ
అంకుశక్షతమదహస్తికుంభములన

గోటిపోటులఁ జిన్నిగుబ్బ లెసఁగ
మగతేఁటి వ్రాలిన మంకెనవిరిలీలఁ
గావిమోవినిఁ బంటికాటు తనర
గాలికిఁ గదలెడు కదళిక రీతిగా
గడగడమని తొడల్ వడఁకుచుండ
తే. జాళువాగట్టుమీఁదను వ్రాలినట్టి
నీలమేఘంబు చొప్పున నెరులు కటిని
వ్రాల సురతాంతమున లేచి లీల నిలిచె
నింపున నహల్య యవ్వేళ నింద్రుదెసను. ||113||

ఉ. వేకువజాము దోఁచి నళిబృందగరుద్భవవాతసంహతి
స్తోకదళద్దగత్ స్ఫురితతోయరుహప్రసరన్మరందధా
రాకలితోదకద్విగుణితాంచదభంగతరంగభంగి ప
ద్మాకరశీకరాంతరవిహార ముదారసమీర మంతటన్. ||114||

సీ. మరుసాముకండెముల్ గిరికొన్నతొడలతోఁ
దడబాటు చెందిన నడలతోడ
గుబ్బచన్నులను జిక్కులు వడ్డ సరులతో
నెరికొప్పునను జాఱువిరులతోడ
గజిబిజి పలుగంటిగమి కావిమోవితో
నెఱిఁ దప్పి వదలిన నీవితోడఁ
గెంపారు నెలవంకగుంపులటెక్కుతో
సోగకన్నుల నిద్రసొక్కుతోడ
తే. మిగులఁ జెదరినయలకల మెయిపులకల
కెలఁకు లరయుచుఁ జిలుకలకొలికి యపుడు
దురుసునడలను గేళిమందిరము వెడలె
నలరువిలుకాని మదహస్తి యౌ ననంగ. ||115||

చ. వెలువడి యింతటంతటను వేగిరపాటున నొంటిపాటునన్
గలయఁగఁ జూచి చూచి శచికాంతుని మెల్ల నహల్య పిల్చి బల్
మెలఁకువతోడుతన్ బనుప 'మీఁదటి బుద్ధి యిఁకేమి పల్కితే
వెలఁదిరొ, పోయివత్తునటవే దిటవే' యని యింద్రుఁ డిట్లనెన్. ||116||

మ. 'తరుణీ, యేమని పల్కుదున్ గమనవార్తల్ పల్కనోరాడదే
మఱి కాదంచని యెంచి పోదునన రామా, నేఁడు కాళ్ళాడదే
సరసన్ నిల్చిన వచ్చు నీపతి యథేచ్ఛన్ నిల్వఁగాఁ గూడదే
కఱవాయెన్ గదె ముచ్చటల్ మనకు రాకల్ పోక లిం కేడవే. ||117||

ఉ. నీవును నేను నొక్కయెడ నెమ్మది నెమ్మదిగూడి యుండుటల్
భావమునందు సైఁపకను పాపపుదైవత మిట్లు చేసె నే
నేవహిఁ దాళఁజాలు దిఁక నెన్నఁడు మర్వకుమీ ననుం దయా
భావనచేత' నంచు సురవర్యుఁడు వల్కిన కల్కి ప్రీతిగన్. ||118||

సీ. 'మోహనాకార, నీమోముఁ జూచినఁ జాలు
సొబగైన చందురుఁ జూడనేల?

మదనావతార, నీపెదవి యానినఁ జాలుఁ
గండచక్కెరపానకం బదేల?
సరస, నీనెమ్మేనిచాయ సోఁకినఁ జాలుఁ
గనకాభిషేకంబు కాంక్ష లేల?
శృంగారమూర్తి నీ చెట్టఁబట్టినఁ జాలు
నరిదితామరఁ గేల నంటనేల?
తే. కళల ననుఁ జాల మెప్పించి కౌఁగిలించి
నీవి వదలించి కదియించి నేర్పు మించి
రతులఁ దేలించి మదనసామ్రాజ్య మేలు
నేలికను నిన్ను నెడబాయఁజాల' ననుచు. ॥119॥

చ. సరసిజపాళిఁ దుమ్మెదలు చాలుగ నిల్చినరీతి దేవరాట్
కరకమలంబులన్ దనదు కన్నులఁ గాటుకరేక దాకఁగా
హరు వమరంగ నొత్తుకొని యంగన కన్నుల నీరునించి 'యీ
విరహము నెట్లు ద్రోతుఁ దగవే యెడబాయుట' లంచుఁ బల్కఁగన్. ॥120॥

చ. 'కలకంఠీమణి, పోయివచ్చెదఁ గటాక్షం బుంచు నామీఁదన ని
న్నెలమిన్ నమ్మినవాఁడ' నంచు సురరా జిట్లాడినన్ మందహా
సలసద్వక్త్రము వాడఁ బ్రోడ మదిలో సంతాపమున్ గూడఁ జం
చలమై ధైర్యము వీడ నింద్రుఁ గని వాంఛాలోలితస్వాంతమై. ॥121॥

ఉ. 'నమ్మినదాన, నాతనువు నమ్మినదానను నీకు; నింక నే
నమ్మకచెల్ల, నన్ను విరహాగ్నికి బాల్పడఁజేసి పోవుటల్
సమ్మతమాయెనా, విడువఁజాలితివా, యెటులైన నిన్ను నేఁ
బొమ్మనఁజాలఁ, జాలినను బొందినిఁ బ్రాణము లుండనేర్చునే. ॥122॥

చ. అని యిటు పల్కి పల్కి బిగియారఁగఁ గౌఁటఁ జేర్చిచేర్చి గ్ర
క్కున మధురాధరంబుచవిఁ గ్రోలుచుఁ గ్రోలుచుఁ బాకశాసనున్
బనుప నతండు మెల్లఁగను బ్రక్కలు చూచుచుఁ బోవుచుండగా
మునివరుఁడైన గౌతమునిముందఱ నింద్రుఁడు గానఁగాఁ దగెన్. ॥123॥

ఉ. కంటికి నిద్రసొక్కు మయిఁ గాడిఁన గాజులనొక్కు మోవిపై
నంటిన పంటిరక్కు సొగ సైనసిగన్ బలుచిక్కు గోటిచే
గెంటినముద్దుచెక్కు రహిఁ గీల్కొనియుండినవానిగా మదిన్
గంటున గౌతముండు తెరగంటిదొరం గని యాగ్రహంబునన్. ॥124॥

ఉ. చండకరాభుఁడైన మునిచంద్రుఁడు కోపముతోడ 'నోరి, యా
ఖండల, కండగర్వమునఁ గన్గొనలేక మదీయకాంత ను
ద్దండత నాదువేషమునఁ దద్దయుఁ బొందితి వట్లుగాన నీ
వండవిహీనుఁడై తిరుగు' మంచని మించి శపించె నెంచకన్. ॥125॥

చ. ఇటు శపియించి గౌతమమునీంద్రుఁడు వేగ నిజాశ్రమస్థలిన్
గిటుకునఁ జేరి కోప మెదఁ గీల్కొన భార్యను బిల్వ నంతలో
దిటవెడలంగ నంగన మదిన్ దడబాటు చెలంగ మానిచెం
గట వినయంబుతో నిలిచెఁ గాళ్ళకు నీళ్ళను గొంచు గొబ్బునన్. ॥126॥

ఉ. ఆతఁటి నాలతాంగిని మహోగ్రహదృష్టినిఁ జూచి 'యోసి, నీ
చేతిజలంబు లంటనికఁ జెల్లునె యెంతటి జంతవే బలా
రాతిని గోరి కూడితివి రాతిరి జామునఁ గావునన్ బలా
రాతిశరీర మందు'మని రాజముఖిన్ సునఖిన్ శపింపఁగన్. ||127||

క. గడగడ వడఁకుచుఁ దడఁబడి
పడఁతుక జడదారిచరణపంకజములపైఁ
బడి 'శాప మెపుడు గడతున్
నుడువు'మనన్ బలికెఁ గరుణ నూల్కొన మునియున్. ||128||

సీ. 'బలువైన రావణప్రముఖుల సమయింప
హరి జగద్విఖ్యాతి నతిశయించి
చెలువుగా దశరథక్షితిభర్త కుదయించి
రామనామఖ్యాతి రహిని మించి
మునిమాట విని తాటకిని గీటణంగించి
యతని యాగము గాచి యతిశయించి
చతురుఁడై జనకరాజతనూజను వరించి
మహితకీర్తులు గాంచి విహిత మెంచి
తే. మౌనివరుతోడ నివ్వనమార్గమునను
వరుస నిఁకమీద రాఁగలవాఁ డతండు
నిజపదసరోజరేణుల నీదుశాప
మోచనము సేయఁగలఁ' డంచు మునియుఁ బలికె. ||129||

ఉ. అంతట నమ్మహాత్ముఁడు నిజాశ్రమవాటిఁ బరిత్యజించి దు
ర్దాంతదురంతకేసరివితానమహోగ్రవరాహవాహజి
ద్దంతురదంతిపన్నగముఁ దాపసబంధితవల్కశాటికా
త్యంతవిలాసభృన్నగమునౌ హిమవన్నగ [10]మొందె నయ్యెడన్. ||130||

వ. అంతఁ గొంతకాలంబునకు, నిక్ష్వాకువంశపయఃపారావారరాకా చంద్రుండగు దశరథమహారాజేంద్రునకు, దేదీప్యమానమార్తాండమండల సమధాముండును, వైరీకాంతారప్రళయకాలదావానలప్రభాసముద్దాముండును, అనంతకళ్యాణగుణాభిరాముండును నై శ్రీరాముండు విష్ణుమూర్తి పూర్ణావతారంబున జనియించి, దినదినప్రవర్ధమానుండై యుండు నవసరంబునఁ దనుప్రభావిజితమిత్రుండగు విశ్వామిత్రుండు చనుదెంచి, దశరథానుమతంబున, విమతఖండనశౌండభుజదండసంపాదితకీర్తిసాంద్రుండైన శ్రీరామచంద్రుని సకలాఘౌఘనివారణసుముఖంబగు మఖంబుఁ గాచుటకై తోడ్కొనిపోవ, నమ్మహావీరుండు, సింహశరభశార్దూలప్రముఖనానావిధమృగయూథశరణ్యంబగు నరణ్యంబుఁ బ్రవేశించి, బహువిధకామరూపనిరాఘాటసంచారితశృంగాటక యగు తాటకిన్ వధియించి, నీచులగు సుబాహుమారీచుల నుక్కడంగించి, యమ్మౌనియాగంబుఁ గాచి నిరంతర ప్రబోధధానియగు జనకరాజ రాజధానింగుఱించి వచ్చునప్పుడు, పురోభాగంబున విజ్ఞానసూర్యప్రభాసరస్తతముని గౌతముని యాశ్రమంబుఁ గనుంగొని. ||131||

చ. 'మునివర, యేమి యీవనము ముచ్చటగాఁ దగియుండియున్ వృథా
జనకులహీనమై యిరిణసన్నిభమై కనుపట్టె నేమకో

వినియెద' నంచు వేఁడు రఘువీరునికిన్ గుశికాత్మజుండు ప
ల్కెను మది సంతసం బలర లీలఁ దదాశ్రమవర్తమానముల్. ||132||

ఉ. 'భూతలమందు మౌనికులముఖ్యుఁడు గౌతముఁ డంచనన్ దపః
ఖ్యాతిని దీటు లేదన జగత్త్రయమందుఁ బ్రసిద్ధినందు న
య్యాతనియాశ్రమం బిది మహాశ్రమవారణకారణంబు రా
చూతువుకాని యందు నొకచోద్యము హృద్య' మటంచుఁ బల్కుచున్. ||133||

క. ఆరాముని గౌతమముని
యారామస్థానవాటికై పిల్చు చహ
ల్యారామశాపహృతిపై
యారామగతిన్ మునీంద్రుఁ చ్చటి కేఁగెన్. ||134||

క. అందందుఁ జూచుకొనుచును
ముందఱ రఘురాముఁ డపుడు పోవుచునుండన్
కెందమ్మిఁ బోలుపాదము
లందలి రేణువులు ఱాతి నందినయంతన్.[11] ||135||

మ. మృదువై మెల్లన కొంతసేపటికి సద్వృత్తంబుగా నౌచుఁ బెం
పొదవన్ గొంత కరంగి సోఁగయగుచున్ బొల్పొంది యారాయి చ
క్కదనం బేర్పడి మోహనాకృతి చెలంగఁ యౌవనశ్రీ తగన్
సుదతీరత్నముగాఁగ నిల్చెను మదిన్ జోద్యంబు వాటిల్లఁగన్. ||136||

చ. వినయముగాను మౌనియలివేణియుదారపదారవిందముల్
కనుఁగొనుచుఁ రఘూద్వహుఁడు గ్రక్కునఁ దాను నమస్కరించె నా
వనిత యొసంగు దీవనలవల్లను నుల్లము పల్లవింపఁగా
మునిమునిమీసముల్ కులుకు మోమున నవ్వు దొలంకుచుండఁగన్. ||137||

క. ఆతఱి గనుఁగొని బిరబిర
గౌతమముని యేఁగుదెంచి గౌరవ మొప్పన్
నాతిసమీపముఁ జేరిన
యాతనిఁ గని రామచంద్రుఁ డానందమునన్. ||138||

చ. ముదము మదిన్ బొసంగ 'మునిపుంగవ, రాముఁడ నే' నటంచుఁ ద
త్పదయుగపాళికిన్ దనదు ఫాలము సోఁక నమస్కరించి యిం
పొదవఁగఁ జెంతఁ జేరిన రఘూద్వహునిన్ ముని యాదరించి సం
పద లిగురొ త్తఁ గౌశికుని పట్టు కనుంగొని పల్కెఁ బ్రేమతోన్. ||139||

సీ. “జంభారిమణి వృత్తసంభారదోస్తంభ
భూషణుం డకలంకభాషణుండు
భాషాపతి మహామనీషావిశేషార్థ
ధారణుం డాప్తసాధారణుండు
చండభానురుచి ప్రచండకాండనిరస్త
తాటకుం డఖిలలోకాటకుండు
అధ్యాత్మవిద్యానిదిధ్యాసవిధ్యాత్మ
భావనుం డఖిలైకపావనుండు

తే. భద్రనిర్ణిద్రుఁడగు రామభద్రుఁ డస్మ
దీయభద్రేభయానను దీనశరణ
చరణసరసిజరేణులఁ బరమకరుణ
శాప మెడలింపఁ గంటివా తాపసేంద్ర!' ||140||

క. అని పలుకుచు గౌతమముని
తనచెంత మెలంగు రామధరణీశ్వరుతో
మనమున సంతసమందుచు
ననియెను సమ్మతముగాఁగ నపు డందఱికిన్. ||141||

సీ. 'బహుజన్మకర్మసంభవపాపజలరాశి
మరుభూమితలముగా మెఱయఁజేయు
నజ్ఞానపటలఘోరాగాధకూపంబు
నెడలేక పూడ్చి యేర్పడఁగఁ జేయు
నమితదుర్మోహకృత్రిమరత్నదీధితుల్
మరలనీయక క్రమ్మి మరుఁగుచేయు
నప్రాప్తితాపకృత్ర్యసనదిక్కోణంబు ?
తెలియకుండువిధంబుఁ గలుగఁజేయు
తే. నబ్జసంభవముఖనిఖిలామరాళి
మస్తకకిరీటవిన్యస్తమణిగణఘృణి
ఘటితభవదీయచరణపంకజపరాగ
రాజి వర్ణింప నెవరితరంబు రామ! ||142||

ఉ. ఖ్యాతిని నీదుపాదకమలాంచితరేణురజంబుఁ దాల్ప ని
శ్చేతనమైన జాతి కొకచేతన మబ్బె నటన్న నట్టిచో
జేతనవృత్తినున్న సురసిద్ధులు సాధ్యులు మౌళిఁ దాల్చి యే
రీతిగ నుందురో తెలియ రెవ్వరు రామ, భవత్పదంబులన్.' ||143||

క. ఇటు కొనియాడుచు నుండిన
జటిలుని వీడ్కొనుచు రామచంద్రుఁడు మిథిలా
పుటభేదనమున కేఁగెను
తటకాపడి కౌశికుండు తనతో రాఁగన్. ||144||

ఉ. అంతటఁ బ్రేమ గౌతముఁ డహల్యయు నుల్లము లుల్లసిల్లఁగాఁ
జింతలు దీఱ నొండొరులు జిత్తజుకేళికళావిలాసముల్
వింతలుగా ఘటించుచును వేడుకతోడుతఁ గూడియుండి యిం
తంతనరాని సౌఖ్యముల నందిరి ముచ్చటమీఱ నెప్పుడున్. ||145||

క. ఈకథఁ జదివిన వినినన్
బ్రాకటముగ వ్రాయఁగనిన బహుసంపదలన్
గైకొను మనుచున్ వారికి
శ్రీకరుఁడగు రంగవిభుఁడు ప్రేమ నొసంగున్. ||146||

శా. కస్తూరీతిలకోజ్జ్వలస్మితముఖా కైవల్యలక్ష్మీసఖా
హస్తోదంచితశంఖచక్రరుచిరా హస్తీంద్రరక్షాపరా

అస్తోకామృతవర్షివేణునినదా యానందలీలాస్పదా
త్రస్తాస్తోకజనాభయప్రదకరా ధారాధరశ్రీకరా! ||147||

క. సారఘనసారనవకా
శ్మీరపటీరాంగరాగశీతలతటదా
ధారమణీకుచదుర్గయు
గారోహవిహారలీల యదుకులబాలా! ||148||

మాలిని. దళితవిపులమాయా ద్రావిడామ్నాయగేయా
జలరుహదళనేత్రా సవ్యసాచీష్టమిత్రా
బలివిభవవిరామా భానువంశాబ్ధిసోమా
కలశజలధిశాయీ కామితార్థప్రదాయీ! ||149||

✶ గద్య ✶

ఇది శ్రీమత్పాండ్యమండలాధీశ్వర శ్రీ విజయరంగ చొక్కనాథ మహీ
నాథకరుణాకటాక్ష సంపాదిత గజతురంగ మాందోళికా ఛత్ర చామర
విజయదోహళ కాహళ భూరిభేరీబిరుదధ్వజ ప్రముఖాఖిల
సంపత్పారంపరీసమేధమాన సముఖ మీనాక్షీనాయక
తనూభవ శ్రీ మీనాక్షీదేవీ కటాక్ష
లబ్ధకవితాసాంప్రదాయక వేంకట
కృష్ణప్పనాయక ప్రణీతంబైన
యహల్యాసంక్రందనంబను
మహాప్రబంధంబునందుఁ
దృతీయాశ్వాసము.

సర్వంబును
సంపూర్ణము.

[1] ననిపించిన
[2] వలవల
[3] ప్రౌఢిమములు
[4] నచ్చెలి
[5] పంటపగ
[6] రావశమా పోవశమా
[7] యిాపని
[8] భిసార
[9] గురుఁడు
[10] మొందెఁ బొందుఁగన్
[11] చెన్నపుర ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునఁగల D 386 నెంబరు వ్రాత ప్రతిలో గ్రంథ మింకమీద నీవిధమున ముగింపఁబడినది.

క. వనరాశిఁ జనించిన శ్రీ
వనజాక్షియొ యెదురుకొనిన వనదేవతయో
వనవసదావళిమించో
యని యెంచఁగ జాయి చెలువయై చెలు వగుచున్.136

సీ. ముని దలమున్క లౌ మోహాంధకారంబు
వెనుక దీసినరీతి వేణి తనర
శాపరూపదినాంతచంద్రోదయములీల
మొలకనవ్వుల ముద్దుమోము మెఱయ
బహుకాలపరిచితోపలత యంటిన మాడ్కి
కఠినవక్షోజయుగ్మంబు గులుక
తదదృశ్యభావంబు తవిలి పోవని ఠీవి
గడుసన్నమౌ వలె గౌను వడక
తే. క్షితిని లోహంబులను పైఁడి చేయు స్పర్శ
వేది నొగి రామపాదారవిందరజము
పూని శిల పైఁడి చేసిన నాన మించ
కాంత యై నిల్చె గౌతమకాంత యపుడు.137

క. తన మునుపటి వృత్తాంతము
మునిపతి వీరలకుఁ దెలుప ముప్పే యనుచు
ఘనలజ్జానతముఖి యౌ
వనితకు రఘునందనుండు వందన మిడియెన్.138

తే. పెండ్లికొడుకవు గమ్మని ప్రేమ మౌని
రామ దీవించి శ్రీ రఘురామవిభునిఁ
బూజ గావించుచున్న నద్భుతము గాఁగ
గౌతముఁడు వచ్చి యా రాముఁ గాంచి పొగడె.139

(ఖడ్గబంధము)

క. సౌరధరధీర రఘువర
పారదధర నీరజారి భవకీర్తిరమా
మారీచమదవిరామా
నీరదనిభకాయ రామ నృపతిలలామా!140

ఉ. శ్రీరఘురామ నిన్ను నుతి సేయఁగ నెంతటివాఁడ నేను నీ
పేరు దలంచి నంత నతిభీకరదుష్కృతముల్ దొలంగు నీ
చారుపదాబ్జసంగతిని సంభవ యౌట పవిత్ర గాదె భా
గీరథిలీల విభ్రమరకేళిని నంచు నహల్యఁ గైకొనెన్.141

మ. దివి వర్షించె ప్రసూనవర్ష మపు డందెల్ మ్రోయ నాడెన్ సుధా
శి వధూబృందము దివ్య దుందుభులు మ్రోసెన్ ....
....
....142

తే. అంత సంతుష్టచిత్తుఁ డై యక్షపాదుఁ
డధిప కాకుదమయ్యె నీయంఘ్రిపద్మ
మనుచు పొగడుచు కాంతఁ దోడ్కొనుచుఁ జనియె
సంతసిల్లుచు మునికులచంద్రుఁ డపుడు.143

క. అని శ్రీ వైశంపాయన

మునిముఖ్యుఁడు దెలుప విని ప్రమోదాన్వితుఁ డై
జనమేజయమహిపాలుఁడు
అనురాగము పొందుచుండె ననవరతంబున్.144

ఉ. కౌస్తుభచారువక్ష సితకంజదళాక్ష కళిందకన్యకా
నిస్తులనీలవర్ణ కమనీయ చరాచరమాననీయ ప
ద్మాస్తనకుంకుమాంక నవమండన దానవదర్పఖండనా
కస్తురిరంగ రంగపురకైరవపూర్ణకురంగలాంఛనా!145

క. కుందారవిందసుందర
మందారసుకీర్తిహార మహితవిహారా
వందారుజనాభీప్సిత
బృందారకరత్న సమరభిన్నసపత్నా!146

మత్తకోకిల. చంద్రపుష్కరిణీతటాంచలచార చారణసన్నుతా!
మంద్రనీరదమాలికాసుకుమార మారశతోపమా!
సాంద్రసత్కరుణానవామృతసార సారసలోచనా!
ఇంద్రచంద్రదినేంద్రముఖ్య సురేశ యీశవిభావితా!147

[గద్యము—సమానమే.]